అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 12-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 131 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

ధర్మ పోరాటం

బ్లాక్ డే విజయవంతం



వివరాలు 6లో



- ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలి
- శాంతి భద్రతలు మినహా మిగతా అన్ని అంశాలపై ఢిల్లీ సర్కార్‌దే నియంత్రణ : రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు





ప్రభుత్వానిదే సర్వాధికారం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో పాలనా సర్వీసులపై నియంత్రణాధికారం ఎవరికి ఉండాలనే వివాదంలో అరవింద్ కేజ్రీవాల్ సర్కారుకు సుప్రీంకోర్టులో భారీ విజయం లభించింది. ప్రభుత్వాధికారులపై ఎన్నికైన ప్రభుత్వానికే సర్వాధికారాలు ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ మేరకు గురువారం ప్రధాన న్యాయమూర్తి ...5లో

- మహారాష్ట్ర గవర్నర్, స్పీకర్ చర్యలు సరైనవి కావు
- అయినా ఉద్ధవ్‌ను సీఎంగా చేయలేం : శివసేన కేసులో సుప్రీం ఏకగ్రీవ తీర్పు



చట్టవిరుద్ధమే...

న్యూఢిల్లీ : చట్టానికి అనుగుణంగా మహారాష్ట్ర గవర్నర్, అసెంబ్లీ స్పీకర్ వ్యవహరించలేదని సుప్రీం కోర్టు పేర్కొంది. అయినా ఉద్ధవ్ థాకరే ప్రభుత్వాన్ని పునరుద్ధరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయలేమని తెలిపింది. శివసేనను ...5లో

ఆర్‌ఎస్‌ఎస్ నిజ స్వరూపమిది!

- పాక్‌కు రహస్య సమాచారం కేసులో సంఘ్ కార్యకర్త కురుల్కర్ అరెస్ట్
- మోడీ, అమిత్‌షా సమాధానం చెప్పాలి..కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ : పాకిస్తాన్ ఏజెంట్‌కు రహస్య సమాచారం అందించారనే ఆరోపణలపై అధికార రహస్యాల చట్టం కింద అరెస్టయిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రదీప్ ఎం.కురుల్కర్ ఆర్‌ఎస్‌ఎస్ క్రియాశీల కార్యకర్త అయిన కాంగ్రెస్ ...5లో

మోడీ గారడీ ఫలించేనా ?

అన్ని అస్త్రాలూ ప్రయోగించిన బీజేపీ

కర్నాటకలో మరోసారి అధికారాన్ని దక్కించుకొని, తద్వారా దక్షిణాదిలో బలపడాలని కలలు కంటున్న బీజేపీ భవితవ్యం రేపటితో తేలిపోతుంది. దక్షిణాదిన పాగా వేయాలన్న ఉద్దేశంతోనే ప్రధాని నరేంద్ర మోడీ కర్నాటకలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్ల దృష్టిని సమస్యల నుండి మళ్లించేందుకు ఆయన చేయని ప్రయత్నమంటూ లేదు. అక్కడ మీడియా కూడా తన వంతు పాత్ర పోషించి మోడీ ప్రచారానికి విశేష ప్రాధాన్యత కల్పించింది. మోడీ ఆ రాష్ట్రంలో పర్యటించకపోతే మీడియా దృష్టి మొత్తం స్థానిక అంశాలపై కేంద్రీకృతమై ఉండేది.

- అయినా ప్రజల్లో చల్లారని అసంతృప్తి
- రేపు కర్నాటక ఫలితాలు



బెంగళూరు : ఓ వైపు మోడీ, ఇతర బీజేపీ నేతలు సుడిగాలి పర్యటనలతో రాష్ట్రాన్ని హోరెత్తించినా కార్మికులు, రైతులు, యువకులు మాత్రం తమ సమస్యలను, ఇబ్బందులను మరచిపోలేదు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని కవిత అనే దినసరి కార్మికురాలు ప్రశ్నించారు. బియ్యం, పప్పులు, నూనెలు, సబ్బులు, షాంపూలు, వంటగ్యాస్...ఒకటేమిటి ? అన్నింటి ధరలూ పెరిగాయని ఆమె వాపోయారు. మోడీ పువ్వుల సువాసనలు ఆస్వాదిస్తూ స్నానం చేస్తారని, ఖరీదైన కొత్త బట్టలు కట్టుకుంటారని, అయితే దానివల్ల ఎవరికి ప్రయోజనమని నిలదీశారు. బీజేపీ హయాంలో ఉద్యోగాలు దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కనీసం రేషన్ అయినా లభించేదని ఇపుడు మోడీ ...5లో

పత్రికా స్వేచ్ఛకు పెను ముప్పు

- మీడియాపై పెరిగిన సర్కారు పెత్తనం
- మోడీ సేవలో తరిస్తున్న కార్పొరేట్ మీడియా
- పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయంలో సీపీఐ (ఎం) ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను సీపీఐ (ఎం) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ అణచివేత చర్యలు, భయపెట్టే చర్యలు పత్రికా స్వేచ్ఛకు పెనుముప్పు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పాత్రికేయులపై జరుగుతున్న హింసను ప్రస్తావిస్తూ పార్టీ అధికార పత్రిక పీపుల్స్ డెమొక్రసీ తాజా సంచికలో సంపాదకీయం ప్రచురితమైంది. పాత్రికేయులపై రాజద్రోహం సహా పలు చట్టాల కింద కేసులు నమోదు చేస్తున్నారని ఆ వ్యాసంలో సీపీఐ (ఎం) విమర్శించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పత్రికలలో వార్తలు ప్రచురించిన ప్రతి సందర్భంలోనూ ఈ విధమైన కేసులు ...5లో

16 నుంచి డిగ్రీ ప్రవేశాలు

- విద్యార్థుల కోసం 'దోస్త్' యాప్
- స్కిల్ ఓరియెంటెడ్ కోర్సుల ప్రారంభం : లింబాద్రి.

నవీన్ మిట్టల్ వివరాలు 2లో..

డిగ్రీలో 86 వేల సీట్లకు కోత

- 15 మందిలోపు విద్యార్థులున్న కోర్సులు రద్దు వివరాలు 2లో..
- ఉన్నత విద్యామండలి నిర్ణయం



ఇమ్రాన్ అరెస్టు అక్రమం

- తక్షణమే విడుదల చేయండి: పాక్ సుప్రీం ఆదేశాలు
- కోర్టు ధిక్కరణ చర్యే
- ఎన్ఏబీ వ్యవహార శైలిని తప్పుబట్టిన న్యాయస్థానం

ఇస్లామాబాద్ : తక్షణమే మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని పాకిస్తాన్ సుప్రీంకోర్టు గురువారం ...6లో

మండుతున్న ఎండలు

- జైన, వీణవంకలో 44.3 డిగ్రీల ఎండ
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక
- ఒకటెండ్రు రోజుల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే అవకాశం



వివరాలు 2లో..

ప్రపంచ గమనం

సిరియాను తిరిగి చేర్చుకున్న అరబ్ లీగ్



దమాస్కస్: సిరియాను తిరిగి చేర్చుకోవటానికి అరబ్ లీగ్ అంగీకరించింది. రియాద్‌లో మే19న జరగనున్న శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ నిర్ణయం జరగటం గమనార్హం. కైరోలో జరిగిన అరబ్ లీగ్‌కు చెందిన ప్రముఖ దౌత్యవేత్తల అంతర్గత సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. సిరియా అంతర్యుద్ధ నేపథ్యంలో 2011లో సిరియాను అరబ్ లీగ్ నుంచి సస్పెండ్ చేశారు. అనేక అరబ్ దేశాలు సిరియాతో తమ సంబంధాలను తెంచుకోవటమే కాకుండా సిరియా అధ్యక్షుడు బషర్ అస్సాద్ శత్రువులకు తమ మద్దతును పలికారు. సిరియా అంతర్యుద్ధ కాలంలో అనేకరకాల తిరుగుబాటు దారులకు వివిధ దేశాలు మద్దతు పలికాయి. వీరిలో ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టులు కూడా ఉన్నారు. అయితే సిరియా ఈ తిరుగుబాటుదారులను రష్యా, ఇరాన్ దేశాల సహాయంతో అణచివేసింది.

టర్కీ మద్దతుగల మిలిటెంట్లు ఉత్తర సిరియాలోని కొన్ని భాగాలను నియంత్రిస్తున్నారు. మరోవైపు సిరియా ఈశాన్య ప్రాంతం అమెరికా మద్దతుగల కుర్దిష్ మిలీషియా నియంత్రణలో ఉంది. ఎక్కువ చమురు బావులు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇవి అమెరికా సైనిక ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉన్నాయి. గత వారం అమ్మాన్‌లో సిరియా, సౌదీ అరేబియా, జోర్డాన్, ఈజిప్ట్, ఇరాక్ విదేశాంగ మంత్రులు సమావేశమై సిరియా భూభాగంలో టెర్రరిస్టు కార్యకలాపాలను నిలిపివేయాలని, సిరియా అంతర్గత వ్యవహారాలలో విదేశాల జోక్యం కూడదని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా సిరియా తన భూభాగంలో సార్వభౌమాధికారాన్ని కలిగివుండటానికి కావలసిన మద్దతును తాము ఇవ్వదలిచామని కూడా ఈ సమావేశం ప్రకటించింది.ఈ మధ్యకాలంలో సిరియా, యమెన్‌లతోసహా ఈ ప్రాంతంలో ఘర్షణలను నివారించే ప్రయత్నం దౌత్య వర్గాల ద్వారా జరుగుతోంది. గత నెలలో సిరియా విదేశాంగ మంత్రి ఫైజల్ మెక్దాద్ సిరియా ప్రభుత్వాన్ని వ్యతిరేకించే శక్తులకు మద్దతు పలికిన సౌదీ అరేబియాను దర్శించాడు. సిరియా విదేశాంగ మంత్రి పర్యటన తరువాత సిరియా ప్రాదేశిక సమగ్రతకు, ఐక్యతకు సౌదీ అరేబియా తన మద్దతును ప్రకటించటమే కాకుండా 12సంవత్సరాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధానికి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనటంలో కూడా తన సహకారం ఉంటుందని చెప్పింది. ఇలా అరబ్ దేశాల మధ్య ఐక్యతను సాధించటానికి భూమికగా సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య చైనా మధ్యవర్తిత్వంతో కుదిరిన సంధి ఉన్నది.

రష్యా చమురు దిగుమతిపై ఆంక్షలు

- కోట్లు కోల్పోతున్న పోలెండ్



వార్సా: రష్యా నుంచి చమురు దిగుమతిపైన పోలండ్ ఆంక్షలు విధించింది. దీంతో పోలండ్ ఇతర దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. రష్యా చమురు ధరతో పోలిస్తే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు ధర చాలా ఎక్కువ. దీంతో పోలెండ్ ప్రతిరోజూ 27మిలియన్ డాలర్లను అదనంగా చమురు దిగుమతిమీద వెచ్చించవలసిన పరిస్థితి ఏర్పడిందని పోలెండ్ ప్రభుత్వ చమురు సంస్థ పీకేఎన్ ఓర్లెన్ సీఈఓ ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు చెప్పాడు. తమకు ఈ స్థాయిలో నష్టం జరుగుతున్నప్పటికీ పోలెండ్ రష్యాపై ఆక్షలను విధించవలసిందేనని గట్టిగా పట్టుపడుతోంది.

రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోవటం ఆపాలని పోలెండ్ 2022 మార్చిలో నిర్ణయించింది. అంటే పీకేఎన్ ఓర్లెన్ ప్రతి బ్యారెల్‌కు 30డాలర్లు అదనంగా చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడిందని డేనియల్ ఒబాజ్టెక్ తెలిపారు. రష్యా చమురును దిగుమతి చేసుకోని ప్రతి కంపెనీ చెల్లిస్తున్న అదనపు ధర ఇది. సముద్ర మార్గంలో రష్యా చమురును దిగుమతి చేసుకోవటాన్ని యూరోపియన్ యూనియన్ నిషేధించినప్పటికీ రష్యాను ఉక్రెయిన్, బెలారస్, పోలెండ్, హంగరీ, స్లోవేకియా, చెక్ రిపబ్లిక్, ఆస్ట్రియా, జర్మనీ దేశాలతో కలిపే ద్రుజ్బా పైప్ లైన్ ద్వారా రష్యా చమురును దిగుమతి చేసుకోవటాన్ని ఇప్పటివరకూ మినహాయించింది.

రష్యా చమురును యురోపియన్ యూనియన్ దేశాల్లో నిషేధించాలనే నిర్ణయాన్ని పోలెండ్ గట్టిగా సమర్థించింది. అయినప్పటికీ పోలెండ్ రష్యా చమురును ద్రుజ్బా పైప్ లైన్ ద్వారా దిగమతి చేసుకుంది. చమురు దిగుమతికి చేయవలసిన చెల్లింపులను పోలెండ్ నిలిపివేసినందున రష్యా చమురును ఎగుమతి చేయటాన్ని ఆపింది. అయినప్పటికీ చెక్ రిపబ్లిక్‌లోని తన చమురు శుద్ధి కర్మాగారంలో పోలెండ్ రష్యా చమురును శుద్ధి చేస్తోంది. మరోవైపు జర్మనీ కజఖ్ చమురును రష్యా యాజమాన్యంలోని ద్రుజ్బా పైప్ లైన్ ద్వారా దిగుమతి చేసుకోవటాన్ని పోలెండ్ తప్పుపడుతోంది. రష్యాపై ఎన్ని ఆంక్షలను విధించినా ఐరోపా దేశాలు మధ్యవర్తుల ద్వారా రష్యా చమురును దిగుమతి చేసుకుంటూనే ఉన్నాయి.

మండుతున్న ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోత కూడా రోజురోజుకీ పెరిగిపోతున్నది. తెలంగాణ స్టేట్ డెవలప్ మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం జగి త్యాల జిల్లా జైనలో, కరీంనగర్ జిల్లా వీణ వంకలో అత్యధికంగా 44.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యా యి. ఈ ఏడాది మే నెల లో ఇదే అత్యధిక ఉష్ణో గ్రత. వచ్చే రెండ్రోజుల్లో రోజువారీ కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పలు జిల్లాల్లో 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. జగిత్యాల, మంచిర్యాల, నల్లగొండ, ఖమ్మం, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల ను టీఎస్‌డీపీఎస్ రెడ్ జోన్‌లో చేర్చింది. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లోనూ 43 డిగ్రీలు దాటే అవకాశమున్న నేపథ్యంలో ఆ జిల్లాలూ ఆరెంజ్ హెచ్చరికల జాబితాలో చేరాయి.

అయితే, హైదరాబాద్ నగరంతో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడొచ్చు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మోచా తుఫాన్‌గా మారింది. ఉత్తర- వాయువ్యదిశలో ప్రయాణిస్తూ అది కాస్తా తీవ్ర తుఫాన్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో ఆ తుఫాన్ మరింత బలపడి ఆగ్నేయ బంగ్లాదేశ్-ఉత్తర మయన్మార్ మధ్యలోని సిట్వె సమీప ప్రాంతంలో తీరం దాటే అవకాశముంది. ఆ సమయంలో గంటకు 140 నుంచి 150 కిలోమీటర్ల గాలులు వీయొచ్చు. దీని ప్రభావం వల్ల రాష్ట్ర ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు.

జైన (జగిత్యాల)	44.3 డిగ్రీలు
వీణవంక (కరీంనగర్)	44.3 డిగ్రీలు
తాడిచర్ల (భూపాలపల్లి)	44.1 డిగ్రీలు
ముత్తారం (పెద్దపల్లి)	43.8 డిగ్రీలు

16 నుంచి డిగ్రీ ప్రవేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ బీసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్‌ను గురువారం ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ విడుదల చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం (ఓయూ), కాకతీయ విశ్వ విద్యాలయం (కేయూ), తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ), పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ), తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం (టీడబ్ల్యూ యూ) పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో దోస్త్ ద్వారా ప్రవేశాలు జరగనున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నది. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, టి వ్యాలెట్, బిల్ డెస్క్, ఆటం టెక్నాల జీస్, భారత్ పే ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లిం చాల్సి ఉంటుంది. ఈనెల 20 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నది. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన వచ్చేనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో విశ్వ విద్యాలయాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాల్లో చేపడతారు. వచ్చేనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు పూర్తి వివ రాలకు https://dost.cgg.gov.in వెబ్ సైట్ ను సంప్రదించాలి. ఈ ఏడాది రిజిస్ట్రేషన్లకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా దోస్త్ యాప్‌ను అందు బాటులోకి తెస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, కళాశాల విద్యాశాఖ జేడీ డిఎస్ ఆర్ రాజేందర్‌సింగ్, ఆర్జేడీ జి యాదగిరి, అకడమిక్ గైడెన్స్ అధికారి డి తిరు వెంగళచారి, ఐసీటీ అధికారి యమునారాణి, దోస్త్ హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ విజయరెడ్డి, రూసా రీసెర్చ్ అధికారి డి వసుంధర, సీజీజీ ప్రాజెక్ట్ మేనేజర్ పి హేమంత్ పాల్గొన్నారు.

40 హెల్ప్‌లైన్ కేంద్రాలు

డిగ్రీ ప్రవేశాల కోసం మూడు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా 40 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో ఒకటి, విశ్వవిద్యాలయాల పరిధిలో ఆరు, జిల్లా కేంద్రాల్లో 33 చొప్పున మొత్తం 40 హెల్ప్‌లైన్ కేంద్రాలున్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ఆధారంగా విద్యార్థులు దోస్త్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దోస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మీసేవా/ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా విద్యార్థులు బయోమెట్రిక్ ద్వారా చేసుకోవచ్చు. తెలంగాణలో ఇంటర్ చదివిన విద్యార్థులు టీయాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా దోస్త్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశమున్నది. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కాలేజీల్లో సీట్లు పొంది ఈపాస్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న వారు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కోసం ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రయివేటు కాలేజీల్లో సీట్లు పొంది ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత లేని విద్యార్థులు రూ.వెయ్యి చెల్లించాలి. రిజర్వేషన్ల కింద సీట్ల కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీసేవా కులధ్రువీకరణ పత్రం నమోదు చేయడం తప్పనిసరి. 2022, ఏప్రిల్ ఒకటి తర్వాత తీసుకున్న ఆదాయ ధృవీకరణ పత్రం మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఎన్‌సీసీ, అదనపు కరిక్యులర్ యాక్టివిటీస్, వికలాంగులు, సీఏపీ ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి.

దేశానికే మోడల్ దోస్త్ : లింబాద్రి, నవీన్ మిట్టల్

దేశానికే మోడల్‌గా దోస్త్ ఉన్నదని ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాల విధానం ఆదర్శవంతంగా కొనసాగుతున్నదని అన్నారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చి ఈ విధానాన్ని పరిశీలించి అమలు చేస్తున్నాయని వివరించారు. 2019లో ప్రభుత్వ, 2020లో ప్రయివేటు కాలేజీల్లో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) వల్ల విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని చెప్పారు. ఆప్షన్లు ఎక్కువ ఇచ్చేందుకు అవకాశమొచ్చిందన్నారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 11 ఉన్న ఆప్షన్ల నుంచి 50కిపైగా పెరిగాయని వివరించారు. ఎస్టీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే రిజర్వేషన్లను అమలు చేస్తామన్నారు. ఈ ఏడాది కొత్తగా స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. బీబీఏ లాజిస్టిక్స్, బీఎస్సీ యానిమేషన్ వంటి కోర్సులుంటాయని అన్నారు. బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రవేశపెడుతున్నామని వివరించారు. మూడేండ్లు చదివితే బీఎస్సీ డిగ్రీ, నాలుగేండ్లు చదివితే బీఎస్సీ ఆనర్స్ ధ్రువపత్రం ఇస్తామని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో 11 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంటుంద న్నారు. ఆ కోర్సు ఫీజుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ విద్యార్థుల కోసం పరిశ్రమల వారు ఎదురుచూస్తున్నారని చెప్పారు. దోస్త్ పరిధిలోకి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును తెచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

దోస్త్ నోటిఫికేషన్ వివరాలు

వివరాలు	తేదీలు
తొలివిడత రిజిస్ట్రేషన్	16.5.2023 నుంచి 10.6.2023 వరకు
వెబ్‌ఆప్షన్ల నమోదు	20.5.2023 నుంచి 11.6.2023 వరకు
సీట్ల కేటాయింపు	16.6.2023
సెల్ఫ్‌రిపోర్టింగ్	16.6.2023 నుంచి 25.6.2023 వరకు
రెండో విడత రిజిస్ట్రేషన్ (రూ.400 ఫీజు)	16.6.2023 నుంచి 26.6.2023 వరకు
వెబ్‌ఆప్షన్ల నమోదు	16.6.2023 నుంచి 27.6.2023 వరకు
సీట్ల కేటాయింపు	30.6.2023
సెల్ఫ్‌రిపోర్టింగ్	1.7.2023 నుంచి 5.7.2023 వరకు
మూడో విడత రిజిస్ట్రేషన్	1.7.2023 నుంచి 5.7.2023 వరకు
వెబ్‌ఆప్షన్ల నమోదు	1.7.2023 నుంచి 6.7.2023 వరకు
సీట్ల కేటాయింపు	10.7.2023
సెల్ఫ్‌రిపోర్టింగ్	10.7.2023 నుంచి 14.7.2023 వరకు
కాలేజీల్లో చేరే గడువు	10.7.2023 నుంచి 15.7.2023 వరకు
ఓరియెంటేషన్ తరగతులు	11.7.2023 నుంచి 15.7.2023 వరకు
డిగ్రీ తరగతులు ప్రారంభం	17.7.2023

పంచాయతీ కార్మికులకు పరిష్కారం చూపరా..?

- తొలగిస్తామంటూ ఇండ్లకు నోటీసులు
- ఎంపీడీవోల నుంచీ తీవ్ర ఒత్తిడి
- సంఘీభావం తెలుపుతున్న సీపీఐ(ఎం), విపక్షాలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నాలుగేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసిన నేపథ్యంలో తమ సర్వీసును క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో పక్షం రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్)పై ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. సమస్యను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నట్టు సంకేతాలు పంపుతూనే.. హెచ్చరికలూ చేస్తోంది. దీనిలో భాగంగా విధుల్లో చేరని పంచాయతీ కార్యదర్శులను తొలగిస్తామంటూ ఇండ్లకు నోటీసులు అంటిస్తోంది. ఈ చర్యతో.. ఉద్యోగం నుంచి తీసివేస్తారేమోనని పలువురు జేపీఎస్‌లు భయాందోళనకు గురవుతున్నారు. అయితే ఎక్కువ మంది మాత్రం భయపడ కుండా సమ్మె కొనసాగిస్తున్నారు. గత మంగళవారం సాయంత్రం 5 గంటలలోగా విధుల్లో చేరకపోతే టెర్మినేట్ చేస్తామనే హెచ్చరికలతో కూడిన నోటీసులను రాష్ట్రంలోని 9,355 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడంతో కొందరు విధుల్లో చేరారు. వీరిలో ధైర్యం నింపి తిరిగి సమ్మెలోకి వచ్చేలా జేపీఎస్ నేతలు ప్రయత్నిస్తుండగా.. ఎంపీడీవోలు అడ్డుకునేందుకు పూనుకుంటున్నారు. విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు ఊడుతాయంటూ ఎంపీడీవోలు తమ పరిధిలోని కార్యదర్శులకు హెచ్చరికలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో పలువురు ఎంపీడీవోలు ఇలాంటి అల్టిమేటం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎంపీడీవోలు కూడా వివిధ సమస్యలపై ఆందోళనలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. రాష్ట్రంలోనూ ఇదే తరహాలో జరుగుతున్నట్టు తెలిసింది.

నాలుగేండ్లయినా అదే తీరు..

2019 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామానికి ఓ కార్యదర్శి ఉండాలనే తలంపుతో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రిక్రూట్ చేసింది. 2018లోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో మూడేండ్ల ప్రొబేషన్ పీరియడ్‌గా పేర్కొంది. ఆ తర్వాత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అసెంబ్లీ సాక్షిగా మరో ఏడాది పాటు ప్రొబేషన్ కాలపరిమితి పెంచినా పంచాయతీ కార్యదర్శులు మిన్నకుండి ప్రభుత్వానికి సహకరించారు. విధుల్లో చేరి నాలుగేండ్లు పూర్తయ్యాక కూడా రెగ్యులరైజ్ చేయకపోవడంపై ఆందోళనకు దిగి సమ్మె కొనసాగిస్తున్నారు.కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని, అలాగే జాతీయ స్థాయిలో ఇటీవల తెలంగాణకు 13 స్వచ్ఛ అవార్డులు రావడంలోనూ జేపీఎస్‌లే కీలకంగా పనిచేశారనే విషయాన్ని వారు సమ్మె సందర్భంగా లేవనెత్తుతున్నారు.

విధుల్లో చేరికపై ఊగిసలాటలో జేపీఎస్‌లు..

క్రమబద్ధీకరణపై సమ్మె కొనసాగించాలని జేపీఎస్‌లు పట్టుదలతో ఉన్నప్పటికీ ప్రభుత్వ నోటీసులతో సర్వీసు నుంచి రిమూవ్ చేస్తారనే భయం వారిని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాల్లో పలువురు విధుల్లో చేరుతున్నారు. కొందరు విధుల్లో చేరిన వారు సైతం వెనక్కి వచ్చి సమ్మె కొనసాగిస్తున్నారు. మరికొందరు మెడికల్ లీవ్‌లో ఉన్నా ప్రభుత్వం వారి సెలవును పరిగణలోకి తీసుకోకుండా నోటీసులు జారీ చేయడం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లాలో 463 మందికి గాను 60 మంది కార్యదర్శులు విధుల్లో చేరారు. విధుల్లో చేరని వారి విషయమై ప్రభుత్వానికి నివేదించినట్టు డీపీవో వీవీ అప్పారావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 377 మందికి 15 మంది విధుల్లో చేరారు. అధికారుల ఒత్తిడి భరించలేకే విధుల్లో చేరామని వారంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1108 మందికి మహబూబ్‌నగర్‌లో 26 మంది విధుల్లో చేరారు. వారిలో 13 మంది వెనక్కి వచ్చారు. నాగర్‌కర్నూల్‌లో ఆరుగురు చేరినా తిరిగి సమ్మెలో పాల్గొంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 882 మంది ఉండగా సెలవులో ఉన్నవారిని సైతం విధుల్లోకి రావాలని అధికారులు అల్టిమేటం జారీ చేస్తున్నారు. కరీంనగర్‌లో 260 మంది పూర్తిస్థాయిలో సమ్మెలో ఉన్నారు. రంగారెడ్డి, వికారాబాద్‌లో 646 మందికి సెలవులో ఉన్నవారు తప్ప మిగతావారందరూ సమ్మె కొనసాగిస్తున్నారు. హన్మకొండ జిల్లాలో 129 మందికి 49 మంది విరమించగా 80 మంది సమ్మె కొనసాగిస్తున్నారు.

వివిధ పార్టీలు, సంఘాల మద్దతు

జేపీఎస్‌లకు బీఆర్ఎస్సేతర పక్షాలతో పాటు వివిధ సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. ఖమ్మం నూతన కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేతలు గురువారం సందర్శించారు. జేపీఎస్‌ల న్యాయసమ్మతమైన రెగ్యులరైజేషన్ డిమాండ్‌ను నెరవేర్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సమ్మెకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంఘీభావం తెలుపుతూ కూసుమంచి ఆందోళనలో పాల్గొన్నారు. జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ విషయమై సీఎంకు లేఖ రాసినట్టు చెప్పారు. జేపీఎస్‌ల ఆందోళనకు మద్దతు తెలిపాలని పార్టీ శ్రేణులకు సైతం పిలుపునిచ్చారు.

విధుల్లో చేరితే సానుకూలంగా స్పందిస్తామంటున్న మంత్రి

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగంలో చేరేటప్పుడే యూనియన్ పెట్టం, సమ్మెకు దిగం, ప్రభుత్వం ఎప్పుడు క్రమబద్ధీకరించినా తమకు సమ్మతమే అని తెలిపిన జేపీఎస్‌లు సమ్మెకు దిగడం సమంజసం కాదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అంటున్నారు. రెగ్యులరైజేషన్ తప్పకుండా అవుతుందని, సీఎం కేసీఆర్ స్కేల్‌కూడా ఇచ్చారనే విషయాన్ని మంత్రి ప్రస్తావిస్తున్నారు. అగ్రిమెంట్‌కు వ్యతిరేకంగా జేపీఎస్‌లు వ్యవహరించటం సరికాదంటున్నారు. సమ్మె విరమించి విధుల్లో చేరితే సానుకూలంగా స్పందిస్తామని మంత్రి చెబుతున్నారు. అగ్రిమెంట్ ప్రకారం కోర్టులకు వెళ్లినా చెల్లుబాటు కాదని అంటున్నారు.



డిగ్రీలో 86 వేల సీట్లకు కోత

15 మందిలోపు విద్యార్థులున్న కోర్సులు రద్దు

- ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో 86,670 సీట్లకు కోత పడింది. 15 మంది విద్యార్థుల కంటే తక్కువ మంది చేరిన కోర్సులను ఉన్నత విద్యామండలి రద్దు చేసింది. ఇంకోవైపు సున్నా ప్రవేశాలు నమోదైన పలు డిగ్రీ కాలేజీలను మూసేసింది. దీంతో డిగ్రీ సీట్లకు భారీగా కోత పడింది. 2022-23 విద్యాసంవత్సరంలో 1080 డిగ్రీ కాలేజీల్లో 4,73,214 సీట్లున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలో 1054 డిగ్రీ కాలేజీల్లో 3,86,544 సీట్లకు తగ్గాయి. అంటే 86,670 సీట్లకు కోతపడింది. ఇంకోవైపు 26 డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయి. అయితే కొన్ని కాలేజీలు తక్కువ మంది చేరిన కోర్సుల్లో ఉన్న సీట్లను డిమాండ్ ఉన్న ఇతర కోర్సుల్లోకి కన్వర్షన్ చేశాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీలు ప్రమాదంలో ఉన్నాయి. వాటిలో విద్యార్థులు చేరకపోవడంతో సీట్లు భారీగా మిగులుతున్నాయి. గత విద్యాసంవత్సరంలో 30 మంది విద్యార్థుల్లోపు 184 కాలేజీలు, 50 మంది విద్యార్థుల్లోపు సుమారు 250 కాలేజీలుండడం గమనార్హం. ఇంకోవైపు ఏటా డిగ్రీ కాలేజీల్లో సీట్లు మిగులుతుండడంతో సీట్లు తగ్గించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం, డిగ్రీ కాలేజీల్లో ఎక్కువ సీట్లు ఉండడం మరో కారణంగా ఉన్నది. ఉదాహరణకు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రస్తుతం 2,95,550 మంది విద్యార్థులయ్యారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో మరో 50 వేల మంది పాసవుతారు. అందరూ కలిపినా 3.45 లక్షల మంది అవుతారు. ఇందులో సుమారు 70 వేల మంది ఇంజినీరింగ్‌లో చేరతారు. మరో పది వేల మంది వరకు ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశం పొందుతారు.

ఇంకో 50 వేల మంది వరకు ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీలు, ఇతర రాష్ట్రాలతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ వంటి కోర్సుల్లో చేరేందుకు మొగ్గు చూపుతారు. దీంతో ఇంటర్ పాసైన విద్యార్థులు సుమారు 2.45 లక్షల మంది మాత్రమే మిగులుతారు. ఇందులోనూ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మరో 30 వేల మంది ప్రవేశం పొందుతారు. ఇక ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో చేరే విద్యార్థులు 2.15 లక్షల మంది వరకే ఉంటారు. కానీ ఈ ఏడాది దోస్త్ పరిధిలో 3,86,544 సీట్లున్నాయి. అందుకే డిగ్రీ కాలేజీల్లో ఎక్కువ సీట్లు మిగులుతున్నట్టు కనిపిస్తున్నాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. విద్యార్థుల్లేకుండా సీట్లు ఎలా భర్తీ అవుతాయని అన్నారు.

పనులపై ప్రతిరోజూ సమీక్ష

- సాగునీటి శాఖ ఈఎన్సీ మురళీధర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలో ఆపరేషన్, నిర్వహణ పనులను ప్రతిరోజూ సమీక్షించాలని ఆ శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు ఇటీవల జరిగిన సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అధికారులు పంపిన ఆయా ప్రతిపాదనలకు పనుల కమిటీ ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఈనెల 31లోగా పనులు పూర్తిచేయాలని సూచించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ తనిఖీలకు వెళ్లాలని ఆదేశించారు. వర్షాకాలం కంటే ముందే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు చేయించడంలో వెనుకబడితే, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దున్నపోతులతో గాంధీభవన్ ముట్టడిస్తాం

గోసుల శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యాదవ వృత్తిని అవమానించేలా మాట్లాడిన పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వెంటనే ఆ సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలని లేకుంటే దున్నపోతులు, పొటేళ్లతో గాంధీభవన్ ముట్టడిస్తామని యాదవ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గోసుల శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు గోసుల శ్రీనివాస్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

సెట్విన్ ఆధ్వర్యంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సెట్విన్ ఆధ్వర్యంలో జంట నగరాల్లో త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో నడుపుతున్న మినీ బస్సుల్లో 15ఏండ్లు పూర్తయిన వాటిని తొలగించి వాటిస్థానంలో దశలవారీగా కొత్త బస్సులను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి ఆయన గోల్కొండ నుంచి చార్మినార్ రూట్లలో ఒక బస్సు, సికింద్రాబాద్ మెహిదీపట్నం రూట్లలో మరో బస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెట్విన్ ఆధ్వర్యంలో జంట నగరాల్లో 100 మినీ బస్సులను నడుపుతున్నామని, వాటిని దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి వీలుగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, సెట్విన్ ఆధ్వర్యంలో వత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని వివరించారు. సెట్విన్ బస్సు ఆపరేటర్లు ప్రయాణికులతో సత్సంబంధాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలని కోరారు.

బస్సులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలవాల ని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణు గోపాలరావు, మేనేజర్ ఎంఏ.వోయిజ్, సెట్విన్ మినీబస్సుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, అలీ షేర్‌ఖాన్, నాయకులు డి సుదర్శన్‌రెడ్డి, హసన్‌అలీ, అబ్దుల్లాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి : టీఎన్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నర్సుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నర్సింగ్ సమితి (టీఎన్ఎస్) డిమాండ్ చేసింది. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయ్ కంపాటి, వ్యవస్థాపక అధ్యక్షులు కురుమేటి గోవర్దన్ ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చలేదని తెలిపారు. నర్సుల హెూదాను స్టాఫ్ నర్సు నుంచి నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చడం వల్ల ప్రభుత్వంపై పైసా భారం పడబోదని, అయినా వారి హెూదాను పెంచడం లేదని వాపోయారు. వైద్య నియామక మండలిలో నర్సులకు ప్రాతినిథ్యం లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. 2014 నుంచి నర్సింగ్ కౌన్సిల్‌కు ఒక్కరే రిజిస్ట్రార్‌గా కొనసాగడం, కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రయివేటు రంగంలో పని చేసే నర్సులకు రూ.26,000 కనీస వేతనాలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022లో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ప్రయివేటు, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసే సీనియర్ నర్సులకు ఏడాదికి ఒక మార్కు వెయిటేజీ అనే పద్ధతిని రద్దు చేయడంతో 35 వేల మందికి అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నియమాల ప్రకారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను నర్సులతో భర్తీ చేయాలనీ, ఆ నియమానికి భిన్నంగావాటిని బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్‌లకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ బీ.యస్సీ (నర్సింగ్) కళాశాలల్లో పురుషులకు అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇండియన్ బ్యాంక్ మరో రెండు శాఖల ఏర్పాటు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ జంట నగరాల్లో మరో రెండు కొత్త శాఖలను తెరిచింది. చందానగర్, యాప్రాల్‌లో ఏర్పాటు చేసిన నూతన శాఖలను ఆ బ్యాంక్ ఫీల్డ్ జోనల్ మేనేజర్ గనేశరామన్ ఎ లాంచనంగా ప్రారంభించారు. వీటితో తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ బ్యాంక్ శాఖలు 162కి చేరగా.. దేశ వ్యాప్తంగా 5814 శాఖలకు విస్తరించినట్లయ్యింది. నూతన శాఖల ప్రారంభోత్సవంలో జోనల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్ సహా ఇతర అధికారులు, ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



సంపాదకీయం

ఇమ్రాన్ విడుదలకు పాక్ సుప్రీం ఆదేశం!

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఒక అవినీతి కేసులో మంగళవారం నాడు అరెస్టు చేసిన తీరును అక్కడి సుప్రీం కోర్టు తప్పుపట్టింది. అరెస్టు అక్రమం అంటూ తక్షణమే విడుదలకు గురువాతరం ఆదేశించింది. తమ నేత నిర్బంధాన్ని నిరసిస్తూ పాకిస్థాన్ తెహరిక్ ఇ ఇన్సాఫ్(పిటిఐ) పార్టీ ఆందోళనకు పిలుపునివ్వటంతో పాటు సుప్రీం కోర్టులో సవాలు చేసింది.

> ఉక్రెయిన్ సంక్షోభంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా మాస్కో వెళ్లి పుతిన్‌తో భేటీ కావటం పాకిస్థాన్‌లో అమెరికా అనుకూల శక్తులకు మింగుడు పడలేదు. పాక్ సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ జావేద్ బజ్వా రష్యా వైఖరిని ఖండించాలని కోరగా ప్రధానిగా ఉండగా తాను తిరస్కరించానని, తరువాత అమెరికాను సంతుష్టీకరించేందుకు బజ్వా స్వయంగా ఖండించినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇమ్రాన్ ఖాన్ ఒక సభలో వెల్లడించారు. అమెరికా వ్యూహాత్మక భాగస్వామిగా ఉన్న భారతే తటస్తంగా ఉన్నప్పుడు పాక్ ఒక పక్షంవైపు ఎందుకు నిలబడాలని ప్రశ్నించారు.

గురువారం సాయంత్రం వరకు అందిన వార్తల ప్రకారం హింసా కాండలో ఎనిమిది మంది ప్రాణాలు పోగా వందలాది మంది గాయపడ్డారు. తమ మద్దతుదారులు 50మంది మరణించినట్లు పిటిఐ చెబుతోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మిలిటరీ రంగంలోకి దిగింది. ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్లను నిలిపివేశారు. వేలాది మందిని అరెస్టు చేశారు. ఎక్కడేం జరుగుతోందన్నది పూర్తిగా వెల్లడి కావటం లేదు.

సుప్రీం ఆదేశాలతో ఖాన్ మద్దతు దారులు ఆందోళన విరమించారు.

పాకిస్థాన్‌కు చెందిన ఒక రియలెస్టేట్ సంస్థ, ఇతరులు జరిపిన మనీలాండరింగ్ అవినీతి కేసుల్లో బ్రిటన్ పోలీసులు పాక్ కరెన్సీలో 50బిలియన్లకు సరిపడా అక్రమాలను నిర్ధారించి, ఆ సొమ్మును ఇస్లామాబాద్‌కు పంపారు. ఆ మొత్తాన్ని అక్రమాలకు పాల్పడిన వారి చేతుల్లో బాధితులుగా మారిన వారికి చెల్లించేందుకు ప్రధానిగా ఉన్నప్పుడు ఇమ్రాన్ ఖాన్, అతని సతీమణి విలువైన నగలు, కొంత భూమి, నగదుతో సహా ఐదు బిలియన్ల మేరకు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలు రాగా కేసులు దాఖలు చేశారు. ఈ సొమ్ము ప్రభుత్వానికి చెందాల్సి ఉండగా దారి మళ్లించి అక్రమాలకు పాల్పడిన వారికే మేలు చేశారన్నది ఆరోపణ. ఆ కేసులోనే మన దేశంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి పాక్ జాతీయ జవాబుదారీ బ్యూరో(ఎన్‌ఏబి) ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేసింది, ఎన్‌ఏబి కోర్టులో ప్రవేశపెట్టగా ఎనిమది రోజుల రిమాండ్ విధించింది. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఖాన్ చెబుతుండగా ప్రధానిగా అనేక ఉదంతాలలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారిక పత్రాలే వెల్లడిస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ఆరోపించారు. తమ నేతను వేధిస్తున్నారంటూ మద్దతుదారులు పెద్ద ఎత్తున వీధుల్లోకి ఎక్కారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలని ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టుకు వెళ్లి అక్కడ వేలి ముద్రలు వేస్తుండగా ఎన్‌ఏబి అరెస్టు చేసిందని, అనుచితంగా ప్రవర్తించిందని, ఇది అక్రమం అని ఖాన్ లాయరు సుప్రీం కోర్టుకు నివేదించారు. ఈ కేసును విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి బండియాల్ ఎన్‌ఏబి తీరును తప్పు పట్టారు. కోర్టుకు వచ్చిన వారినెవరినీ అరెస్టు చేయకూడదని, ఖాన్ అరెస్టుతో కోర్టుల గౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసినట్లు వ్యాఖ్యానించటం విశేషం.



అనేక దేశాల్లో అధికారంలో ఉన్న పెద్దలు అవినీతికి పాల్పడటం కొత్తేమీ కాదు. ఇదే సమయంలో తమకు నచ్చని నేతలను అక్రమ కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపి అడ్డుతొలగించుకోవటం కూడా తెలిసిందే. లాటిన్ అమెరికాలో అనేక దేశాల పరిణామాలు దీన్ని వెల్లడించాయి. ప్రస్తుతం బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న లూలా డిసిల్వాను గత ఎన్నికల్లో పోటీలో లేకుండా చేసేందుకు జరిపిన కుట్రలో అక్రమకేసులతో జైలుకు పంపారు. తరువాత అవి తప్పుడువని తేలటంతో వాటిని కొట్టివేశారు. ఇమ్రాన్ ఖాన్‌కు లూలాకు ఎలాంటి పోలికలేదు. అవినీతికి పాల్పడిందీ లేనిదీ కూడా నిర్ధారించలేం. నిజంగా పాల్పడితే ఎవరినీ సమర్ధించనవసరం లేదు. అయితే ఉక్రెయిన్ సంక్షోభంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా మాస్కో వెళ్లి పుతిన్‌తో భేటీ కావటం పాకిస్థాన్‌లో అమెరికా అనుకూల శక్తులకు మింగుడు పడలేదు. పాక్ సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ జావేద్ బజ్వా రష్యా వైఖరిని ఖండించాలని కోరగా ప్రధానిగా ఉండగా తాను తిరస్కరించానని, తరువాత అమెరికాను సంతుష్టీకరించేందుకు బజ్వా స్వయంగా ఖండించినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇమ్రాన్ ఖాన్ ఒక సభలో వెల్లడించారు. అమెరికా వ్యూహాత్మక భాగస్వామిగా ఉన్న భారతే తటస్తంగా ఉన్నప్పుడు పాక్ ఒక పక్షంవైపు ఎందుకు నిలబడాలని ప్రశ్నించారు. భారత్‌కు ఇస్తున్న మాదిరి రష్యా తమకూ తక్కువ ధరలకు చమురు, ఆహార ధాన్యాలను ఇవ్వాలని ఒప్పించేందుకే మాస్కో వెళ్లినట్లు చెప్పాడు. అందువలన ఇప్పుడు జరుగుతున్న పరిణామాల్లో తెరవెనుక అమెరికా అనుకూల శక్తుల హస్తం లేదని చెప్పలేం. పాకిస్థాన్‌లో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ తాము గీచిన గీతల పరిధిలోనే ఉండేట్లు అమెరికా చూసుకుంటున్న సంగతి తెలిసిందే. ఎవరైనా గీత దాటితే ఇమ్రాన్ ఖాన్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించటం కూడా కావచ్చు. తనను హతమార్చే కుట్రలు కూడా జరుగుతున్నట్లు గతంలో ఖాన్ చెప్పాడు. ఇమ్రాన్ ఖాన్ అరెస్టు తరువాత పలు నగరాల్లో జరిగిన హింసాత్మక ఉదంతాల వెనుక భారత్ నుంచి పంపిన వారి హస్తం ఉందని, హింసాకాండ తరువాత బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మిఠాయిలు పంచి పండుగ చేసుకున్నట్లు పాక్ ప్రధాని ప్రత్యేక సహాయకుడు అత్తాతరార్ ప్రకటించాడు. పాకిస్థాన్‌లో తాజా పరిణామాల గురించి మన దేశంతో సహా విదేశాలు ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. తాజా పరిణామాల పర్యవసానాల గురించి ఇంకా పరిశీలించాల్సి ఉంది.

సైన్సు శాశ్వతత్వాన్ని తాత్కాలిక ప్రభుత్వాలు శాసించలేవు

సామాన్యంగా తెలివైన వాళ్ళు తెలివిగల పనులు చేస్తారు. తెలివిలేని వారు తెలివి తక్కువ పనులు చేస్తారు. కానీ, ఇక్కడ జరిగేదేమంటే... తెలివైన వారికి మత పిచ్చినెత్తికెక్కితే, తెలివైన వారు కూడా తెలివి తక్కువ పనులు చేస్తారు. ఆ పనులు అత్యంత హీనంగా కూడా ఉంటాయి. ఈ విషయం మనం సమకాలీనంలో చూస్తున్నాం. అందుకే మన సమాజంలో గౌరవనీయులైన మూర్ఖుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థుల పాఠ్యాంశాల్లో జాతిపిత గాంధీజీ స్థాయి తగ్గించడం, మొఘల్ చరిత్ర తీసెయ్యడం, అలాగే జీవశాస్త్రానికి సంబంధించి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తీసెయ్యడం వల్ల ఈ దేశ పాలకుల అజ్ఞానం, కుత్సిత బుద్ధీ అవగతమవుతోంది. జీవపరిణామ సిద్ధాంతం తొలగించి - ఈ దేశంలో ఒక 'ప్రమాదకర పరిణామం' తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశిస్తున్నారు. విజ్ఞానం సముపార్జించాలంటే ఎంతో శ్రమించాలి. పరిశ్రమించాలి. కాని, విద్యార్థులకు శ్రమలేకుండా చేస్తున్నారు. రాబోయే తరాలన్నీ తమలాగే అజ్ఞాన శిఖామణులు కావాలని నిర్ణయాలు తీసుకుంటున్నారు. పైగా వీరు 'రేషనలైజేషన్' అనే పదం ఉపయోగిస్తున్నారు. అసలు ఆ పదం ఉపయోగించే అర్హత తమకు ఉందా లేదా అనికూడా వారు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదు. దీనికి ప్రతి స్పందనగా ఎన్‌సిఈఆర్‌టి తొలగించిన పాఠాలు తిరిగి చేరుస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కేంద్రానికి లేఖ రాశారు. ఆయన మంత్రివర్గ సభ్యుడు శివన్ కుట్టి, తామే తమకు కావల్సిన పాఠ్యగ్రంథాలు ముద్రించు కుంటామన్నారు. దేశ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు, సైన్సు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, మేధావులు కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా విమర్శిస్తూ సంతకాలు చేసి కేంద్రానికి పంపారు. విడతలు విడతలుగా ఇంకా పంపుతూనే ఉన్నారు. పాలకులకు చీమ కుట్టకపోతే, ఏం చేయాలన్నది ప్రజలకు తెలుసు.



డాక్టర్ దేవరాజు మహారాజు

> ఈ 21వ శతాబ్దపు భారతీయ యువత అంత తేలికగా రాజీపడిపోరు. ఒప్పుకోరు. అసలు ప్రపంచమే వైజ్ఞానిక సృష్టి అయినప్పుడు - ఎవడో చెప్పే దైవసృష్టిని ఈ దేశ ప్రజలు విశ్వసిస్తారా? సైన్సు ఊపిరిగా బతుకుతున్న నేటి యువతరం ఆ సైన్సునే ఆయుధం చేసుకుని ఎందుకు తిరగబడరూ? ఈ తాత్కాలిక ప్రభుత్వాలు సైన్సు శాశ్వతత్వాన్ని శాసించగలవా? పెరుగుట విరుగుట కొరకేనన్నట్టు - మత పిచ్చి ముదిరితే దాన్ని వదిలించే స్థోమత ఈ దేశ ప్రజలకు ఉంది. నియంతలు శాశ్వతంగా నిలిచిపోయిన దాఖలాలు చరిత్రలో ఎక్కడా లేవు.

జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించి, దాని స్థానంలో సృష్టివాదాన్ని జొప్పించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. అందుకే గుజరాత్‌లో, కర్నాటకలో 8 నుండి 10 తరగతులకు భగవద్గీతను పాఠ్యాంశంగా పెట్టింది. అంతే కాదు, దాన్ని జాతీయ గ్రంథం చేయాలని యోచిస్తోంది. గాయత్రీ మంత్రాన్ని పార్లమెంట్‌లో ప్రార్థనా గీతంగా పెట్టాలని పథకం వేస్తోంది. కర్నాటకలో నైతే ఒక మతవాది సావర్కర్ ఉపన్యాసాల్ని పాఠ్యాంశాలుగా చేర్చింది. చరిత్ర పాఠ్యగ్రంథాల్లో అనేక మార్పులు, చేర్పులు చేసింది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో వాస్తు, జ్యోతిష్యం పాఠ్యాంశాలుగా ఉన్నాయి. దానికి తోడు ఇప్పుడు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భూతవైద్యం కోర్సు ప్రవేశపెట్టింది. సమాజాన్ని వెనక్కి నడిపించడానికి ఇంతకంటే మంచి మార్గం లేదని మన పాలకులకు తెలుసు. ఇకపోతే, ఆవు మూత్రంలో ఎంత బంగారం ఉందో పరిశోధించమని విశ్వవిద్యాలయా లకు ఆదేశాలు పంపడం - హాస్యాస్పదమని, మూర్ఖత్వమని మనం అంటున్నాం గానీ, ఎంతో దార్శనికతతో విప్లవాత్మకమైన, ప్రగతిశీలమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని పాపం పాలకులు భ్రమలో బతుకుతున్నారు. వీటన్నింటి మీదా మేధావుల నిరసన వెల్లువెత్తుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం, విన్నపాలు, పిటిషన్లు వెళుతున్నాయి. వినకపోతే ప్రజల కార్యాచరణ మరో రకంగా ఉంటుంది. ఈ నెలలో కర్నాటకలో జరగబోయే ఎన్నికల్లో భాగంగా - పువ్వు గుర్తున్న కవర్లలో ఒక్కో ఓటర్‌కి పదివేలు అందుతున్నట్లు వీడియోలు... మీడియాలో తిరుగుతున్నాయి కదా?

ఇవన్నీ ఇలా ఉంటే... మరో భయంకరమైన వార్త దేశ ప్రజల నెత్తిమీద పిడుగులా పడింది. కేంద్ర ప్రభుత్వం ఒక అహేతుకమైన నిర్ణయం తీసుకుంది. "విజ్ఞాన్ ప్రసార్"ను మూసివేస్తున్నామని అకస్మాత్తుగా ప్రకటించి, దేశ ప్రజల అవకాశాన్ని లాగేసుకుంది. అంతే కాదు, ఆ చర్య ఈ దేశ ప్రజల గౌరవాన్ని అవనతం చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - భారత ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నడుస్తున్న 'విజ్ఞాన్ ప్రసార్' గురించి 24 ఏప్రిల్ 2023న "ద స్టేట్స్ మన్" (THE STATESMAN) పత్రిక సంపాదకీయం రాసింది - VIGYAN PRASAR'S UNNATURAL DEATH అనే శీర్షికతో వచ్చిన ఆ ఎడిటోరియల్ ఎన్నో వాస్తవాల్ని దేశ ప్రజల ముందు పెట్టింది. అది వచ్చిన వెంటనే AIPSN - ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ - తన తీవ్రమైన నిరసనను ప్రకటించింది. న్యూఢిల్లీలో ఒక కార్యక్రమంలో - విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయొద్దని... తీవ్రంగా హెచ్చరించింది. విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయాలని సూచించిన నీతి ఆయోగ్ చర్యను తీవ్రంగా ఖండించింది. వైజ్ఞానిక దృక్పథంతోనే ఈ దేశం ముందుకు పోతుందన్న తొలి ప్రధాని పండిట్ నెహ్రూని - మొన్నటి దాకా తక్కువ చేయడానికి ప్రయత్నించి విఫలమైన కేంద్రం, ఇప్పుడు వైజ్ఞానిక సంస్థల్ని మూసివేయడం ప్రారంభించింది!



'విజ్ఞాన్ ప్రసార్' సంస్థ ఏం చేస్తుంది? అంటే, దేశంలో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందుకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు ప్రచురిస్తుంది. హిందీ, ఇంగ్లీషు భాషల్లోనే కాకుండా కొన్ని భారతీయ భాషల్లో కూడా పత్రికలు ప్రచురిస్తుంది. రాజ్యాంగంలోని 51(ఎ) హెచ్ ప్రకారం దేశంలో వైజ్ఞానిక స్పృహను కలిగి ఉండటం, దాన్ని ప్రచారం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత- అయినప్పుడు సమాజంలో వైజ్ఞానిక స్పృహను ప్రచారం చేసి, పెంపొందించే సంస్థను, అన్ని స్థాయిల్లో విద్యార్థులందరికీ చేరువైన సంస్థను ఉన్నఫలంగా అకారణంగా మూసివేయడం హేయమైన చర్య! ప్రభుత్వ పెద్దల ఛాందసానికి, ప్రభుత్వాధికారుల బాధ్యతా రాహిత్యానికి ఈ చర్య అద్దం పడుతుంది.

'విజ్ఞాన్ ప్రసార్' ఒక స్వతంత్ర సంస్థ (Autonomous Organization) గా 1989లో ప్రారంభమైంది. అప్పటి నుండి ఈ సంస్థ వైజ్ఞానిక దృక్పథం ప్రచారం చేయడంలో ఎంతో కృషి చేస్తూ ఉంది. నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు ఎంత ముఖ్యమో, వాటి వివరాలు సామాన్య జనానికి అందించడం కూడా అంతే ముఖ్యం! దేశ వ్యాప్తంగా ప్రజా సైన్సు కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉన్న విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయడమంటే - దేశ ప్రజలను అవివేకులుగా, అజ్ఞానులుగా తయారు చేయాలని భావించడమే - రైతు నల్ల చట్టాలు తిప్పికొట్టినట్టు - పౌర సత్వ చట్టాలు తిప్పికొట్టినట్టు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తవా? గతంలో వేల సంఖ్యలో షహీన్‌బాగ్‌లు వెలసినట్టు - ఉద్యమాలు ఊపందుకోవా? వెనక్కి నడుద్దామన్న వారి మెడలు వంచి ముందుకు నడిపించవా? ఈ 21వ శతాబ్దపు భారతీయ యువత అంత తేలికగా రాజీపడిపోరు. ఒప్పుకోరు. అసలు ప్రపంచమే వైజ్ఞానిక సృష్టి అయినప్పుడు - ఎవడో చెప్పే దైవసృష్టిని ఈ దేశ ప్రజలు విశ్వసిస్తారా? సైన్సు ఊపిరిగా బతుకుతున్న నేటి యువతరం ఆ సైన్సునే ఆయుధం చేసుకుని ఎందుకు తిరగబడరూ? ఈ తాత్కాలిక ప్రభుత్వాలు సైన్సు శాశ్వతత్వాన్ని శాసించగలవా? పెరుగుట విరుగుట కొరకేనన్నట్టు - మత పిచ్చి ముదిరితే దాన్ని వదిలించే స్థోమత ఈ దేశ ప్రజలకు ఉంది. నియంతలు శాశ్వతంగా నిలిచిపోయిన దాఖలాలు చరిత్రలో ఎక్కడా లేవు.

విజ్ఞాన్ ప్రసార్ ఇప్పటి వరకు వేర్వేరు శాస్త్రవేత్తలు, వేర్వేరు వైజ్ఞానిక రచయితలు రాసిన 300 పుస్తకాలు ప్రచురించింది. ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి అవార్డుల్ని ప్రతి సంవత్సరం ప్రకటిస్తోంది. అందులో సైన్సు ప్రచారానికి యునెస్కో కలింగ అవార్డు, నేషనల్ సైన్సు పాపులరైజేషన్ అవార్డు, ఇందిరాగాంధీ ప్రయిజ్ ఫర్ సైన్స్ పాపులరైజేషన్, ఆత్మారాం అవార్డు ఫర్ సైన్స్ బుక్ రైటింగ్ వంటి అవార్డులు నెలకొల్పి నిర్వహిస్తోంది. ఇంగ్లీషు, హిందీ భాషలలో 'డ్రీమ్ 2047' పేరుతో కళాశాల విద్యార్థుల కోసం సైన్స్ జర్నల్ ప్రచురిస్తోంది. బెంగాలి, తమిళం, కన్నడం, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ వంటి భారతీయ భాషలలో సైన్సు ప్రచురణలు తెస్తోంది. ఇవేకాక మంత్లీ న్యూస్ లెటర్స్ ప్రచురిస్తోంది. ఉర్దూలో తజస్సుస్, తమిళంలో అరివియల్ పలగై, బెంగాలిలో బిగ్యాన్ కథ, కన్నడంలో కుతూహల్ ఇవి న్యూస్ లెటర్ల పేర్లు. ఇక దూరదర్శన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహించే సైన్స్ కార్యక్రమాలు కొన్ని. అలాగే 'హామ్ రేడియో' ద్వారా పిల్లలకు, పెద్దలకు అవసరమైన వైజ్ఞానిక సమాచారం అందిస్తోంది. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు 'ఏక్టివిటీ కిట్స్' అందిస్తోంది. వాటివల్ల వాళ్ళు సరదాగా ఆడుతూ పాడుతూ (LEARN BY DOING) కొత్త విషయాలు నేర్చుకుంటారు. విజ్ఞాన్ ప్రసార్ మహిళల మీద కూడా దృష్టి పెట్టింది. వారి కోసం 'జెండర్ అండ్ టెక్నాలజీ' ప్రోగ్రాం రూపొందించింది. ఒక డిజిటల్ లైబ్రరీ'ని అందరికీ అందుబాటులోకి తెచ్చింది. సైన్స్ క్లబ్‌లు విరివిగా ఏర్పాటుచేసి, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది. సైన్స్ ప్రదర్శనలు, జాతాలు క్రమం తప్పక నిర్వహించింది. గ్రహణాల సమయంలో ఖగోళ పరిజ్ఞానం సామాన్యులకు అందించి, అంధ విశ్వాసాలు తగ్గించింది. చలన చిత్రాల ద్వారా సైన్స్ ప్రచారం చేయడమే కాదు, నేషనల్ సైన్స్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (NSFFI)ను పెద్ద ఎత్తున నిర్వహించింది. విజ్ఞాన్ ప్రసార్‌కు అనుబంధంగా పనిచేస్తున్న "ఇండియా సైన్స్ టివి ఒటిటి ఛానెల్ రెండువేల సైన్స్ షార్ట్ ఫిలింస్ రూపొందించింది. అవి 85 మిలియన్ల మందికి అందాయి. నిర్విరామంగా ఇంతగా కృషి చేస్తున్న ఒక గొప్ప సంస్థను మూసేయడం సబబా?

> వైజ్ఞానిక ప్రపంచంలో బతుకుతున్న మనకు ఒక పెద్ద వైజ్ఞానిక సమాచార సంస్థ మూతపడటం తీరని లోటు! దేశవ్యాప్తంగా సైన్సు కార్యకర్తలే కాదు, బాధ్యత గల పౌరులందరూ ఏక కంఠంతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. కోరుతున్నారంటే బతిమిలాడుతున్నారని కాదు, ప్రభుత్వ పెద్దలు దీన్ని ఒక హెచ్చరికగా తీసుకుంటే - పునరాలోచించి ప్రజా నిర్ణయానికి అనుకూలంగా పనిచేస్తే... దేశం ముందుకు పోతుంది.

విజ్ఞాన్ ప్రసార్‌లో పనిచేస్తున్న సంపాదకులు, వైజ్ఞానిక రచయితలు, ఇతర ఉద్యోగులు అందరూ కలిసి ఎన్నో ప్రచురణల్ని ఎంతో శ్రద్ధగా ప్రజలకు అందిస్తున్నారు. ప్రచురణలు ఊపందుకుంటున్న దశలో - ఇంకా ఇతర భాషల్లో కూడా వైజ్ఞానిక స్పృహను పెంచే ప్రచురణలు వెలువరించాలని పథకాలు సిద్ధం చేసుకుంటున్న దశలో కేంద్ర ప్రభుత్వం అర్ధాంతరంగా, అనూహ్యంగా విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయడం బాధాకరం! వైజ్ఞానిక ప్రపంచంలో బతుకుతున్న మనకు ఒక పెద్ద వైజ్ఞానిక సమాచార సంస్థ మూతపడటం తీరని లోటు! దేశవ్యాప్తంగా సైన్సు కార్యకర్తలే కాదు, బాధ్యత గల పౌరులందరూ ఏక కంఠంతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. కోరుతున్నారంటే బతిమిలాడుతున్నారని కాదు, ప్రభుత్వ పెద్దలు దీన్ని ఒక హెచ్చరికగా తీసుకుంటే - పునరాలోచించి ప్రజా నిర్ణయానికి అనుకూలంగా పనిచేస్తే... దేశం ముందుకు పోతుంది. వైజ్ఞానిక స్పృహ గల వారే ఆధునిక మానవులవుతారన్నది ఈ దేశ పౌరులకు బాగా తెలుసు!

ప్రశ్నను తొక్కిపెడితే అది ఎప్పుడూ ఏ కాలంలోనూ భూస్థాపితం కాలేదు. విత్తనాన్ని తొక్కి పెడితే ఎప్పుడైనా ఎక్కడైనా భూస్థాపితమైందా? మొక్కగా ఎదిగి, వృక్షంగా విస్తారమైపోలేదూ? ఆ నిర్ణయం తీసుకున్న వారి అజ్ఞానం బయటపడుతుందే తప్ప, ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో విజ్ఞానాన్ని తొక్కిపెడతానంటే మాత్రం వీలు కాదు - విజయం ఎప్పుడూ సైన్సుదే! జయహెూ విజ్ఞానం!!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



కదులుతోంది భారతం

మౌనమేలో పాలకా?
రెజ్లర్ల పరువు పోరుపై
కన్నీటి తెరల తీరుపై

వారడగ లేదు పదవి
బ్యాంకప్పు అడగలేదు
ఏ బిరుదు అడగ లేదు
మీ ఆస్తు లడగ లేదు

స్త్రీ లోలిత కైపెక్కిన
బ్రిజ్ భూషణ మాటపై
న్యాయమే అడిగినారు
'మాన'హక్కు లడిగినారు

పతకాలూ గెలిచి నపుడు
పరవళ్ళు తొక్కినారు
'పరువీ'ధీ కెక్కి నపుడు
అండెందుకు ఇవ్వ లేదు?

ప్రశంసలా పలుకుల్లో
చేతల్లో ములుకులా
మీ శీలమంటే ఇంతేనా?
మీ జ్ఞానమంటే ఇదేనా?
అని లోకం భగ్గుమంది

కళ్ళార్పిన పిల్లి ఆట
కలకాలం సాగబోదు
బ్రిజ్ భూషణ్ తీరుపై
చర్యేమిటో చెప్పాలి

మౌనం మీ తీరైతే
స్త్రీలోకం కదులుతోంది
యవతరం అండగుంది
మీ వైఖరి కక్కించగ


ఎక్కిన మీ కైపు దించ
కదులుతోంది భారతం
ఇదే..ఇదే తీరునయితె
పదం పాడి కదం తొక్కి

రెజ్లర్లకు సలాం చేసి
మీ మదం దించుతారు

- ఉన్నం వెంకటేశ్వర్లు
సెల్:8790068814

పాలనా ఫలితాలే బీజేపీని పట్టిచూపే నిలువుటద్దాలు

మెజారిటీ పేదల ఓట్లతో గద్దెనెక్కి, కొద్దిమంది కోటీశ్వరులను కుబేరులుగా ఎక్కదీస్తూ, కోట్లాది పేదలను నిరుపేదలుగా దిగజార్చే పాలక పార్టీ బీజేపీ. ప్రపంచ కుబేరులలో 10, 12 స్థానాల్లో ఉన్న అంబానీ ఆదానీలను 3,2 స్థానాలకు, అదే సమయంలో కోట్లాది పేదలను, నిరుపేదలుగా దిగజార్చింది మోడీ ప్రభుత్వం! అంబానీ, ఆదానీలు న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసి ఎదిగితే తప్పు బట్టాల్సిన పనిలేదు. కానీ వాళ్ళలా ఎదగలేదు, రూ.లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తుల్ని, వేలకోట్లకే కట్టబెట్టిన మోడీ పాలన ఫలితమది. రూ. 3లక్షల కోట్ల విలువైన భూములు, ఆధునాతన మిషనరీ ఉన్న 'విశాఖ ఉక్కు'ను కేవలం రూ.3వేల కోట్లకు తెగనమ్మేందుకు సిద్ధపడిందని ఆ కంపెనీ స్టాఫ్ బహిరం గంగానే ప్రకటించింది నిజమేకదా! అంతే గాదు, వేల కోట్ల ప్రజాధనంతో ప్రత్యేక విమానంలో తిరిగి, అమెరికా, రష్యా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వగైరాలతో కేవలం ఆదానీ అంబానీలకే లక్షల కోట్ల విలువైన కాంట్రాక్టులు, వ్యాపార లావాదేవీలను కుదిర్చిపెట్టినట్లు అంతర్జాతీయ నివేదికలు గణాంకాలతో బయట పెట్టాయి. ఆదానీగానీ, అంబానీగాని ఈ దేశంలో కొత్తగా ఒక్క పరిశ్రమనైనా పెట్టలేదు. మోడీ పట్టుబట్టినా వాళ్ళు కొత్త పరిశ్రమను పెట్టరు గాక పెట్టరు. ఎందుకంటే? దేశంలో కోట్లాది పేదలు నిరుపేదలుగా దిగజారి కొనుగోలుశక్తిని కోల్పోయారు గనుక! కొనేవాళ్ళు లేనప్పుడు కొత్తగా పరిశ్రమలు రాకపోగా, ఉన్న ఫోర్డ్ లాంటి విదేశీ పరిశ్రమలు వెళ్ళిపోతున్నాయి. 'యాపిల్' కంపెనీ వార్షికాదాయం 3.1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువ. అదే చైనా వార్షికాదాయం 16.5 ట్రిలియన్ డాలర్లు. గత మూడు దశాబ్దాలుగా చైనా జీడీపీ రెండంకెల్లో కొనసాగుతుంది. ప్రపంచం తలెత్తి చూసేలా మన జీడీపీని పెంచుతానన్న మోడీ పాలనలో డబుల్ డిజిట్ అంతేసంగతి. 9, సింగిల్ డిజిట్‌లో కూడా పతన మార్గాన జారు తున్నది. ఇందుకు కారణం మన వంటి వ్యవసాయక దేశాలు చైనా వగైరాలను కాక, తద్భిన్నంగా పారిశ్రామిక దేశాల విఫలనేతల మార్గాన మోడీ పయనించటమే.



పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

ఉదాహరణకు 1933-37 మధ్య ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మిన ఇటలీ ముసోలినీ - జర్మనీ హిట్లర్‌లను, 1980 దశకంలో అదే మార్గాన పయనించిన అమెరికా రీగన్‌ను "వస్తూత్పత్తి - ప్రజా పంపిణీ - సేవల కల్పన - ప్రజావాణిజ్యం ప్రభుత్వ బాధ్యత కాదనీ నినదించిన మార్గరెట్ థాచర్‌ను ఆదర్శంగా తీసుకుని థాచర్ నినా దాన్నే నేడు పునర్నినదిస్తున్నారు. మోడీ! పోనీ అవైనా విజయవంతమైన విధానాలా అంటే, ఆనాడే పూర్తి ఫెయిల్యూర్ విధానాలవి. వాళ్ళను భయంకర అణిచివేతల, తిరోగమన నేతలుగా గుర్తించారు ప్రజలు. అందుకే సదరు నేతల్ని చరిత్ర చెత్తబుట్టలో కలిపారు. నాటి విఫల విధానాలను - ఈనాడు మోడీ ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని, దేశాన్ని వెనక్కు నెట్టేయటం, రాజనీతిజ్ఞతో, రాజకీయ మూర్ఖత్వమో బీజేపీ, ఆరెస్సెస్‌లు ఆత్మవిమర్శ చేసుకోవాలి! ఇక మన వంటి వ్యవసాయాధారిత చైనా, మనం అందుకోలేనంత ఎత్తుకు ఎలా ఎదిగింది. డెంగ్ సియోహోపింగ్ నాయకత్వాన ఐదేండ్లపాటు బడ్జెట్‌లో 90శాతం నిధులను వ్యవసాయాభివృద్ధికి కేటాయించి, దానిపై ఆధారపడిన 60శాతం మంది ప్రజల కొనుగోలు శక్తిని పెంచుకున్నారు. తత్కారణంగా దేశ దేశాల పారిశ్రామి వేత్తలు చైనాలో కుప్పలు తెప్పలుగా పరిశ్రమలను నెలకొల్పారు. కోట్లాది మందికి ఉద్యోగాలొచ్చాయి. కార్మికులకు ఉపాధి లభించింది. దాంతో చదువుకునే వాళ్ళ సంఖ్య పెరిగింది. నిరుద్యోగులను, సబ్సిడీలతో తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలిప్పించి, కుటీల పరిశ్రమల దిశగా విస్తృతంగా ప్రోత్సహించింది. అదువల్ల ప్రపంచ దేశాలకు అతి తక్కువ ధరలకే తన ఉత్పత్తులను ఎగుమతి చేయగలుగుతున్నది. అందుకే నానాటికి బహు ముఖంగా పురోగమిస్తూ అమెరికాను సవాలు చేసే స్థాయి కెదిగింది చైనా! చైనా ఈ ప్రగతి విధానాన్ని ఎవరోకాదు మన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ వివరించారు. చైనా అనుసరించిన ఈ విధానాన్ని అనుసరిస్తూ, ఎంతో వెనకబడివున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేవలం ఎనిమి దేండ్లలో అత్యధిక ఆదాయాన్నందించే నాల్గవ రాష్ట్రంగా అత్యధికంగా వరి పండిస్తున్న భారతైక రాష్ట్రంగా ప్రకటించారు ముఖ్య మంత్రి కేసీఆర్! 'రాజనీతిజ్ఞత' అంటే అదికదా మోడీజీ! అందుకే ప్రజలను కొను గోలుశక్తిని పెంచ కుండా, అంబానీ, ఆదానీలను ఆకాశమం తెత్తుకు ఎక్కదీసినా దేశంలో తిరోగమిస్తుందే గానీ, పురోగమించదన్న సత్యానికి మీ తొమ్మిదేండ్లపాలనే నిదర్శనం కదా మోడీజీ!



తమ ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ విధానాల ద్వారా కోట్లాది పేదలు, నిరుపేదలుగా మారుతున్నారని బీజేపీకి తెలుసు. పేదలు అన్ని కులమతాలలో ఉన్నది వాస్తవం. కుల, మతా తీతంగా పేదలంతా సమైక్యమైతే, తాము అధికారంలోకి రావటం కష్టమన్న సంగతీ అర్థమైంది. అందుకే నాడు విభజించి పాలించిన బ్రిటిష్ పాలకుల ఎత్తుగడనే బీజేపీ పాలకులు మరింత దూకుడుగా పాటిస్తున్నారు. అందుకు 'మత విద్వేషాన్ని' ఆయుధంగా మలుచు కున్నారు బీజేపీ పాలకులు! మత విద్వేషానికి సులభంగా లోనవు తున్నారు ప్రజలు. పామరులేకాదు, పండితులు, విద్యావంతుల్లోనూ చాలామంది ఈ మత విద్వేషానికి లోనుకావటం బాధాకారం.ఇదే బీజేపీకి అందివచ్చిన అవకాశం. బహుశా అందుకేనేమో 'మతం మత్తుమందు' అన్నారు కారల్‌మార్క్స్! ఈ వాస్తవాన్ని గ్రహించిన బీజేపీ. మెజారిటీ హిందువులున్న గుజరాత్, యూపీ వంటి రాష్ట్రాలలో 'గోమాంస భక్షకుల'న్న నెపంతో మైనారిటీ ముస్లిం ద్వేషాన్ని రగిల్చి, వాళ్ళపై దాడులకు ప్రోత్సహిస్తూ మెజారిటీ హిందుఓటర్లను సమీకరించుకుంటున్నది. మెజారిటీ హిందువులున్న అస్సాం, హర్యానా, ఛత్తీస్‌ఘడ్ మొదలైన రాష్ట్రాల్లో 'బలవంతపు మతమార్పిడులు' చేస్తున్నా రన్న నెపంతో మైనారిటీ క్రైస్తవ ద్వేషాన్ని రగిల్చి, వాళ్ళ ఇళ్ళు, చర్చీలపై దాడులకు ప్రోత్సహించుట ద్వారా మెజారిటీ హిందూ ఓటర్ల నాకర్షిస్తున్నది. మెజారిటీ క్రైస్తవ ఓటర్లున్న ఈశాన్య రాష్ట్రాలలో మాత్రం 'బీఫ్ తినటం జనజీవన శైలి అనీ, బీఫ్‌ను బీజేపీ వ్యతిరేకించదనీ జెరూసలేం యాత్రకు ఆర్థిక సహాయాన్నందిస్తామనీ, వగైరా ప్రోత్సాహకాల ద్వారా క్రైస్తవ ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నది. క్రైస్తవులు, ముస్లింలు కేరళ వంటి రాష్ట్రాలలో 'లవ్ జిహాదీల'న్న నెపంతో మైనారిటీ ముస్లిం ద్వేషాన్ని రగిల్చి, మెజారిటీ క్రైస్తవులను ఆకట్టుకునేందుకు చూస్తున్నది. బీజేపీ! ఇలా మైనారిటీ ముస్లిం క్రైస్తవ ద్వేషాన్ని రగుల్చుతూ వాళ్ళపై దాడులు చేయిస్తూ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశానికి బోలెడు అపఖ్యాతిని పోగేసి పెడుతున్నది మోడీ ప్రభుత్వం! అయినా హిందువుల అభివృద్ధికి హిందూ మత ఔన్నత్యం కోసం ఏమైనా చేస్తుందా అంటే, అదేమీలేదు. ఎందుకంటే? కేవలం మత విద్వేషాన్ని రగిల్చినందుకే హిందూ ఓటర్లు తమవైపు మొగ్గుతున్నారు గనుక, సదరు విద్వేష జ్వాలల్ని చల్లారకుండా చూచుకుంటే చాలు. ఇంకా హిందువుల ప్రగతి కోసం అదనంగా శ్రమించాల్సిన అవసరం ఏముందని అనుకుంటున్నది బీజేపీ! దేశాన్ని హిందుత్వ రాష్ట్రం కోసం నియంతృత్వ విధానాలను అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

> అందుకే నాడు విభజించి పాలించిన బ్రిటిష్ పాలకుల ఎత్తుగడనే బీజేపీ పాలకులు మరింత దూకుడుగా పాటిస్తున్నారు. అందుకు 'మత విద్వేషాన్ని' ఆయుధంగా మలుచు కున్నారు బీజేపీ పాలకులు! మత విద్వేషానికి సులభంగా లోనవుతున్నారు ప్రజలు. పామరులేకాదు, పండితులు, విద్యావంతుల్లోనూ చాలామంది ఈ మత విద్వేషానికి లోనుకావటం బాధాకారం. ఇదే బీజేపీకి అందివచ్చిన అవకాశం. బహుశా అందుకేనేమో 'మతం మత్తుమందు' అన్నారు కారల్‌మార్క్స్!



మాతృ వందనం...

సృష్టిలో తీయని పదం అమ్మ. ఈ రెండక్షరాల్లో విశ్వమే దాగి ఉంది. అమ్మ... ఆ పదంలో ఆప్యాయత, అనురాగం, ఆనందం, ఆత్మీయత, ఆదర్శం, కమ్మదనం, తీయదనం ఇంకా ఎన్నెన్నో.. ఎంత చెప్పినా తక్కువే.. మాటలకు అందనిది అమ్మ ప్రేమ. కడుపున పుట్టిన బిడ్డలనే కాదు అణగారిన వారినందరినీ తమ బిడ్డలుగా భావించి సమాజం కోసం కృషి చేస్తున్న ఎందరో తల్లులు మన మధ్యనే ఉన్నారు. తమ అక్షరాలతో, సేవా కార్యక్రమాలతో విశేష సేవలు చేస్తున్న 31మంది మాతృమూర్తులను రాబోయే అమ్మల దినోత్సవాన్ని పురస్కరించు కొని తెలుగు యూనివర్సిటీ మాతృవందనం చేసింది. వారిలో కొందరి గురించి మనమూ తెలుసుకుందాం.

అరుణారుణ సాహిత్య తెమ్మెర

కృష్ణాబాయి తుమ్మల...



తన 60 ఏండ్ల సాహితీ ప్రస్థానంలో వీరు సాహిత్య సమాలోచన వ్యాస సంకలనంతో పాటు 120కి పైగా వ్యాసాలు, సమాజ చరిత్ర ప్రతిబింబంగా చేసిన సమీక్షలు, ముందుమాటలు, స్కెచ్‌లు, ఇంటర్వ్యూలు, ఉత్తరాలు, సాహిత్య విమర్శలు, అను వాదాలు, కథలు ఇలా ఎన్నో సాహితీ రచనలు చేశారు. 'మన చలం' వ్యాస సంపుటికి సంపాదకత్వం వహించారు. విప్లవ రచయితల సంఘం తొలి మహిళ సభ్యురాలు వీరు. అరుణతార పత్రికకు సంపాదకురాలిగా పని చేశారు.

బహుమతులు ఆమె సొంతం

వేముగంటి శుక్తిమతి...



45 ఏండ్ల ఉపాధ్యాయ వృత్తి అను భవం. ఇప్పటివరకు 30 కథలు, 60 కంటే ఎక్కువ వ్యాసాలు. ఆరు నవలలు రాశారు. మొదటి కథ మానవత్వం మరిచిన వేళ. దీనికి 1997లో ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో ఉగాది కథల పోటీలో మొదటిబహుమతి. నేటి మనిషి అనే కథకు ఉపాసం సంస్థ నిర్వహించిన కథల పోటీలో బహుమతి. సుక్కబర్రె అనే కథకు 2020లో ముల్కనూరు గ్రంథాలయ నిర్వహణ పోటీలో విశిష్ట బహుమతి. ఊరు పిలిచింది అనే కథకు పాలపిట్ట అధ్వర్యంలో జరిగిన కథల పోటీలల్లోప్రత్యేక బహుమతి అందుకున్నారు. ఇలా ఎన్నో బహుమతులు, సన్మానాలు జరిగాయి.

విద్యా వికాసాల పట్టు

డాక్టర్ సుశీల బట్టు...



సికింద్రాబాద్‌లోని కస్తూర్బా మహిళా కళాశాల ప్రిన్సిపల్‌గా వీరు పని చేశారు. వీరి అనేక పరిశోధనా పత్రాలు ఉత్తమ పరిశోధనలుగా ప్రచురణకు స్వీకరించ బడ్డాయి. బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. ఆకాశవాణిలో సూక్తిముక్తావళితో పాటూ అనేక అంశాలపై ప్రసంగాలు చేశారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డుకు సభ్యురాలిగా ఉన్నారు.

ఆపన్నుల ఆత్మీయ పరిమళ

డా.లక్కరాజు నిర్మల...



ఆత్మీయ నిర్మలగా అందరికీ సుపరిచితులు. 45 ఏండ్లగా ఆత్మీయ మహిళా మండలి ద్వారా, 30 ఏండ్లు ఆత్మీయ మానసిక వికాస కేంద్ర స్థాపకురాలిగా ఎనలేని సేవలు చేస్తున్నారు. అధ్యాపకురాలిగా, మానసిక వికలాంగుల పాఠశాల డైరెక్టర్‌గా అనేక మందికి కౌన్సిలింగ్ చేస్తూ సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

విజ్ఞాన సాహితీ హారతి

డా. బి.విజయభారతి...



వీరు కళాప్రపూర్ణ, పద్మభూషణ్ బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతుల ప్రథమ సంతానం. వీరు పౌరహక్కుల ఉద్యమాలలో నాలుగు దశాబ్దాల పాటు కీలక పాత్ర పోషించారు. నిజామాబాద్ మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1978 నుండి హైదరాబాదులోని తెలుగు అకాడమీ రీసెర్చ్ ఆఫీసర్‌గా డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందించారు. 1999 నవంబర్‌లో ఇన్చార్జ్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశారు. వీరు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘ సభ్యురాలుగా పనిచేశారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం వీరికి విశిష్ట మహిళా పురస్కారాన్ని ఇచ్చి గౌరవించారు.

సైరస్‌తో సాహితీ సైరన్ మోగించిన జ్ఞాత

లంక సీత...



వీరు గత 60 ఏండ్లుగా ఢిల్లీలో ఉంటున్నారు. తన జీవితములో ఎదురయిన చేదు అనుభవాలు ఎన్నో పాఠాలు నేర్పాయి అంటారు. చిన్నతనంలోనే భర్తను కోల్పోయి, చదువు లేక, భాష రాక, దేశ రాజధానిలో అష్టకష్టాలు పడ్డారు. వాటికి ఎదురేగిపై చదువులు చదువుకుని మంచి హోదాలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. తనలాగా కష్టపడిన స్త్రీలకు ఏదో రకంగా సహాయ పడాలనే ఉద్దేశంతో సైరస్ అనే సంస్థ స్థాపించి తద్వారా మహిళలకు, పిల్లలకు, వయో వృద్ధులకు చేతనయిన రీతిలో ఆరోగ్య, విద్యాపరంగా అనేక సహాయ సహకారాలు అందిస్తున్నారు.

అనేక నవలల జయప్రభ

డా. పెళ్ళకూరి జయప్రద...



తన 14వ ఏటనే రచనలు చేయనారం భించారు ఈ గైనికాలజిస్ట్. వీరు మొత్తం 37 పుస్తకాలు రచించారు. అందులో 12 నవలలు, 15 కథా సంపుటాలు, 3 కవితా సంపుటాలు, 3 వ్యాస సంపుటాలు, ఒక దీర్ఘ కవిత కావ్యం, ఒక నానీల సంపుటి, ఒక రెక్కల సంపుటి, ఒక స్వర్ణోత్సవ సంచిక ఉన్నాయి. వీరు యాత్రా సాహిత్యం, రేడియో టాక్స్, మీడియా టాక్స్, టీవీ ప్రోగ్రామ్స్ అనేకం చేశారు. వీరి సాహిత్యం మీద ఇప్పటివరకు ఐదుగురు పి.హెచ్.డి, ఎం. ఫిల్ చేశారు. ప్రతి ఏటా ఉత్తమ నానీల పుస్తకానికి, ఉత్తమ నవలకు అవార్డు ఇచ్చి రచయితలను ప్రోత్సహిస్తుంటారు.

రసాయన శాస్త్రాల పొదరిల్లు

డా.కృష్ణకుమారి చాగంటి...



వీరు సింగరేణి డిగ్రీ కళాశాల కొత్తగూడెం రసాయన శాస్త్ర ఆచార్యులు, శాఖాధిపతి. 36 ఏండ్ల సర్వీసు అనంతరం పదవీ విరమణ చేసి ఉపన్యాసకురాలుగా పరిశో ధకురాలుగా, రచయిత్రి, కవయిత్రి, అనువాదకురాలు, యుట్యూబర్‌గా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. వీరు 15 ఏండ్ల నుండి భారత ప్రభుత్వపు విజ్ఞాన ప్రసార్ వారి రేడియో ఎపిసోడ్లకు, ద్విభాష మాసపత్రికకు నాటకాలను, వ్యాసాలను అందిస్తున్నారు.

విద్యారంగాల్లో విరాజిల్లిన పట్టాల పంట

డా. హేమలతాదేవి అచంట...



భర్త పిల్లల బాధ్యత వివాహమైన ప్రతి స్త్రీకి ఉంటుంది. కానీ వీరితో పాటు 12 ఏండ్ల పాటు వృద్ధ అత్తగారిని, ఆడపడుచు పిల్లలని కూడా చూసు కుంటూ ఉన్నత చదువులు అభ్యసించడం అంటే మాటలు కాదు. తల్లినే తనరోల్ మోడల్‌గా భావించే పెండ్లి సమయానికి బి.ఇడి.పాసైయ్యారు. కుటుంబ బాధ్యతలు చేపట్టాక స్కూల్ కివెళ్లకుండానే ప్రైవేటుగా పరీక్షలు రాసి పాసైనారు. టెక్కలి ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పనిచేశారు. ఉత్కళ్ యూనివర్సిటీలో ఎం.ఏచేశారు. ఎం.ఫిల్., పి. హెచ్.డి ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

విశ్వపుత్రికగా ఎదిగిన గజళ్ళ రాణి

డా. విజయలక్ష్మి పండిట్...



మొట్టమొదటి మహిళా మంత్రి అయిన విజయలక్ష్మి పండిట్ అంతటి కీర్తి ప్రతిష్టలు సాధించాలి అని.. తన కుమార్తెకు.. అదే పేరు పెట్టిన తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా.. ఇంకా చెప్పాలంటే.. అంతకంటే గొప్పగా విశ్వప్రేమ శాంతి అనే విశాల దృక్పథాలను తన రచనల నుండి వెలువరిస్తూ విశ్వ పుత్రికగా వెలుగుతున్నారు. వీరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్గా రిటైర్ అయ్యారు.

అపురూప అనువాద ఖ్యాతి

శ్రీపాద స్వాతి..



ఊహ తెలిసినది మొదలు కనిపించిన పుస్తకం చదవడం, అనిపించిన ఊహలకు అక్షరరూపం ఇవ్వడం ప్రవృత్తి. అయితే వృత్తిగా లభించిన అవకాశం కేంద్రీయ విద్యాలయంలో సీనియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన. అచ్చయిన పుస్తకాలు ఎనిమిది కవితా సంపుటాలు, అయిదు కథానికా సంపుటాలు, నాలుగు నవలలు, వీరు తెలుగునుండి ఇంగ్లీష్‌కు, ఇంగ్లీష్ నుండి తెలుగుకు 32 అనువాదాలు చేసారు. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, ఉత్తమ రచయిత్రి పురస్కారం, అపురూప అనువాద పురస్కారం, ఇందూరు అపురూప కథా పురస్కారంతో పాటు ఎన్నో అందుకున్నారు.

విద్యా సాహితీ ప్రతిభా లత

డా.అమృతలత...



నిజామాబాద్‌కు చెందిన రచయిత్రి, కవయిత్రి సాహిత్య సేవకురాలు, విద్యావేత్త, పారిశ్రామికవేత్త కూడా.. విభిన్న ప్రక్రియలో సాహిత్యం రాయడమే కాదు.. సాహిత్యంలో, లలిత కళల్లో అద్భుతమైన ప్రతిభా పాటవాలను చూపిస్తున్న లబ్ధ ప్రతిష్టుల్ని, యువ రచయితల్ని గుర్తించి, తగు విధంగా సత్కరించి, ప్రోత్సహిస్తున్న సహృదయశీలి. సృష్టిలో తీయనిది (నవల), స్పందన (కథా సంపుటి), అమృత వర్షిణి (ఎడిటోరియల్స్), గోడలకే ప్రాణముంటే.. (నాటికల సంపుటి), చుక్కలలోకం చుట్టొద్దాం! (పిల్లల నాటికల సంపుటి), ఓటెందుకు? (స్కెచెస్), నా ఏకాంత బృందగానం (సచిత్ర స్వీయ చరిత్ర) వంటి రచనలు చేశారు.

బహుకళల కాణాచి

డా. లక్ష్మీ రాఘవ...



రచయిత్రి, ఆర్టిస్ట్. వనితా కాలేజీలో జువాలజీ రీడర్‌గా పదవీ విరమణ చేశారు. ఏడు కథా సంపుటాలు, ఒక స్మారక సంచిక ప్రచురించారు. రెండు కథా సంపుటాలకు కుప్పం రెడ్డెమ్మ పురస్కారాలు, ప్రపంచ తెలుగు మహాసభలలో గుర్తింపు, రచన 'కథా పీఠం' పురస్కారం, నెమలీక నెలవంకవారి 'కలహంస కథా పురస్కారం', కెనడా తెలుగుతల్లి, రైతు బంధు, మలిసెట్టి సీతారాం, రంజని నందివాడ భీమారావు పురస్కారాలు అందుకున్నారు.

అనువాద వికాసాల హేమంత

డా. సి వసంత...



వీరు ఎన్నో అద్భుతమైన పుస్తకాలను తెలుగు నుండి హిందీకి, హిందీ నుండి తెలుగుకు అనువదించారు. వీరు హిందీ పరిశోధన గ్రంథం గీత్ కార్ నీరజ్, మహారాష్ట్రలో వచ్చిన కిలారి భూకంపం ఆధారంగా మృత్యులీల-జీవన హేల అనే హిందీ నవలతో పాటు, రేపటి వసంతం, విముక్త మొదలగు ఆరు రచనలు, గుడిపాటి వెంకటాచలం జీవిత చరిత్ర (రమణీ సే రమణాశ్రమం తక్) హిందీ రచన 1400 పేజీలను మూడు భాగాలుగా రాసారు.

సేకరణ : విశ్వైక

మోడీ గారడీ ఫలించేనా ?

(మొదటిపేజీ తరువాయి)

రోడ్‌షోలతో కడుపు నిండుతుందా అని ప్రశ్నించారు. మాండ్యా ప్రాంతంలో శ్రీనివాస్ అనే ఆటోవాలా కూడా మోడీపై నిప్పులు చెరిగారు. ఇప్పుడు అన్నింటిపైనా పన్నులు వేస్తున్నారని, తాగునీటికి కూడా మీటర్లు బిగించారని చెప్పారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే తాము పీల్చే గాలిపై కూడా పన్ను వేస్తుందేమోనని ఎద్దేవా చేశారు. 'మోడీ ప్రభుత్వం చెప్పేవన్నీ అబద్ధాలే. జీరో బ్యాలెన్స్ అకౌంట్ తెరవమని చెప్పారు. అయినా బ్యాంకులు ఐదు వందల రూపాయలు వసూలు చేశాయి. ఖాతా తెరిచినా ఒక్క రూపాయి కూడా అందులో పడలేదు. పైగా సంవత్సరం తిరిగే సరికి సర్వీస్ ట్యాక్స్ కింద నా ఖాతా నుండి కొంత మొత్తం కట్ చేశారు. కడుపు నిండిన వారికి, వ్యాపారులకు మాత్రమే మోడీ దేవుడు' అని ఆయన మండిపడ్డారు. మోడీ మద్దతుదారులు మాత్రం ఈ వాదనలను ఖండిస్తున్నారు. అయితే ఈసారి మోడీ గ్రాఫ్ కొంచెం పడిపోయిందని బీజేపీ మద్దతుదారు అనుపమ అంగీకరించారు.

అయితే మోడీ మాత్రం ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు కొనసాగించారు. ఆయన కేవలం 'హిందూత్వ' ప్రచారానికే పరిమితం కాలేదు. తనపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యక్తిగత విమర్శలను ప్రస్తావిస్తూ ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. బజరంగ్‌దళ్, పీఎఫ్‌ఐల నిషేధంపై కాంగ్రెస్ మాట్లాడగానే బజరంగ్‌బలిపై నిషేధం గురించి మోడీ ప్రస్తావించారు. ఓటు వేయడానికి వెళ్లినప్పుడు 'జై బజరంగబలి' అని నినదించాలంటూ పిలుపునిచ్చి ప్రజలలో భావోద్వేగాలు రేకెత్తించారు. ఆ విధంగా అందివచ్చిన అవకాశాలన్నింటినీ ఎన్నికల ప్రయోజనం కోసం బీజేపీ వాడుకుంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అయితే తన ఎన్నికల ప్రచారం సందర్భంగా అన్ని దేవాలయాలనూ సందర్శించి హిందూ కార్డును ప్రయోగించారు. తెలంగాణకు చెందిన రాజాసింగ్ సైతం ముస్లింలపై విషం చిమ్మారు. తామేమీ తక్కువ తినలేదన్నట్లు కర్నాటక బీజేపీ నేతలు అగ్నికి ఆజ్యం పోశారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఏ ఒక్క అంశానికో పరిమితం కాలేదు. విజయం కోసం అనేక అడ్డదారులు తొక్కింది.

ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ 400 ర్యాలీలు, 130 రోడ్‌షోలు నిర్వహించింది. ఇందుకోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. నేతలపై పూల వర్షం కురిపించడానికే కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. మోడీ సైతం 19 బహిరంగ సభలలో ప్రసంగించారు. ఆరు రోడ్‌షోలు నిర్వహించారు. అయితే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలను కలవరపాటుకు గురిచేస్తున్న విషయం ఒకటి ఉంది. రాష్ట్రంలో కుల పరంగా నాయకులు బలోపేతం కావడం వారికి సుతరామూ ఇష్టం లేదు. అందుకే లింగాయత్ నేత యడియూరప్పకు ఈసారి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. కుర్బుల నాయకుడు ఈశ్వరప్పను పక్కన పెట్టారు. బీఎస్ సంతోష్, ప్రహ్లాద్ జోషీ వాంటి వారే అంతా తామై నడిపించారు. ఈ వైఖరి పార్టీకి నష్టదాయకమని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా రేపు ఈవీఎంలు తెరచినప్పుడు అన్ని సందేహాలు పటాపంచలు అవుతాయి.

ఆర్‌ఎస్‌ఎస్ నిజ స్వరూపమిది!

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించింది. కురుల్కర్ పోలీస్ కస్టడీని ఈ నెల 15 వరకూ ప్రత్యేక కోర్టు పొడిగించిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా మాట్లాడారు. కురుల్కర్ అరెస్టు చాలా తీవ్రమైన విషయమని, ఇది ఆర్‌ఎస్‌ఎస్ జాతి వ్యతిరేక వైఖరిని బయటపెడుతుందని అన్నారు. 'ప్రదీప్ కురుల్కర్ ఆర్‌ఎస్‌ఎస్ క్రియాశీల కార్యకర్త. డీఆర్‌డీఓ ఆర్ అండ్ డీ (ఇంజనీరింగ్) డైరెక్టర్ అయిన అతను పాకిస్తాన్‌కు రహస్య సమాచారం చేరవేసినందుకు మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసింది. జాతీయవాద సంస్థగా గొప్పలు చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధాలను, నిజస్వరూపాన్ని ఇది బట్టబయలు చేస్తుంది' అని ఖేరా అన్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి కురుల్కర్ ఆర్‌ఎస్‌ఎస్ సంబంధాలపై ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో తమ అనుబంధం తరతరాలుగా కొనసాగుతుందని, తన తాత, తండ్రి కూడా ఆ సంస్థ కోసమే పనిచేశారని గత ఏడాది ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కురుల్కర్ వెల్లడించిన విషయాన్ని ఖేరా గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో ఈ వీడియోను ప్రదర్శించారు. పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ మహిళా ఏజెంట్‌కు డిఆర్‌డిఓలో దాదాపు మూడు దశాబ్దాలుగా కీలక విధుల్లో ఉన్న కురుల్కర్ వాట్సాప్, వీడియో కాల్స్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు గుర్తించి, ఆయనను గత వారం ఎటిఎస్ అరెస్టు చేసింది.

చట్టవిరుద్ధమే...

(మొదటిపేజీ తరువాయి)

వీడుతూ ఏక్‌నాథ్ శిండే తీసుకున్న నిర్ణయం, పార్టీ చీలిక నేపథ్యంలో బలపరీక్షకు వెళ్లకుండానే ఉద్ధవ్ రాజీనామా చేశారని అందువల్ల ఆయన రాజీనామాను రద్దు చేసి, మళ్లీ ముఖ్యమంత్రిగా చేయలేమని పేర్కొంది. రాజీనామా చేయకుండా థాకరే సంయమనం పాటించి వుంటే ఆయన్ని తిరిగి సీఎం గద్దెపై కూర్చోబెట్టవచ్చని పేర్కొంది. రాజీనామా కారణంగా బలపరీక్ష జరగనందున ఈ అవకాశమే తలెత్తదని బెంచ్ పేర్కొంది.

ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పి.ఎస్.నరసింహాలతో కూడిన బెంచ్ ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. పార్టీ అంతర్గత వివాదాలను పరిష్కరించడానికి బల పరీక్ష నిర్వహించాలని గవర్నర్ నిర్ణయం తీసుకోవడం తప్పని బెంచ్ పేర్కొంది. ఏక్‌నాథ్ శిండే వర్గం నుంచి పార్టీ విప్‌ను నియమించడం స్పీకర్ చేసిన తప్పని పేర్కొంది. "రాజకీయ రంగంలోకి ప్రవేశించేందుకు, పార్టీలో, పార్టీల మధ్య వివాదాల్లో పాత్ర పోషించేందుకు అటు రాజ్యాంగం గానీ ఇటు చట్టం గానీ గవర్నర్‌కు అధికారం కల్పించడం లేదు." అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానిం చారు. గవర్నర్ కోషియారిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తన రాజ్యాంగ పరిధులు దాటి ఆయన వ్యవహరించారని తీర్పు వ్యాఖ్యానించింది. మహావికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం మెజారిటీని, సభా విశ్వాసాన్ని కోల్పోయిందన్న తన అనుమానానికి మద్దతుగా ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేకుండానే విశ్వాస పరీక్షకు పిలుపునివ్వడం ద్వారా ఆయన రాజకీయ రంగంలోకి దూకారని వ్యాఖ్యానించింది. "అసంతృప్తిగా వున్న ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించాలని భావించినట్లు గవర్నర్ ఆధారపడిన ఏ కమ్యూనికేషన్‌లోనూ సూచించలేదు." అని చంద్రచూడ్ అన్నారు. శిండే వర్గానికి చెందిన భరత్‌షెట్ గాగ్వాలెను పార్టీ విప్‌గా నియమించడం కూడా చట్టవిరుద్ధమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. శిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తిస్తూ, పార్టీ చిహ్నం విల్లు, బాణం గుర్తును ఇస్తూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం పునరాలోచన ప్రభావాన్ని కలిగి లేదని సుప్రీంతీర్పు వ్యాఖ్యానించింది. పైగా ఇది, పార్టీ 2018 నిబంధనావళిలో, పార్టీ అంతర్గత ఎన్నికల ఫలితాల్లో జోక్యం చేసుకోవడమే కాగలదని పేర్కొంది. ఎన్నికల కమిషన్ శిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం వెలువరించే వరకు శిండే, ఇతర ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత పిటిషన్లను స్పీకర్ రాహుల్ నర్వాకర్ తన వద్ద అట్టిపెట్టుకోరాదని కోర్టు అభిప్రాయపడింది. జూన్ 25న పార్టీ ఫిరాయించినందుకు గానూ అప్పటి డిప్యూటీ స్పీకర్ నరహరి జరివాల్ మాత్రం షిండేతో సహా 39మంది ఎమ్మెల్యేలపై అనర్హత నోటీసులు జారీ చేశారు.

శిండే ప్రభుత్వం తాత్కాలికంగా కొనసాగినప్పటికీ, పార్టీని చీల్చానని, అంతేకానీ పార్టీ నుంచి ఫిరాయించలేదని ముఖ్యమంత్రి ఇప్పటివరకు చేస్తూ వస్తున్న వాదనను సుప్రీం తీర్పు తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

అక్రమాలు జరిగాయని కోర్టు భావిస్తోంది, కానీ ఫలితాన్ని మార్చడానికి మాత్రం తిరస్కరిస్తూ ఇచ్చిన తీర్పుపై సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. జర్నలిస్టు సుహాస్ పాల్షికర్ మాట్లాడుతూ, "చాలా కచ్చితంగా మాట్లాడాలంటే, శిండే ప్రభుత్వ ఏర్పాటుకు చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని సుప్రీం కోర్టు నిజానికి చెప్పలేదా? ప్రభుత్వాన్ని తొలగించాలని ఆదేశించకపోవచ్చు, కానీ ఒకసారి చట్టబద్ధత అంటూ పోయిన తర్వాత ప్రభుత్వం కూడా తొలగాల్సిందే." అని వ్యాఖ్యానించారు. సభలో మెజారిటీకి అవసరమైనంత మంది ఎమ్మెల్యేలు తన వైపు లేరని భావించిన ఉద్ధవ్ థాకరే రాజీనామా చేసేసినందున తిరిగి ఆయనను ముఖ్యమంత్రిగా నియమించేందుకు ఆచరణాత్మకంగా గల మార్గాలను సుప్రీంకోర్టు బెంచ్ గతంలో ఎనిమిది సార్లు కేసు విచారణ జరిగిన సందర్భాల్లోనూ పరిశీలించింది.

గతేడాది జూన్‌లో ఏక్‌నాథ్ శిండే నేతృత్వంలో శివసేన ఎమ్మెల్యేలు థాకరేపై తిరుగుబాటు చేశారు. కాంగ్రెస్, ఎన్‌సీపీలతో పొత్తు పెట్టుకోవాలన్న థాకరే నిర్ణయం పార్టీ హిందూత్వ సిద్ధాంతాలకు వ్యతిరేకమని పేర్కొంటూ శిండే వర్గం తిరుగుబాటుకు పాల్పడింది. బిజెపి నియమించిన గవర్నర్ మద్దతుతో రెబెల్ ఎమ్మెల్యేలు విశ్వాస పరీక్షకు పిలుస్తారని తేలినపుడు అప్పటి డిప్యూటీ స్పీకర్ నుంచి శిండేకు అనర్హతా నోటీసులు వచ్చాయి.

రెబెల్స్‌ను అనర్హులుగా ప్రకటించాలా లేదా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఈ విషయం మొత్తం సుప్రీంకోర్టుకు చేరింది. అదే ఏడాది జూన్ 27న శిండేకు సుప్రీం కోర్టు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించింది. అనర్హతా నోటీసులకు తమ స్పందనలను దాఖలు చేసేందుకు గడువును పొడిగించింది. తర్వాత, జూన్ 29న గవర్నర్ బలపరీక్షకు అనుమతినిచ్చింది. ఆ రోజునే థాకరే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. జూన్ 30న బలపరీక్షకు గవర్నర్ భగత్ సింగ్ కోషియార్ తీసుకున్న నిర్ణయంపై స్టే ఇవ్వడానికి సుప్రీం తిరస్కరించడంతో గంటల వ్యవధిలోనే మహా వికాస్ అగాఢి (ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. దీంతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా శిండేను గవర్నర్ ఆహ్వానించారు.

ప్రభుత్వానిదే సర్వాధికారం

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా కీలక తీర్పు ఇచ్చింది. ఎన్నికైన ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కట్టుబడి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. భూమి, శాంతి భద్రతలు మినహా మిగతా అన్ని అంశాలపై ఢిల్లీ ప్రభుత్వానికే నియంత్రణ ఉండాలని తెలిపింది.

"ప్రజాస్వామ్యం, ఫెడరల్ విధానాలు.. అన్నీ రాజ్యాంగ మూల స్వరూపంలో భాగమే. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అసలైన అధికారాలు.. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల చేతుల్లోనే ఉండాలి. పాలనా వ్యవహారాలపై నియంత్రణ కూడా వారిదే. ఎన్నికైన ప్రభుత్వం నిర్ణయాలకు ఎల్జీ కట్టుబడి ఉండాలి. అధికారులు మంత్రులకు నివేదించకపోతే.. వారి ఆదేశాలను పాటించకపోతే.. అప్పుడు సమగ్ర పాలనా విధానాలపై అది ప్రతికూల ప్రభావం చూపిస్తుంది" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

"ఢిల్లీ దేశంలోని ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా ఉండదు. దేశ రాజధాని అయినందున దీనికి ప్రత్యేక స్వరూపం ఉంది. ఇక్కడ పబ్లిక్ ఆర్డర్, భూమి, పోలీసు వ్యవస్థపై కార్యనిర్వాహక అధికారాలు కేంద్రానికే ఉంటాయి. అయితే, ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఢిల్లీలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉంది. అందువల్ల పాలనా సర్వీసులపై అసలైన అధికారాలు ప్రజాప్రతినిధులతో కూడిన ప్రభుత్వానికే ఉంటాయి" అని తెలిపింది.

ఢిల్లీలోని అన్ని పాలనా సర్వీసులపై కేంద్రానికే నియంత్రణ ఉంటుందంటూ 2015లో కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ సానుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2019 ఫిబ్రవరి 14న ఈ వివాదంపై భిన్నాభిప్రాయ తీర్పును వెలువరించింది. పాలనా సర్వీసులపై ఢిల్లీ ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు లేవని జస్టిస్ అశోక్ భూషణ్ చెప్పగా.. జస్టిస్ ఏకె సిక్రి దాన్ని వ్యతిరేకించారు.

ఢిల్లీలోని పాలనాధికారుల నియంత్రణకు సంబంధించిన శాసన, కార్యనిర్వాహక అధికారం కేంద్రానిదా, ఆ రాష్ట్ర ప్రభుత్వానిదా అనే వివాదాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నట్లు గతేడాది మే 6న సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం జనవరి 18న తీర్పు రిజర్వ్ చేసింది. ఈ క్రమంలోనే జస్టిస్ అశోక్ భూషణ్ ఇచ్చిన తీర్పును విస్తృత ధర్మాసనం తోసిపుచ్చింది.

చారిత్రాత్మక తీర్పు: కేజ్రీవాల్



ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టిస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం-ఢిల్లీ సర్వీసుల వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. ఇది చరిత్రాత్మక తీర్పు అని అన్నారు. దేశ రాజధాని నగరంలోని సర్వీసెస్‌పై కేంద్ర ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2015లో జారీ చేసిన నోటిఫికేషన్‌పై మండిపడ్డారు. గురువారం కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన చేతులను కట్టేసి, నీటిలో పడేసినప్పటికీ, తమ ప్రభుత్వం చాలా మంచి పనులు చేసిందన్నారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనానికి ధన్యవాదాలు తెలిపారు. తాము దేశానికి సరికొత్త విద్యా విధానాన్ని అందించామన్నారు.

ఇదివరకటి కన్నా 10 రెట్ల వేగంతో పనులు ఇకపై జరుగుతాయన్నారు. యావత్తు దేశానికి సమర్థ పరిపాలన నమూనాను ఢిల్లీ సమర్పిస్తుందన్నారు. రానున్న రోజుల్లో బ్యూరోక్రసీలో భారీ మార్పులు జరుగుతాయనే సంకేతాలు ఇచ్చారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ పనులకు ఆటంకాలు సృష్టించే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమర్థులు, నిజాయితీపరులు, బాధ్యతాయుతంగా మెలిగేవారు, కారుణ్యంగలవారు ఢిల్లీ ప్రజలకు సేవ చేసే అవకాశం పొందుతారని చెప్పారు. పరిపాలనా వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తామన్నారు. మొత్తం వ్యవస్థ కుళ్లిపోయిందన్నారు. ప్రజలకు జవాబుదారీగా, బాధ్యతాయుతంగా ఉండే వ్యవస్థను సృష్టిస్తామన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకె సక్సేనాను త్వరలో కలుస్తానని, ఆయన ఆశీర్వాదాలు తీసుకుంటానని చెప్పారు. యాంటీ కరప్షన్ బ్రాంచ్ గురించి విలేకర్లు అడిగినపుడు ఆయన స్పందిస్తూ, ఏసీబీ తన ప్రభుత్వ పరిధిలో లేదని, విజిలెన్స్ తన ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని చెప్పారు. సక్రమంగా పని చేయని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

పత్రికా స్వేచ్ఛకు పెను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పెడుతున్నారని గుర్తు చేసింది. పత్రికా స్వేచ్ఛకు సంబంధించి ఈ నెల 3న విడుదలైన సూచికలో భారత్ 180 దేశాలలో 161 స్థానంలో నిలిచిందని సంపాదకీయం తెలిపింది. రత్నగిరిలో జరిగిన శశికాంత్ విరిషే ఉదంతాన్ని ప్రస్తావిస్తూ నేరపూరిత, మాఫియా కార్యకలాపాలను బయటపెట్టినందుకు జర్నలిస్టులను పొట్టన పెట్టుకుంటున్నారని పేర్కొంది. 'దేశంలో పాత్రికేయుల పరిస్థితి ఇలా ఉన్నందునే సూచికలో చివరి స్థానాలలో నిలిచాం. మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు, స్వతంత్ర మీడియా సంస్థలను, పాత్రికేయులను అణచివేసేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ దృష్టి ఇప్పుడు చిన్న చిన్న స్వతంత్ర వార్తా వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా పైన కూడా పడింది. వెబ్‌సైట్లను, సోషల్ మీడియాను నియంత్రించేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు అధికారం అప్పగిస్తూ ఐటీ చట్టంలో నిబంధనలు రూపొందించారు. ప్రభుత్వ సంబంధమైన వార్తలలో అసత్యాలు ఏమైనా ఉన్నాయా అని నిర్ధారించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కింద ఏర్పాటు చేసిన కమిటీకి అధికారాలు కట్టబెట్టారు. దీంతో వార్తల ప్రచురణ, ప్రసారంపై ప్రభుత్వ పెత్తనం మరింత పెరిగింది.' అని సీపీఐ (ఎం) విమర్శించింది. మీడియా యాజమాన్యాలు కొన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లడం పత్రికా స్వేచ్ఛకు మరో పెద్ద ముప్పు అని సీపీఐ (ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై ఆధిపత్యం చెలాయిస్తున్న కార్పొరేట్ సంస్థలు మోడీ పాలనను ఆకాశానికి ఎత్తుతూ ప్రచారం నిర్వహిస్తున్నాయని, అలాగే టీవీ ఛానల్స్ కూడా మోడీ ప్రభుత్వాన్ని, హిందూత్వ రాజకీయాలను పొగడ్తలతో ముంచెత్తుతున్నాయని పేర్కొంది. స్వతంత్రంగా వ్యవహరిస్తున్న ఛానల్స్‌పై దాడులు, వేధింపులు జరుగుతున్నాయని అంటూ కొన్ని ఛానల్స్‌ను మోడీ భజనపరులైన కార్పొరేట్ దిగ్గజాలు కొనుగోలు చేశారని వివరించింది. ఈ సందర్భంగా ఎన్డీటీవీని అదానీ కైవసం చేసుకోవడాన్ని ప్రస్తావించింది. 'స్వతంత్ర జర్నలిజానికి, పరిశోధనాత్మక జర్నలిజానికి మీడియాలో తగిన స్థానం లభించడం లేదు. ప్రజాస్వామ్యం పైన, ప్రజాస్వామిక హక్కుల పైన మోడీ ప్రభుత్వం జరుపుతున్న దాడిలో భాగంగానే పత్రికా స్వేచ్ఛ అణచివేతను చూడాల్సి ఉంటుంది. మీడియాలో ఏ వార్తలను ప్రచురించాలో, వేటిని తొలగించాలో నిర్దేశించే స్థాయికి చేరుకున్నామని ప్రభుత్వం భావిస్తోంది. ఇన్ని నిర్బంధాల నడుమ ధైర్యంతో తమ విధులు నిర్వర్తిస్తున్న పాత్రికేయులు అభినందనీయులు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి చేస్తున్న పోరాటంలో పత్రికా స్వేచ్ఛ కోసం జరిపే పోరు కూడా ఒక భాగమే' అని పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయంలో సీపీఐ (ఎం) వివరించింది.

బిజినెస్

డిజిటల్ వేదికలతో అధిక ఆర్థిక మోసాలు

పీడబ్ల్యూసీ ఇండియా వెల్లడి



న్యూఢిల్లీ : డిజిటల్ వేదికలు, యాప్స్‌తో ఆర్థిక మోసాలు ఎక్కువ అవుతున్నాయని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. భారతదేశంలో జరిగిన అన్ని మోసాల సంఘటనలలో సగానికి పైగా సామాజిక మాధ్యమాలు, రిమోట్ వర్క్, ఇ-కామర్స్, డెలివరీ అప్లికేషన్స్, కాంటక్ట్‌లెస్ చెల్లింపులు, ఫిన్‌టెక్ వేదికలు తదితర వాటితోనే అధికంగా చోటు చేసుకున్నాయని పీడబ్ల్యూసీ ఇండియా వెల్లడించింది. పీడబ్ల్యూసీ గ్లోబల్ ఎకనామిక్ క్రైమ్ అండ్ ఫ్రాడ్ సర్వే 2022 రిపోర్ట్ ప్రకారం.. డిజిటల్ వేదికల వల్లే 26శాతం పైగా భారతీయ సంస్థలు 1 మిలియన్ డాలర్లు (రూ.8.2 కోట్లు) మోసపోయాయి. 44శాతం మంది నేరస్తులు ఆర్థిక లాభం కోసమే మోసానికి పాల్పడ్డారని పీడబ్ల్యూసీ నివేదిక తెలిపింది. టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్, క్యాపిటల్ మార్కెట్లు, కన్స్యూమర్ ప్రాడక్ట్స్, రిటైల్, విద్యా, వైద్యం తదితర విభిన్న రంగాలకు చెందిన 111 సంస్థలను సర్వే చేసినట్టు పీడబ్ల్యూసీ తెలిపింది.

గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ వినియోగదారులు, సంస్థలు వేగంగా కొత్త వేదికలను స్వీకరిస్తున్నాయని పీడబ్ల్యూసీ ఇండియా ఫోరెన్సిక్స్ సర్వీసెస్ భాగస్వామి పునీత్ గార్క్యేల్ అన్నారు. "సగటున, ఒక భారతీయ కంపెనీ నేడు దాని సాధారణ వ్యాపార కార్యకలాపాలలో భాగంగా ఐదు వేర్వేరు ప్లాట్‌ఫారమ్‌లతో పనిచేస్తుంది. ఈ-కామర్స్, కాంటాక్ట్‌లెస్ చెల్లింపులు, హోమ్ డెలివరీ మోడల్‌లు, రిమోట్ వర్కింగ్ ఆవిర్భావం, పలు ఆవిష్కరణలు మోసగాళ్ల ప్రవేశానికి మార్గాలను సులభతరం చేశాయి" అని పునీత్ పేర్కొన్నారు. వీటి పట్ల అభివృద్ధి చెందుతున్న సంస్థలు అవగాహన కలిగి ఉండాలన్నారు. తమను తాము రక్షించుకోవడానికి మోసం నివారణ, గుర్తింపు వ్యూహాలలో తగినంతగా పెట్టుబడి పెట్టాలని సూచించారు. భారతదేశంలోని 10 ప్లాట్‌ఫారమ్ మోసాలలో నాలుగు అంతర్గత నేరస్థులచే జరిగినవేనని ఈ రిపోర్ట్ పేర్కొంది. బలమైన అంతర్గత నియంత్రణలు ఉంటే అన్ని ప్లాట్‌ఫారమ్ మోసాలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ తగ్గించవచ్చని సూచించింది.

మాన్‌కైండ్‌పై ఐటీ దాడులు

న్యూఢిల్లీ : మాన్‌కైండ్ ఫార్మా కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు గురువారం దాడులు చేశారు. న్యూఢిల్లీలోని సంస్థ కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయని రాయిటర్స్ రిపోర్ట్ చేసింది. ఈ కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన రెండు రోజులకే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. ఐటీ సోదాలతో ఓ దశలో 5 శాతం విలువ కోల్పోయిన కంపెనీ షేర్ తుదకు 0.16 శాతం నష్టంతో రూ.1,379.65 వద్ద ముగిసింది.

సోయ, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకం రద్దు

న్యూఢిల్లీ: ముడి సోయాబీన్ చమురు, పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) సీడ్ ఆయిల్ దిగుమతులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకం, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సెస్‌ను రద్దు చేస్తున్నట్టు గురువారం కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన చేసింది. ఈ దిగుమతి సుంకం మినహాయింపు జూన్ 30 వరకు అమలులో ఉంటుందని తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ రేట్ కోటా లైసెన్స్ ఉన్న దిగుమతిదారులకు మాత్రమే ఇది వర్తిస్తుందని వెల్లడించింది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో ముడి సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్, ముడి సోయాబీన్ ఆయిల్‌కు సంవత్సరానికి 2 మిలియన్ టన్నుల వరకు సుంకం రహిత దిగుమతి వర్తిస్తుందని తెలిపింది. కేంద్రం విధించిన పరిమితి దాటితే అధిక సుంకం వసూలు చేస్తారు.

మాక్సివిజన్, గ్రేట్‌హెచ్‌ఆర్ ఒప్పందం

హైదరాబాద్ : గ్రేట్‌హెచ్‌ఆర్‌తో మాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఒప్పందం కుదుర్చుకుంది. మాక్సివిజన్‌లో పెరోల్ ప్రక్రియలను డిజిటలైజ్ చేయడానికి, సరళీకృతం చేయడానికి ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. మాక్సివిజన్ ఐ హాస్పిటల్‌ను మా ప్లాట్‌ఫామ్‌లోకి సంతోషంగా ఆహ్వానిస్తున్నామని గ్రేట్‌హెచ్‌ఆర్ సిఇఒ, వ్యవస్థాపకులు గిరీష్ రౌజీ పేర్కొన్నారు. ఈ ఒప్పందం ఆ సంస్థ ఉత్పాదకతను మెరుగుపరచడానికి, సామర్థ్యాన్ని పెంచడానికి, మొత్తం ఉద్యోగుల సంతృప్తిని పెంపొందించగలదన్నారు.

ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బీ లాభాల్లో 144% వృద్ధి

ముంబయి : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 144.4 శాతం వృద్ధితో రూ.309.50 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2021-22 ఇదే సమయంలో రూ.126.52 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022-23లో మొత్తంగా రూ.1,099.92 కోట్ల నికర లాభాలు ఆర్జించింది. ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.0.5 డివిడెండ్‌ను ప్రకటించింది. 2021-22లో ఈ సంస్థ రూ.414.58 కోట్ల నష్టాలు చవి చూసింది. 2023 మార్చి నాటికి స్థూల రుణ పుస్తకం 33 శాతం పెరిగి రూ.24,085 కోట్లకు చేరింది.

హైదరాబాద్‌లో మరో డేటా సెంటర్ ఏర్పాటు

వెబ్‌వర్క్స్, ఐరన్ మౌంటైన్ జెవి వెల్లడి

హైదరాబాద్: వెబ్‌వర్క్స్, ఐరన్ మౌంటైన్ డేటా సెంటర్స్ సంయుక్తంగా దేశంలో తమ మొదటి డేటా సెంటర్-1ని హైదరాబాద్‌లో ఏర్పాటుచేసినట్టు ప్రకటించాయి. నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో ఉన్న హెచ్‌వైడి-1 సెంటర్‌ను 1.20 చదరపు అడుగుల విస్తీర్ణంలో అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించాయి. దేశం అంతటా 'స్ట్రింగ్ ఆఫ్ డిజిటల్ పెరల్స్'ని రూపొందించడానికి భారీ పెట్టుబడులను చేపట్టినట్టు తెలిపాయి. ఇది గ్లోబల్ డేటా సెంటర్ ప్రొవైడర్‌తో క్లిష్టమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా కస్టమర్‌లు వారి డిజిటల్ పరివర్తన వ్యూహాలను విస్తరించటానికి వీలు కల్పిస్తుందని వెబ్‌వర్క్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ నిఖిల్ రాఠీ పేర్కొన్నారు.

ఏడాదిలో 45 కొత్త రెస్టారెంట్లు తెరుస్తాం

వెస్ట్‌లైఫ్ ఫుడ్ వరల్డ్ వెల్లడి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 18 కొత్త రెస్టారెంట్లు తెరిచామని వెస్ట్‌లైఫ్ ఫుడ్ వరల్డ్ లిమిటెడ్ వెల్లడించింది. ఈ సంస్థ మెక్‌డొనాల్డ్స్ రెస్టారెంట్‌లను నిర్వహిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 40-45 రెస్టారెంట్లను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. 2027 నాటికి 580-630 కొత్త అవుట్‌లెట్‌లను ప్రారంభించాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. 2023 మార్చి ముగింపు నాటికి 56 నగరాల్లో 357 రెస్టారెంట్లను కలిగి ఉంది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికం అమ్మకాల్లో 14 శాతం వృద్ధితో రూ.556 కోట్ల అమ్మకాలు నమోదు చేసినట్టు తెలిపింది.

ఉగ్రవాద మూలాల శోధన

సంబంధాలపై ఇంటెలిజెన్స్ ఆరా

- సమీక్షిస్తున్న రాష్ట్ర హోం మంత్రి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్ నగరంలో పట్టుబడ్డ ఆరుగురు ఉగ్రవాదులకు సంబంధించిన మూలాలను రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిశితంగా శోధిస్తున్నారు. రెండ్రోజుల క్రితం నగరంలో రహస్యంగా మకాం వేసిన ఆరుగురు ఉగ్రవాదులు మహ్మద్ సలీం, జునైద్, రెహ్మాన్, అబ్బాస్, సులేమాన్, హమీద్‌లను మధ్యప్రదేశ్ పోలీసుల సహకారంతో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. వీరిని తదుపరి దర్యాప్తు కోసం మధ్యప్రదేశ్ పోలీసులు భోపాల్‌కు తీసుకెళ్లి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచారు. కాగా, హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఈ ఆరుగురు ఉగ్రవాదులు చేస్తున్న కార్యకలాపాలు, రహస్య కదలికలతో పాటు వీరు చేయదల్చుకున్న విధ్వంసాల గురించి మరింత నిశితంగా ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. జగద్గిరిగుట్ట, జవహర్‌నగర్, బాలాజీనగర్, పాత బస్తీల్లో మకాం వేసిన ఈ ఆరుగురు ఉగ్రవాదులు గత 18 నెలలుగా తమ ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి మరికొందరు అమాయకపు ముస్లింలను లోబర్చుకునే ప్రయత్నాలు చేశారని నిఘా అధికారులు అనుమానిస్తున్నారు. అంతేగాక, వివిధ వృత్తులలో కొనసాగుతూ మూడో కంటికి అనుమానం రానీయకుండా తరచుగా రహస్య ప్రదేశాల్లో కలిసేవారని నిఘా అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా, వికారాబాద్ అడవుల్లో వీరు కలుసుకొని తమ వ్యూహాల గురించి ఒకరికొకరు సమాచారమిచ్చుకొని తదుపరి కార్యాచరణ గురించి ప్రణాళికలు వేసుకొనేవారని తెలిసింది. అయితే, తాము ఉంటున్న నివాసాల వద్ద మాత్రం తమ పిల్లలు, కుటుంబ సభ్యులతో ఉంటూ తాము సాగిస్తున్న విద్రోహ కార్యకలాపాల గురించి స్థానికులెవ్వరికి కూడా అనుమానాలకు తావీవ్వకుండా ప్రవర్తించేవారని తెలిసింది. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్తే ఏ రాత్రో ఇంటికి వచ్చేవారని నిఘా అధికారులు సమాచారాన్ని సేకరించారు.

తరచుగా ఏ మసీదులకు వీరు వెళ్లేవారు? అక్కడ ఎవరితో ఎక్కువగా కలిసేవారు? వీరిని తరచూ కలిసేవారెవరు? అనే కోణంలో నిఘా అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. నిజామాబాద్‌లో పీఎఫ్‌ఐ కార్యకలాపాలతో పాటు నగరం నుంచి గత ఏడాది కాలంలో ఆరుగురికి పైన లష్కర్-ఎ-తోయిబా(ఎల్‌ఈటీ)తో సంబంధాలు కలిగి ఉన్న ఉగ్రవాదులను ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేసిన ఘటనల నేపథ్యంలో తాజాగా ఈ ఆరుగురు హజ్ ఉజ్ తజ్జమీన్‌కు చెందిన ఉగ్రవాదులు పట్టుబడటంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింతగా అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడిన రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ.. పట్టుబడ్డ ఆరుగురు ఉగ్రవాదుల గురించి, వారు ఇక్కడ మకాం వేసి నిర్వహిస్తున్న కార్యకలాపాల గురించి ఆరా తీశారని తెలిసింది. ముఖ్యంగా, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌లతో పాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు మరింతంగా అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఉందంటూ ఆయన అధికారులకు సూచనలు చేశారని తెలిసింది.

'మన్ కీ బాత్'కు హాజరు కాలేదనీ...

36 నర్సింగ్ విద్యార్థినిలకు పనిష్‌మెంట్

వారం పాటు హాస్టల్‌ను వీడి బయటకు రాకుండా ఆదేశాలు

- చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ సంస్థ నిర్వాకం



చండీగఢ్ : ప్రధాని మోడీ నిర్వహించే మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌కు హాజరు కాలేదని నర్సింగ్ విద్యార్థులపై చర్యలు తీసుకున్నది ఒక విద్యా సంస్థ. వారం పాటు సదరు విద్యార్థినులను వారుండే హాస్టల్ వీడి బయటకు రాకుండా ఆదేశాలు జారీ చేసింది. చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్) లో ఈ ఘటన చోటు చేసుకున్నది. పీజీఐఎంఈఆర్ చర్య తాజాగా వెలుగులోకి వచ్చింది. విద్యా సంస్థ తీరుపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతనెల 30న మోడీ రేడియో కార్యక్రమం మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ జరిగింది. క్యాంపస్‌లో ప్రదర్శించబడే మోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వినడానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా విద్యార్థులను సదరు సంస్థ డైరెక్టర్ ఆదేశించారు.

దీనికి సంబంధించిన ఒక సర్క్యులర్ సోషల్ మీడియాలో సైతం చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని పీజీఐఎంఈఆర్ కూడా కొట్టిపారేయలేదు. అయితే 28 మంది మొదటి సంవత్సరం విద్యార్థినులు, 8 మంది మూడో సంవత్సరం విద్యార్థినులు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో వారిని వారం పాటు హాస్టల్ వీడి బయటకు రాకుండా ఈనెల 3న సంస్థ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ సుఖ్‌పాల్ కౌర్ ఒక లేఖను జారీ చేశారు. అయితే, ఈ విషయం ఇప్పుడు బటయకు రావటంతో విద్యాసంస్థ ఆత్మరక్షణలో పడింది. విద్యాసంస్థ చర్య నియంతృత్వ నిర్ణయమని చండీగఢ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మనోజ్ లుబానా ఆరోపించారు.

ఇమ్రాన్ అరెస్టు అక్రమం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. భూ అవినీతికి సంబంధించిన కేసులో ఖాన్‌ను మంగళవారం అవినీతి నిరోధక విభాగం (నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో) అరెస్టు చేసిన తీరుతో దేశవ్యాప్తంగా నిరసనలు తలెత్తాయి. దాంతో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు సైన్యాన్ని రంగంలోకి దించారు. ఇస్లామాబాద్ హై కోర్టును శుక్రవారం ఆశ్రయించాలని, కోర్టు తీసుకునే నిర్ణయాన్ని ఆమోదించాలని సుప్రీం కోర్టు ఇమ్రాన్‌కు తెలియజేసింది. తన అరెస్టు తర్వాత చెలరేగిన హింసాత్మక నిరసనలను ఖాన్ ఖండించాలని పాక్ ప్రధాన న్యాయమూర్తి చెప్పినట్లు మరో మీడియా వార్త పేర్కొంది. సుప్రీం కోర్టులో ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ, హైకోర్టులో తనను కిడ్నాప్ చేశారని, కర్రలతో బాదారని చెప్పారు. తన అరెస్టు తర్వాత దేశంలో ఏం జరుగుతోందో కూడా తనకు తెలియదని ఆయన చెప్పారు. "దేశానికి ఏం నష్టం జరగదు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు ప్రశాంతంగా వుండాలి." అని ఆయన కోరారు. రిజిస్ట్రార్ అనుమతి లేకుండా కోర్టు ఆవరణలో ఖాన్‌ను ఎన్‌ఏబీ అరెస్టుచేయడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి భయం, బెదిరింపులు లేకుండా న్యాయం అందరికీ అందాలన్నది ప్రతి ఒక్కరి హక్కని, తాజా చర్య, ఆ హక్కును తిరస్కరించడమే కాగలదని పేర్కొంది. "ఒక వ్యక్తి కోర్టుకు లొంగిపోతే, అప్పుడు ఆ వ్యక్తిని అరెస్టు చేయడమంటే అర్థం ఏమిటి?" అని ప్రశ్నించింది. గంటలోగా న్యాయస్థానం ముందు హాజరుపరచాల్సిందిగా ఎన్‌ఏబీని ఆదేశించింది. దాంతో వెంటనే ఇమ్రాన్‌ను న్యాయస్థానం ముందు హాజరుపర్చారు. తన అరెస్టును వ్యతిరేకిస్తూ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ జరిపిన న్యాయ స్థానం ఇమ్రాన్ విడుదలకు ఆదేశాలు జారీ చేసింది.

శాంతియుతంగా వ్యవహరించండి : అధ్యక్షుడు అరిఫ్ అల్వి

దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభం, అశాంతి పై పాకిస్తాన్ అధ్యక్షుడు అరిఫ్ అల్వి ఆందోళన వ్యక్తం చేశారు. బలవంతపు చర్యలు, అరెస్టుల కన్నా రాజ కీయ పరిష్కారాల కోసం చూడాలని కోరారు. దేశం లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే, ఆం దోళనగా, దిగ్భ్రాంతికరంగా, తీవ్రంగా కలచి వేసేవి గా వున్నాయని ఈ మేరకు ట్వీట్ చేశారు. చట్టపరిధి లో నిరసనలు వుండాలని సూచిస్తూ, శాంతియుతం గా వ్యవహరిం చాల్సిందిగా ప్రజలను కోరారు.

నిరసనల్లో 8 మంది మృతి

ఇప్పటివరకు పాక్‌లో చెలరేగిన నిరసనల్లో ఎనిమిది మంది మరణించగా, దాదాపు 300మంది గాయపడ్డారు. దేశంలో పలుచోట్ల శాంతి భద్రతల అధికారులతో నిరసనకారులు ఘర్షణ పడ్డారు. లాహోర్, పెషావర్‌ల్లో గృహ దహనాలు, కాల్పులతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.

ఎస్సీ, ఎస్టీల ప్రణాళికల విలీనం సరికాదు



- కేంద్ర బ్లూప్రింట్‌పై ఎస్టీ కమిషన్ అభ్యంతరం

న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేంద్రం ప్రారంభించబోయే నూతన కార్యక్రమానికి సంబంధించిన బ్లూప్రింట్‌పై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను, షెడ్యూల్డ్ తెగల ప్రణాళికను విలీనం చేయాలని కేంద్రం యోచిస్తోంది. ప్రధానంగా వేర్వేరు ప్రణాళికలను విలీనం చేయడంపై ఎస్టీ కమిషన్ అభ్యంతరం తెలిపింది. ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు భిన్నంగా ఉంటాయని, వాటిని వేర్వేరుగా పరిష్కరించాలని, ఈ రెండింటినీ ఒకే పద్దు కింద కలగలపడం సబబు కాదని కమిషన్ వ్యాఖ్యానించింది.

త్వరలో ప్రారంభించబోయే ఈ కార్యక్రమానికి రెండున్నర లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీల కోసం లక్షిత పథకాల అమలుకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు. స్కాలర్‌షిప్పులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వంటి పథకాల కోసం నేరుగా నిధులు అందిస్తారు. ఎస్సీలు, ఎస్టీల జనాభా యాభై శాతానికి పైగా ఉన్న గ్రామాలు, శివారు ప్రాంతాలలో ఈ నిధులు ఖర్చు చేస్తారు. లక్షిత పథకాల కోసం 41 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు తమ బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కేటాయించాల్సి ఉంటుంది. అయితే ఎస్సీ, ఎస్టీల సమస్యలు భిన్నమైనవని, అసమానతలను గుర్తించేందుకు వేర్వేరు వ్యూహాలను రూపొందించుకోవాలని, పాలనాపరమైన ఏర్పాట్లు కూడా భిన్నంగా ఉంటాయని జాతీయ ఎస్టీ కమిషన్ అభిప్రాయపడింది. పైగా ఎస్టీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత నుండి కొన్ని మంత్రిత్వ శాఖలను మినహాయించడంపై కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎందుకు మినహాయింపు ఇచ్చారో తెలపాల్సిందిగా కేంద్రాన్ని కోరింది.

ధర్మ పోరాటం

- సత్యం కోసం మాతో సహకరించండి: రెజ్లర్లు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎస్కేఎం లేఖ
- సీఐటీయూ కార్యకర్తల మద్దతు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 20వ రోజుకు చేరుకుంది. ఈ ప్రక్రియలో జాప్యాన్ని నిరసిస్తూ క్రీడాకారులు గురువారం బ్లాక్ డే పాటించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్లాక్ డేని నిర్వహించారు. వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, సంగీతా ఫోగట్లో సహా అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించారు. మల్లయోధులే చేతికి, తలకి నల్ల బ్యాండ్ కట్టుకుని ధర్నాకు కూర్చున్నారు. రాత్రి, పగలు జరుగుతున్న ఆందోళనకు వందలాది మంది రైతులు, కార్మికులు మద్దతుగా నిలిచారు. పోలీసులు భద్రతను పెంచి అప్రమత్తంగా ఉన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) లేఖ రాసింది. బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకొని, ఆడపిల్లలను రక్షించాలని డిమాండ్ చేసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో హర్యానా నుంచి 200 మంది కార్మికులు జంతర్ మంతర్ లో రెజ్లర్లకు మద్దతు తెలిపారు.

సోషల్ మీడియాలో ట్రెండ్ గా బ్లాక్ డే

రెజ్లర్ల ఈ తరహా నిరసన ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతోంది. సోషల్ మీడియాలో రెజ్లర్లకు మద్దతుగా ప్రజల ట్వీట్లు వెల్లువెత్తుతున్నాయి. మల్లయోధులకు అనుకూలంగా ప్రజలు తమ అభిప్రాయాలను తమదైన రీతిలో వ్యక్తం చేస్తున్నారు.

బ్లాక్ డేకు మద్దతుగా ప్రజలు ముందుకు రావాలని రెజ్లర్లు కూడా విజ్ఞప్తి చేశారు. రెజ్లర్ల ఈ ఆకర్షణ ప్రభావం ట్విట్టర్‌లో కూడా కనిపిస్తోంది. ఇప్పుడు సోషల్ మీడియాలో బ్లాక్ డే వైరల్‌గా మారింది. అంతర్జాతీయ రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ తదితరులు కూడా బ్లాక్ డే ఫోటోను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

ఎన్‌ఈపీ, ఎన్‌పీఎస్ రద్దుకు జులైలో పాదయాత్ర

ఆగస్టు 12న తాలుకా, జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు

- నవంబర్ 3న పార్లమెంట్ మార్చ్
- ఎస్టీఎఫ్ఐ జనరల్ కౌన్సిల్ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ), జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్) రద్దు చేయాలని కోరుతూ జులైలో పాదయాత్ర నిర్వహించనున్నట్టు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ప్రకటించింది. ఆగస్టు 12న తాలుకా, జిల్లా కేంద్రాల్లో 24 గంటలపాటు నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు వివరించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు నవంబర్ మూడో తేదీన పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పిలుపునిచ్చింది. కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించిన ఎస్టీఎఫ్ఐ జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 10,11 తేదీల్లో ఆ సంఘం అధ్యక్షుడు కెసి హరికృష్ణన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సిఎన్ భారతి మాట్లాడుతూ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన ఉద్యోగుల పింఛను సొమ్మును వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020)ని ఉపసంహరించాలని కోరారు. చరిత్ర పాఠాలు, శాస్త్రీయ అంశాలను తొలిగించి, చరిత్రను వక్రీకరించే పాఠాలను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా దశలవారీ పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. 2004 నుంచి అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం (సీపీఎస్), ఎన్‌పీఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయక పోగా, రద్దు చేసిన రాష్ట్రాలు ఇప్పటి వరకు పెన్షన్ ఫండ్‌లో జమచేసిన సొమ్మును వెనక్కి ఇచ్చేది లేదంటూ చెప్పటం దారుణమని విమర్శించారు. సీపీఎస్‌పై అధ్యయనం కోసం కమిటీ వేయటం కంటితుడుపు చర్యేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 2013లో చేసిన పీఎఫ్‌ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే వచ్చే సాధారణ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అధ్యక్షత వహించిన కెసి హరికృష్ణన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యం సూత్రాలకు భిన్నంగా అంధవిశ్వాసాలను పెంపొందించడానికి అనుగుణంగా జాతీయ విద్యావిధానం ఉందని విమర్శించారు. సృజనాత్మకత, ప్రశ్నించే తత్వాన్ని పొంపొందించే విద్యావిధానాన్ని రూపొందించి అమలుచేయాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ విధానంతో రాసిన చరిత్రను తొలిగించి, అవాస్తవమైన, అభూత కల్పనలతో కూడిన అంశాలను చరిత్ర పాఠాలుగా ప్రవేశ పెట్టడాన్ని ప్రజలందరూ నిరసించాలని కోరారు. గాంధీ, భగత్ సింగ్ పాఠాలతోపాటు, శాస్త్రీయంగా నిరూపణకు నిలబడిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలిగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిద్వారా శాస్త్రీయ అంశాలు భవిష్యత్ తరాలకు తెలియకుండా చేయడానికి చేసే ప్రయత్నమని అన్నారు. కార్పొరేట్, ప్రయివేటు అనుకూల విధానాలతో ప్రజలపై మోపుతున్న భారాలను నిరసించాలన్నారు. కేంద్రంలో రెజ్లింగ్ క్రీడాకారులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తూ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను తొలగించి క్రీడాకారులకు న్యాయం చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ఐ కోశాధికారి ప్రకాష్ చంద్ర మొహంతి, జాయింట్ జనరల్ సెక్రటరీ సుకుమార్ పైన్, ఉపాధ్యక్షులు ఎం సంయుక్త, చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, కార్యదర్శి వి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై మరిన్ని పరిశోధనలు అవసరం

రోగులలో అనేక లక్షణాలు కన్పిస్తున్నాయి

- అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ : ప్రజలలో దీర్ఘకాలక కోవిడ్ (లాంగ్ కోవిడ్) లక్షణాలు ఒకేలా ఉండడం లేదని ఓ అధ్యయనం తెలిపింది. కోవిడ్‌తో బాధపడుతున్న వారిలో వేర్వేరు లక్షణాలు కన్పిస్తున్నాయని, ఈ నేపథ్యంలో కచ్చితమైన వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం మరిన్ని పరిశోధనలు అవసరమని వివరించింది. నేచర్ కమ్యూనికేషన్ అనే జర్నల్‌లో ఈ పరిశోధన ప్రచురితమైంది. సార్స్-కోవిడ్ 2 ఇన్‌ఫెక్షన్ ప్రబలిన తర్వాత వ్యాధి లక్షణాలను మరింతగా అర్థం చేసుకునేందుకు అమెరికాలోని ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డులను అధ్యయనం విశ్లేషించింది. ఈ ఇన్‌ఫెక్షన్‌నే లాంగ్ కోవిడ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది చాలా సంక్లిష్టమైనదని, దీనిని విశ్లేషించడం కష్టమని అధ్యయనానికి నేతృత్వం వహించిన చెంగ్సీ జాంగ్ చెప్పారు.

'ఈ వ్యాధి పలు అవయవాలపై ప్రభావం చూపుతుంది. సమాజానికి భారంగా మారింది. అందువల్ల దీనిని తక్షణమే విశ్లేషించి, ప్రజలకు ఎలాంటి చికిత్స అందించాలో నిర్ణయించాల్సి ఉంది. వ్యాధిపై మరింత అధ్యయనం కోసం మేము రూపొందించిన పత్రం ఉపయోగపడుతుంది' అని జాంగ్ తెలిపారు. న్యూయార్క్‌కు చెందిన 1.1 కోట్ల మంది కోవిడ్ రోగులు, ఫ్లోరిడా, జార్జియా, అలబామా నగరాలకు చెందిన 1.68 కోట్ల మంది రోగులపై అధ్యయనం జరిగింది.

రోగులపై జరిపిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను కూడా పరిశీలించారు. న్యూయార్క్, ఫ్లోరిడాలలో కోవిడ్ సోకిన వారి వ్యాధి లక్షణాలను గమనించారు.

లాంగ్ కోవిడ్ సోకిన వారిలో కొందరికి మతి భ్రమించింది. కొందరి జుట్టు ఊడిపోయింది. మరికొందరికి కడుపులో గడ్డలు ఏర్పడ్డాయి. చిన్న పేగులో పుండ్లు, ఊపిరితిత్తులలో రక్తం గడ్డకట్టడం, ఛాతినొప్పి, అసాధారణ వేగంతో గుండె కొట్టుకోవడం వంటి లక్షణాలు కూడా కన్పించాయని అధ్యయన పత్రం వివరించింది.

జేపీఎస్‌ల సమ్మె నీరుగార్చే కుట్రలో సర్కారు

- బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెను నీరుగార్చే కుట్రకు రాష్ట్ర సర్కారు పూనుకున్నదని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జేపీఎస్‌లు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదనీ, ప్రొబేషనరీ పీరియడ్ అయి పోయింది కాబట్టే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీఆర్వోలు తమ హక్కుల కోసం డిమాండ్ చేస్తే ఆ వ్యవస్థనే సీఎం కేసీఆర్ రద్దు చేశారనీ, ఆర్టీసీ కార్మికుల సమ్మెపైనా ఉక్కుపాదం మోపారని విమర్శియాచారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెలు, ధర్నాల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం తగదనీ, గత ప్రభుత్వాలు ఇలాగే చేస్తే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఉగ్రవాద మూలాల సమాచారం బయటకు పొక్కినా హైదరాబాద్‌తో సంబంధం ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు.

గౌరవ వేతనం కోసం..

రేషన్ డీలర్ల సమ్మె బాట


(ఫైల్)

జూన్ 5 నుంచి సరుకుల పంపిణీకి బ్రేక్

- ఇప్పటికే పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు నోటీసు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సమస్యల పరిష్కారం కోసం రేషన్ డీలర్లు సమ్మె బాట పట్టనున్నారు. జూన్ 5వ తేదీ నుంచి రేషన్ దుకాణాలు బంద్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డీలర్ల సంఘం ప్రతినిధులు గత నెల 20వ తేదీన పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ను కలిసి డిమాండ్ల నోటీస్ అందజేశారు. డీలర్ల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపకపోతే వచ్చే నెల నుంచి సరుకుల పంపిణీని నిలిపి వేసి సమ్మె చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లు సమ్మెకు వెళ్తే పేదలకు బియ్యం పంపిణీ ప్రక్రియ ఆగిపోనుంది.

రాష్ట్రంలో 17,250 రేషన్ దుకాణాలున్నాయి. వీటి పరిధిలో జాతీయ ఆహార భద్రతా చట్టం(ఎన్ఎఫ్ఎస్ఎ) కింద 35 లక్షల రేషన్ కార్డులతో పాటు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 53 లక్షల రేషన్ కార్డులు కలిపితే మొత్తం 88 లక్షల రేషన్‌కార్డులకు ప్రతి నెలా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో నమోదైన ప్రతి ఒక్కరికి 6 కిలోల బియ్యం చొప్పున రూ.1 అందజేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున రూ.3లకు ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 2023-24లో పౌరసరఫరాల శాఖకు రూ.3117 కోట్లు ప్రకటించింది. రేషన్‌కార్డుల అంత్యోదయ, ఫుడ్ సెక్యూరిటీ కార్డుల ద్వారా రాష్ట్రంలో 1.9 కోట్ల మందికి రేషన్ బియ్యం అందుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 3,81,375 రేషన్‌కార్డులకు ప్రతి నెలా 6783 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుంది. మెదక్ జిల్లాలో 2,15,165 రేషన్‌కార్డులున్నాయి. సిద్ధిపేట జిల్లాలో 3.50 లక్షల కార్డులున్నాయి. పేదలకు రేషన్ సరుకులు పంపిణీ చేయడంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

వలస పేదలపై సమ్మె ప్రభావం తీవ్రం

రేషన్ డీలర్లు సమ్మె చేస్తే వలస పేదలకు తీవ్రమైన అన్యాయం జరిగే ప్రమాదముంది. తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, వరంగల్ ఇతర పెద్ద పట్టణాలకు చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాలకు చెందిన పేదలు హమాలీ, కంపెనీ, నిర్మాణ రంగంలో ఉపాధి కోసం వలసొచ్చారు. తెలంగాణకు చెందిన రేషన్‌దారులతో పాటు వలస పేదలకు కూడా రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేయబడుతుంది. తెలంగాణలో రేషన్ డీలర్లు సమ్మెకు పోవడం వల్ల బియ్యం సరఫరా నిలిచిపోతుంది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, సిద్దిపేట, మెదక్, తూప్రాన్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో రైస్‌మిల్లులు, కంపెనీలు, ఇటుకబట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసేందుకు 30 వేల వరకు వలస కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికీ ఆయా రాష్ట్రాల్లో రేషన్‌కార్డులున్నందున తెలంగాణలో వన్ నేషన్ వన్ రేషన్ కింద నివాస ప్రాంతాల్లోనే సరుకులు పొందుతున్నారు.

ప్రధాన డిమాండ్లు

పౌర సరఫరాల శాఖ పరిధిలో రేషన్ దుకాణాల నిర్వాహణ కొనసాగుతుంది. ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న రేషన్ డీలర్ల తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు నోటీస్ ఇచ్చారు. అందులో ప్రధానంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. దాంతో పాటు ప్రతి రేషన్ డీలర్‌కు హెల్త్‌కార్డు ఇవ్వాలని, కరోనా సమయంలో మృతి చెందిన 99 మంది రేషన్ డీలర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత ఆథరైజేషన్ ఇవ్వాలని, గన్నీ సంచుల ధర రూ.30 పెంచాలని, కారుణ్య నియామకాలను 62 సంవత్సరాల వరకు పెంచాలని, 1 శాతం తరుగు ఇవ్వాలని కోరారు. తరుగు ప్రతి నెలా క్లోసింగ్ బ్యాలెన్స్ నుంచి ఈ-పాస్ మిషన్ నుంచి తీసివేయాలి. కార్పొరేషన్ వద్ద వివిధ రూపాల్లో జమ అయి ఉన్న వందల కోట్ల రూపాయలతో సివిల్ సప్లై కమిషనర్, డీలర్ల అసోషియేషన్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఫండ్ ఏర్పాటు చేసి డీలర్లకు అవసరాన్ని బట్టి రుణాలివ్వాలి. ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి.

దీర్ఘకాలంగా సమస్యలు పెండింగ్



తెలంగాణ రేషన్ డీలర్ల సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 11 రకాల డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చాం. పౌరసరఫరాల కమిషనర్‌కు డిమాండ్ల నోటీస్ ఇచ్చి 45 రోజులు గడిచాకనే సమ్మెకు పోతున్నాం. జూన్ 5 వరకు ప్రభుత్వం స్పందించాలి. చర్చలు జరిపి మా డిమాండ్లను పరిష్కరించాలి. ప్రజలకు సరుకుల పంపిణీ ఆగిపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతాయని తెలుసు. కానీ.. మా సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు పోకతప్పట్లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి డీలర్ల సమస్యలు పరిష్కరించాలి.

నాయకోటి రాజు, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు

సమ్మె ఆలోచన విరమించండి...

- రేషన్ డీలర్లకు మంత్రి గంగుల విజ్ఞప్తి
- 22న సంఘాలతో సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్లు సమ్మె ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22న వారితో సమావేశం కానున్నట్టు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని తన అధికారిక నివాసంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే సంకల్పంతో రేషన్ బియ్యం పంపిణీకి వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో రేషన్ డీలర్లకు ఇబ్బందులు రానివ్వొద్దని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 2.82 కోట్ల మందికి రేషన్ అందించేందుకు ప్రతి ఏడాది రూ.3,580 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 17,220 రేషన్ షాపులకుగాను డీలర్లకు రూ.12 కోట్ల మేర కమిషన్ రూపంలో ఇస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే రేషన్ డీలర్లతో పలు దఫాలుగా చర్చించామని వివరించారు. వారి ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు ఉషారాణి, లక్ష్మీభవాని తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా నేటి నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు
- బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా శుక్రవారం నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలు తెలపాలని రాష్ట్ర సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. లైంగిక వేధింపులకు కారకులైన బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఎస్‌కేఎం కేంద్రకమిటీ పిలుపులో భాగంగా జిల్లా, మండల కేంద్రాల్లో దిష్టిబొమ్మలు దహనం చేయాలని కోరింది. గురువారం ఈమేరకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, పి.ప్రభాకర్, పెద్దారపు రమేష్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, మామిడాల భిక్షపతి ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు నిరసన తెలుపుతున్నారని గుర్తు చేశారు. ఆయనపై కేంద్రం చర్యలు తీసుకోకపోవడంతో మూడు మాసాల తర్వాత రెజ్లర్లు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఎన్నో పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చి పెడుతున్న ఒలింపిక్ పతక విజేతలతోసహా మన అగ్రశ్రేణి క్రీడాకారులు న్యాయం కోసం ఆందోళన చేస్తున్నా...కేంద్ర సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పర్యవేక్షక కమిటీ ఫలితాలను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బీజేపీ ఎంపీని రక్షించేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. నిందితులపై ఫోక్సో చట్టంతోపాటు కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

మహిళా రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి :సీపీఐ(ఎం.ఎల్) ఆర్.ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం.ఎల్) ఆర్.ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గడ్డం సదానందం ఒక ప్రకటన విడుదల చేశారు. రెజ్లర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. దేశ ప్రతిష్టను ఇనుమడింప జేసిన వారు వారాల తరబడి ధర్నాలు చేసినా కేంద్రం స్పందించక పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. బాధితులకు భరోసా కల్పించక పోగా మహిళా మల్ల యోధులను బెదిరించారనీ, వేధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్పటిక లింగ ప్రతిష్టాపన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి స్పటికలింగం, నవగ్రహ ప్రతిష్టాపనా కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు శ్రీ మహాగణపతి, శ్రీపోచమ్మ దేవాలయాల ట్రస్ట్ సభ్యులు తెలిపారు. హైదరాబాద్ ఎల్బీనగర్, కాకతీయ కాలనీ, రోడ్ నెంబర్-4లోని ట్రస్ట్ దేవాలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం గం. 6-57 నిముషాలకు శ్రీ మహాగణపతి పున్ణ ప్రతిష్ట, శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, నవగ్రహ దేవతామూర్తుల ప్రతిష్టను నిర్వహిస్తున్నారు. 2009లో నిర్మించిన ఈ ఆలయానికి విశేష పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఆధ్యాత్మికంగా ఇక్కడి మహా గణపతి పది భుజాలు, తలపై చంద్రవంక, త్రినేత్రంతో మాతా శక్తిని తొడపై కూర్చోబెట్టుకొని ఉండటం ఈ దేవాలయ విశేషం. ఇలాంటి ఆలయాలు చాలా అరుదుగా ఉంటాయని ట్రస్టు సభ్యులు గురువారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఆలయంలో శ్రీ మహాగణపతి పున్ణప్రతిష్ఠ, నూతనంగా శ్రీకాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం, నందీశ్వర, కుమారస్వామి, వీరభద్రస్వామి, అభయాంజనేయ స్వామి, కాల భైరవ స్వామి, నవగ్రహాలతో పాటు శ్రీ పోచమ్మ వారి ఆలయ శిఖరముల త్రయాహ్నికా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ట్రస్టు చైర్మెన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు.

రైతుల బాధలు పట్టని కేసీఆర్ ప్రభుత్వం

- వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతుల బాధలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వైఎస్ ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వడ్లు మొలకెత్తి..గుండె భారమై ఓ కౌలు రైతు ప్రాణం పోయిందని గుర్తు చేశారు. చనిపోతానని చెప్పినా..ఆదుకోని అసమర్థ ప్రభుత్వమిదని ఆవేదన వ్యక్తం చేశారు. కండ్లున్నా చూడలేని సర్కారంటూ విమర్శించారు.రైతుల ఓట్లు కావాలి కానీ..వారి బాధలు పట్టవా? అని ఆమె ప్రశ్నించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ అరెస్ట్

నవతెలంగాణ - అడిక్‌మెట్

హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్‌ను విక్రయిస్తున్న నైజీరియన్ దేశానికి చెందిన వ్యక్తిని గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మోహన్ రావు తెలిపిన వివరాల ప్రకారం..నైజీరియన్ దేశానికి చెందిన అగోడికే న్నామెకా అలియాస్ మైఖేల్ ఎబెరే బెంగళూరులో ఉంటూ చదువుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, అతను హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గురువారం మధ్యాహ్నం నార్కోటిక్ ఎండీఎంఏ డ్రగ్ విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని నుంచి 11 గ్రాముల డ్రగ్స్‌ను, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నిమ్స్‌లో వైద్యునిపై రోగి కుటుంబ సభ్యుల దాడి

నవతెలంగాణ-బంజారాహిల్స్

వైద్యుని నిర్లక్ష్యం వల్లే రోగి మృతిచెందిందంటూ బాధిత కుటుంబీకులు హైదరాబాద్ నిమ్స్‌లో వైద్యునిపై దాడికి దిగారు. వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్‌కు చెందిన వెంకటలక్ష్మి(62) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడింది. ఆమెను పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి తీసుకురాగా సీరియస్‌గా ఉందని ఆర్ఐసీయూకు తరలించారు. గురువారం ఉదయం ఆమె పరిస్థితి విషమించి మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని ఆరోపిస్తూ బంధువులు నెఫ్రాలజీ విభాగానికి చెందిన రెసిడెంట్ వైద్యుడు రాహుల్‌పై దాడి చేశారు. అనంతరం ఇరువర్గాల వారు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

ర్యాగింగ్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

1,069 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 22న నియామక ఉత్తర్వుల అందజేత : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ర్యాగింగ్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. 1,069 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఈ నెల 22న నియామక పత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. బోధనాస్పత్రుల పనితీరుపై గురువారం ఆయన నెలవారీ సమీక్షా సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఒకేసారి తొమ్మిది మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 65 మందికి ప్రొఫెసర్లు, 210 అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. 800 మంది పీజీ సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను జిల్లాల్లోని మెడికల్ కాలేజీలు, వైద్య విధాన పరిషత్ ప్రధాన ఆస్పత్రులకు కేటాయించామని వివరించారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీలు నడిచేలా చూడాలని సూపరింటెండెంట్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కూతురిని నరికి చంపిన తండ్రి

- నిందితున్ని అప్పగించాలని గ్రామస్తుల ఆందోళన
- పోలీస్ వాహనాలు ధ్వంసం
- పెద్దపల్లి జిల్లా బట్టుపల్లిలో కలకలం

నవతెలంగాణ - మంథని

గతంలోనే భార్యను చంపేసిన దుండగుడు గురువారం పదేండ్ల కూతురినీ నరికి హత్య చేశాడు. అనంతరం గ్రామంలో మరొకరిపై దాడి చేశాడు. ఈ దారుణ సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం బట్టుపల్లిలో జరిగింది. కాగా, నిందితుడిని తమకు అప్పగించాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదానందం తన కూతురు రజితను(10) గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం గ్రామంలో మరో వ్యక్తి ధూపం శ్రీనివాస్‌పైనా దాడి చేశాడు. శ్రీనివాస్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలించారు. నిందితుడు సదానందం గతంలో భార్యను ఉరేసి హత్య చేశాడు. ఆ కేసులో జైలు జీవితం గడిపి వచ్చాడు. ఇప్పుడు కూతురినీ చంపేశాడు.

సమాచారం అందుకున్న మంథని సీఐ సతీష్, ఎస్ఐ వెంకటేశ్వర్ తమ సిబ్బందితో బట్టుపల్లికి చేరుకొని నిందితుడు సదానందంను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తమకు అప్పగిస్తే.. తామే శిక్షిస్తామంటూ గ్రామస్తులంతా పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. అడ్డంగా కట్టెలు, బండ రాళ్లు వేసి నిందితున్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని నిలువరించలేక కొంతసేపు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో నిందితునిపై దాడి చేసేందుకు యత్నించారు. పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. సైకో సదానందం వల్ల తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితున్ని మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిసాన్ సర్కార్ నినాదం మోసపూరితం

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ చెబుతున్న కిసాన్ సర్కార్ నినాదం పచ్చి మోసపూరితమని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కిసాన్ సర్కార్ అంటే పాడి రైతుల పొట్టకొట్టడమేనా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య విడదీయలేని బంధం ఉందని తెలిపారు. అమిత్ షా ఆదేశాలతో గుజరాత్‌కి చెందిన అమూల్ పాల కంపెనీని తెలంగాణలో ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఇదే కంపెనీని కర్ణాటకలో ఏర్పాటు చేసి ఆ రాష్ట్రంలో ఉన్న నందిని పాల కంపెనీని మూసియాలని చూస్తే అక్కడి ప్రజలు తిరగ బడ్డారని గుర్తుచేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం గజ్వేల్‌లోని వర్గల్‌లో అమూల్ కంపెనీ ఏర్పాటు చేయటానికి ఎర్రతివాచీ పరిచి ఆహ్వా నించిందని పేర్కొన్నారు. విజయ పాల కంపెనీకి ప్రభుత్వం రెండేండ్లుగా ఎమ్‌డీని కూడా ఎందుకు నియమించలేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిలయన్స్ కంపెనీ లాభాల కోసం బీఎస్ఎన్ఎల్ కంపె నీని చంపినట్టే, రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీ వంటి స్థానిక కంపెనీ లను చంపి,అమూల్ కంపెనీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. కవిత ను ఈడీ విచారణ నుంచి కాపాడటానికే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు ప్రజలముందు డ్రామాలు చేస్తూ.. తెరవెనక బీజేపీతో దోస్తీ చేస్తున్నారన్నారని తెలిపారు.

పుస్తకాల రూపంలో చరిత్ర...

భావి తరాలకు అందించాలి

- పరిశోధన పుస్తకాల ఆవిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ ప్రాంతంలో ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. పరిశోధకుల బృందం ఈ ప్రాంతంలోని చరిత్రపై లోతైన అధ్యాయనం చేయాలి. చరిత్రను భవిష్యత్ తరాలకు పుస్తకాల రూపంలో అందించాలి. వాటిని భద్రపరచాలి. పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని చరిత్ర పరిశోధకుల కృషి అభినందనీయం' అని పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో చరిత్ర పరిశోధకులు రామోజు హరగోపాల్ రచించిన తొలత తెలుగు రాతిరాత 'తొలుచు వ్రాన్లు', 'తెలంగాణ చరిత్ర తొవ్వలో' అను రెండు చరిత్ర పరిశోధనా పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సూచనల మేరకు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో ఉన్న వారసత్వ, చారిత్రాత్మక, సమగ్ర చరిత్రను పరిశోధకులు భవిష్యత్తు తరాలకు అందించేందుకు పుస్తకాల రూపంలో వెలుగులోకి తీసుకొస్తున్నామని అన్నారు. పరిశోధకుల బృందం తెలంగాణ ప్రాంతంలోని చరిత్రపై లోతైన అధ్యాయనం చేయాలని కోరారు. మరుగున పడిన అసలైన చరిత్రను బయటకు తీసేందుకు సమగ్ర చరిత్రపై మరిన్ని పరిశోధాత్మక పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చరిత్ర పరిశోధకుల బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ రంగారెడ్డి జిల్లాలోని కీసరగుట్టలో జరిపిన పరిశోధనలో వెలుగు చూసిన తొలుచు వ్రాన్లు శాసనాన్నే తొలి తెలుగు రాతిరాత శాసనంగా గుర్తించడం సంతోషంగా ఉందని తెలిపారు. చరిత్ర పరిశోధకులు తెలంగాణ ప్రాంతంలో ఉన్న సమగ్ర చరిత్రను వెలికి తీయడానికి వీలుగా ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. చారిత్రక పరిశోధక పుస్తకాలను రచించిన రామోజు హరగోపాల్, ప్రముఖ చరిత్ర పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిలను మంత్రి ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివద్ధి సంస్థ ఓఎస్‌డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాధారణ పనితీరు అభినందనీయం

వాణిజ్యపన్నుల శాఖ సమీక్షాసమావేశంలో సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పన్ను వసూళ్లలో అసాధారణ పనితీరు కనబర్చినందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అభినందించారు. పన్ను ఎగవేతపై దష్టి సారించడం ద్వారా ఈ ఏడాది రూ.85,000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా తమ ప్రయత్నాలను విస్తరించాలని ఆమె అధికారులను కోరారు. వాణిజ్య పన్నుల శాఖలోని సీనియర్ అధికారులతో గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించి, అదనపు వనరులను పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆదాయాన్ని పెంచేందుకు వినూత్న సూచనలతో ముందుకొచ్చిన శాఖ ఉన్నతాధికారులను ఆమె ఈ సందర్భంగా అభినందించారు. పన్ను ఆదాయాన్ని పెంచడం కోసం సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అధికారులను కోరారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్యను పెంచడంతోపాటు ఎగవేతలను తగ్గించేందుకు కృషి చేయాలని అన్నారు. అపిలేట్ జాయింట్ కమిషనర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించాలని ఆమె కమిషనర్‌ను ఆదేశించారు. ఆదాయం ఎక్కువగా సమకూరే ప్రాంతాలను మ్యాప్ చేసి, క్రమపద్ధతిలో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఆదాయాన్ని పెంచేందు కోసం కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను బలోపేతం చేయడం, స్వచ్ఛంద సమ్మతిని ప్రోత్సహించడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, అదనపు కమిషనర్లు సాయికిషోర్, హరిత, జాయింట్ కమిషనర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను చర్చలకు పిలవలేదు

- సమ్మె విరమించండి : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. నిబంధనలు, ఒప్పందాలకు విరుద్ధంగా చేస్తున్న సమ్మెను వారు వెంటనే విరమించాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తరపున తానుగానీ, మరెవ్వరు గానీ వారిని చర్చలకు పిలవలేదని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు పంచాయతీ కార్యదర్శుల పట్ల మంచి అభిప్రాయం ఉందనీ, దాన్ని చెడగొట్టుకోవద్దని సూచించారు. ప్రభుత్వాన్ని శాసించాలని సాహసించడం, నియంత్రించాలని అనుకోవడం పెద్ద తప్పు అని తెలిపారు. సమ్మె విరమిస్తే వారికి సీఎం కేసీఆర్ తప్పకుండా న్యాయం చేస్తారనే నమ్మకం తనకుందని పేర్కొన్నారు. సంఘాలు పెట్టుకోబోమనీ, యూనియన్లలో చేరబోమనీ, సమ్మెలు చేయబోమని బాండ్ రాసిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. జేపీఎస్‌లు సమ్మె చేయడం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధమని తెలిపారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఆపాలని హెచ్చరించారు. ఇప్పటికైనా మించిపోలేదనీ, వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలి

- టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వారి రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. గురువారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వారిని చర్చలకు ఆహ్వానించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిమ్స్ డాక్టర్‌పై దాడికి ఖండన

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- అవసరమైన భద్రత కల్పించాలి : ఐఎంఏ, టీజూడా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్‌లో నెఫ్రాలజీ సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌పై రోగి బంధువులు చేసిన దాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) తదితర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు గురువారం ఆయా సంఘాలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. రోగి పరిస్థితిని వివరించేందుకు ప్రయత్నిస్తున్న సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌పై 10 నుంచి 12 మంది అసాంఘిక శక్తుల తీరులో దాడి చేయడమే కాకుండా వేరే రోగికి సీపీఆర్ చేయడాన్ని అడ్డుకున్నారని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బీ.ఎస్.రావు, గౌరవ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె.విజయ్ రావు తెలిపారు. వారిపై చర్యలు తీసు కోవాలనీ, ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రత్యేక భద్రతను కల్పించాలనీ, ప్రోటోకాల్స్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి వెంటనే భద్రత కల్పించే అవసరమైన చర్యలు తీసుకోవాలని టీజూడా అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ కుమార్ పింజరాల డిమాండ్ చేశారు.

వీసీ తీరుపై డాక్టర్ల సంఘాల ఆగ్రహం

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి తీరుపై డాక్టర్ల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. 2020 బ్యాచ్ పీజీ మెడికల్ విద్యార్థుల పరీక్షలను వాయిదా వేయాలని ఈ సందర్భంగా టీజూడా డిమాండ్ చేసింది.ఈ మేరకు టీజూడా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుకు లేఖ రాశారు. పరీక్షలకు గడువు ఉన్నప్పటికీ చదువుకునేందుకు వెసులుబాటు కల్పించకుండా వీసీ హడావుడి చేస్తు న్నారని తెలిపారు. సమస్యలపై కలిసి చర్చించేందుకు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెబుతున్న వీసీ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లను ఏర్పాటు చేసుకోవాలని హెచ్‌ఓడీలను కోరినట్టు రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.రాజీవ్ తెలి పారు. వీసీ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరి స్తున్నారనీ, అవినీతిపరుడంటూ హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు మెడి కల్ కాలేజీల ప్రయోజనాల కోసం మాత్రమే డాక్టర్ కరుణాకర్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు.

లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ కొప్పుల



నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ లోతట్టు ప్రాంతమైన శ్రీ సరస్వతీ నగర్ కాలనీని గురువారం స్థానికులతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయని, దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే వాటిని తొలగించి, బ్లీచింగ్ పౌడర్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాండు గౌడ్, రావుల రమేష్, వేమన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం, నర్సింహా రెడ్డి, నర్రి వెంకన్న శేఖర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మధుసూదన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని చైతన్య నగర్‌లో ఫిట్‌నెస్ జిమ్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు శరీర దృఢత్వం కోసం ఫిట్‌నెస్ జిమ్‌లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, నిర్వాహకులు మొకిలా శ్రీనివాస్ రెడ్డి, కాజా శ్రీనివాస్, యజమాని శ్రావణ్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, పెరుమాళ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం చెల్లించాలి

- సీపీఐ (ఎం) నాయకుల డిమాండ్



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.యాదయ్యలు డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండ రావిరాల గ్రామానికి చెందిన రైతులు 269 రోజులుగా న్యాయం కోసం దీక్షలు చేపడుతున్న విషయం విధితమే. ఈ మేరకు గురువారం దీక్ష శిబిరాన్ని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు జాన్ వెస్లీ, యాదయ్య మాట్లాడుతూ సుమారు 9 నెలలుగా భూములు కోల్పోయిన రైతులు న్యాయం కోసం పోరాతుంటే కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూమికి భూమి లేదా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంత సుదీర్ఘ కాలంగా నష్టపరిహారం కోసం రైతులు పోరాటం చేయడం బాధాకరమన్నారు. నష్టపరిహారం ఇస్తున్నట్లు అనేక మాయమాటలతో అదిగో, ఇదిగో అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను మభ్యపెడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మిలిటెన్సీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరసింహ, జిల్లా నాయకులు గోరింకల నరసింహ, రైతులు నేతి కష్ణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను సద్వినియోగించుకోవాలి

- హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీ
- నూతన పోలీస్ స్టేషన్‌లు ప్రారంభం

నవతెలంగాణ- సంతోష్ నగర్

ప్రజలు పోలీస్ స్టేషన్ల సేవలను సద్వినియోగించుకోవాలని హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీ అన్నారు. సంతోష్ నగర్ లో నూతనంగా నిర్మించిన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్, సైదాబాద్ డివిజన్లలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అలీ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలీసులు ప్రజల పట్ల స్నేహభావంతో మెలగాలని, అందుకే ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. పోలీస్ అధికారులు నేరనియంత్రణ చేయడంలో ముందుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే అహమ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, టీఎస్ పీహెచ్ సి ఎల్ చైర్మన్ కె దామోదర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మిర్జా రహమత్ బైగ్, ఎంఎస్ ప్రభాకర్ రావు, కార్పొరేటర్లు అరుణ రవీందర్ రెడ్డి, జంగం శ్వేత



మధుకర్ రెడ్డి, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, ఎండి సైఫుద్దీన్ షఫీ, టీఎస్ పిహెచ్సిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ రత్న, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజని కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్, కమిషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ సిటీ సివి ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ హైదరాబాద్ సిటీ డీసీపీ సి హెచ్ రూపేష్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవ తెలంగాణ - ఘట్కేసర్

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీలు అభివద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని కొనియాడారు. బస్తీ దవాఖాన సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. 200 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 145 రకాల మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ పలువుల మాధవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, రైతు సహకార సంఘం అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పదిలో శ్రీ విద్యా భారతి హై స్కూల్ ప్రభంజనం



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధి శ్రీరాం కాలనీలోని శ్రీ విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రిన్సిపాల్ భీమయ్య, కరస్పాండెంట్ వి.రాజులు తెలిపారు. ఆర్. స్రవంతికి 10/10, జి.మాధురి 9.5, ఎం.ప్రీతి 9.5, కే.నాగశ్రుతి 9.2, ఎస్.ఆదిత్య 9.2, సోన్ స్వామి 9.2, వి.వర్షిత 9.2, కే.అరుణ 9.0, వైభవ్ 9.0 సాధించినట్లు చెప్పారు. అనంతరం 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కషి చేస్తున్నామని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 9వ డివిజన్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీకి ఎదురుగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని డివిజన్ల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.కోట్ల నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించినట్లు తెలిపారు. అధికారులు అప్రమత్తతతో పనులను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని కుంటుపరుస్తున్న అధికారులు'

నవతెలంగాణ-వనస్థలిపురం

కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై అభివృద్ధిని కుంటుపరుస్తున్నారని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆరోపించారు. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోఎస్ కాలనీ ఛత్రపతి శివాజీ గ్రౌండ్ లో వేస్తున్న నూతన వాటర్ బోర్ పనులను గురువారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లో డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై అభివద్ధిని కుంటుపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కనువిప్పు తెచ్చుకొని అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కషి చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ శర్మ, డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, నాయకులు సుధీర్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

హుడా కాలనీలో అధికారుల పర్యటన



నవతెలంగాణ - ఎల్బీనగర్

సరూర్ నగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) కార్యక్రమంలో భాగంగా గురువారం హుడా కాలనీలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా హుడా కాలనీలోని రోడ్ నెంబర్10లో వర్షం నీరు నిలుస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు కోరారు. కాలనీలో శానిటేషన్ పనులు రెగ్యులర్‌గా జరగాలన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఈ సమస్యలన్నింటినీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి దష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌని శ్రీనివాస్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ ప్రశాంతి, సతీష్, వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ శంకర్, కాలనీ వాసులు అరవింద్ కుమార్, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆదిత్య , చైతన్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో త్వరలో నూతన పోలీస్ స్టేషన్

- డీసీపీ సాయి శ్రీ



నవతెలంగాణ-హయత్ నగర్

నాగోల్ డివిజన్‌లో త్వరలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుందని ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో నూతన పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందికి పని భారం కాకుండా ఉండేందుకు గాను మొత్తం 55మందిని నూతన స్టేషన్ కు నియమిస్తున్నట్లు తెలిపారు. అందులో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలు, 52మంది సిబ్బంది ఉంటారన్నారు.

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే కాలనీలు ఇవే..


తట్టి అన్నారం, హిందు అరణ్య, వనస్థలి హిల్స్, మన్రిపల్లి, ఆర్ కే నగర్, మత్తు గూడ, లక్ష్మీ గణపతి నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, హనుమాన్ నగర్ కాలనీ, తిమ్మాయి గూడ, గౌరెల్లి లీడింగ్ టూ ఓఆర్ ఆర్, మమతా నగర్, న్యూ మమతా నగర్, నాగోల్ ఓల్డ్ విలేజ్, ఎన్ వీరాన్ టవర్స్, వెంకటరమణ కాలనీ, వెంకట్ రెడ్డి కాలనీ, సువ్వుల బండ, అరుణోదయ కాలనీ, మల్లికార్జున హిల్స్, బ్లైండ్స్ కాలనీ, లక్ష్మి నర్సింహా కాలనీ, జైపూరి కాలనీ, ఫతుళ్ళ గూడ, శ్రీనివాస్ నగర్ కాలనీ, సర్వే నెంబర్ 58, విజయ గార్డెన్, ఆనంద్ నగర్, రాజీవ్ గహ కల్ప, జీఎస్ఐ, అజయ్ నగర్ కాలనీ, ఆప్కో కాలనీ, ఈశ్వర్ పురి కాలనీల పరిధిలో ఉంటుందని ఆమె వెల్లడించారు. రోజు రోజుకూ పెరుగుతున్న నూతన కాలనీలు, దానికి అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం కోసం నూతన పోలీస్ స్టేషన్‌ను రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు అవుతుందని పేర్కొన్నారు.

'బడంగ్‌పేట్ అభివృద్ధికి కృషి చేస్తున్నాను'

నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ ను అన్ని రంగాల్లో అభివద్ధి చేయడానికి తన వంతు కషి చేస్తున్నానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 11వ డివిజన్‌లోని మామిడిపల్లిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ చుక శివ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ డీఈఈ జ్యోతి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సన్మానించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ- బడంగ్ పేట్

ఇటీవల మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన బీఎస్పీ తెలంగాణ భరోసా సభ విజయవంతం అయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ గురువారం మహేశ్వరం నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మహరాజ్ ను పూల మాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేసున్నాయని మండి పడ్డారు. ప్రజలు అధికార మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారని, బీఎస్పీతో బహుజన రాజ్యం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదిలో నాగార్జున విద్యార్థుల విజయకేతనం



నవతెలంగాణ -వనస్థలిపురం

పదో తరగతి పరీక్షల్లో నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయ కీర్తనాన్ని ఎగరవేశారని ఆ విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విట్టల్ రెడ్డి అన్నారు. 44 మంది విద్యార్థులు 10/10, 53 మంది 9.8, 200 మంది 9.5, 398 మంది 9.0 జీపీఏ లను సాధించినట్లు తెలిపారు. అనంతరం 10/10 సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సీఈఓఏ శేషారావు, అకాడమిక్ దిన్ ఎస్ రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్, ఇంచార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన ఆల్ ఫోర్స్ జూనియర్ కాలేజీ



నవతెలంగాణ - ఘటకేసర్

విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని అవుషాపూర్ ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల చైర్మన్ నరేందర్రెడ్డి అన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండల పరిధి అవుషాపూర్ ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులను గురువారం శాలువాలతో సత్కరించి అభినందిచారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ మాట్లాడుతూ ఎంపీసీలో రాకేష్ కష్ణచైతన్య, సుహాసరెడ్డి, జోగేశ్వర్, శశీప్రీతంరెడ్డి, వెంకటేష్..బైపీసీలో నిఖిల్, పూజిత, హేమనాగసింధు, అనీనా, నిహారికలు అధిక మార్కులు సాధించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ- సంతోష్ నగర్

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు గుంజి. సంతోష్ కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ తమ్మిశెట్టి శివకష్ణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ మైనింగ్ కార్పోరేషన్ చైర్మన్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వడ్డెరులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను చైర్మన్ కు వివరించారు. స్పందించిన చైర్మన్ వడ్డెరుల సమస్యలను మంత్రి కేటీఆర్ దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్ ను శాలువాతో సన్మానించారు.

టెన్త్ ఫలితాల్లో 'లార్డ్స్' ప్రభంజనం

నవతెలంగాణ - మీర్ పేట్

బాలాపూర్ మండలంలోని లార్డ్స్ విద్యాసంస్థల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశాయని ఆ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప తెలిపారు. 6 మంది 10/10, 9 మంది 9.8, 10 మంది 9.7, 20 మంది 9.5, 23 మంది 9.3, 20 మంది 9.2, 18 మంది 9.0, మొత్తం 106 మంది విద్యార్థులు ఎ1 గ్రేడ్ తో ఉత్తీర్ణత సాధించారని చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అత్యుత్తమ



ప్రతభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, లార్డ్స్ డైరెక్టర్లు సిద్ధాల శ్రీలత, బెర్లు అనూరాధ, వివిధ బ్రాంచ్‌ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య 'భాష్యం' సొంతం



నవ తెలంగాణ - చైతన్యపురి

విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ, సమయపాలన, భాష్యం పాఠశాల సొంతమని ఆ విద్యాసంస్థల సీఈవో చైతన్య, జేడీవో అంకమ్మరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 మంది విద్యార్థులు 10/10, 15 మంది 9.8, 7 గురు 9.7, 8 మంది 9.5, 12 మంది 9.3, 17 మంది 9.2, 9 మంది విద్యార్థులు 9.0 సాధించినట్లు తెలిపారు. 9.0 సాధించిన విద్యార్థులు 62, 9.0 కన్న తక్కువ సాధించిన వారు 73 మంది విద్యార్థులు అని చెప్పారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మీర్‌పేట్ శ్రీ చైతన్య హవా



నవతెలంగాణ - మీర్ పేట్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మీర్‌పేట్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ అన్నారు. 6 గురు విద్యార్థులు 10/10, ముగ్గురు 9.8, నలుగురు 9.7, ఐదుగురు 9.5, 8 మంది 9.3, 8 మంది 9.2, 6 గురు విద్యార్థులు 9.0 సాధించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రవీణ్, ఆర్ఐలు వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి విద్యార్థులు, తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల ప్రతిభ





నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యులు అర్జున్ తెలిపారు. శ్రావణి 9.2, జ్యోష్న 9.0, కే.శజన 8.3 సాధించినట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

టెన్త్‌లో నారాయణ విజయకేతనం



నవ తెలంగాణ - చైతన్యపురి

నారాయణ పాఠశాల ఎల్బీనగర్ జీహెచ్‌సీ బ్రాంచ్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని బ్రాంచ్ ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఏవో రాధా తెలిపారు. ఈ సందర్భంగా వారు బ్రాంచ్ నుండి 65 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఆరుగురికి 10/10, ఆరుగురు విద్యార్థులు 9.8 సాధించారని చెప్పారు. మొత్తం 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుంటే జైలుకే


- జాయింట్ కమిషనర్ సత్యనారాయణ

నవతెలంగాణ-హయత్‌నగర్

నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్ పైకి వస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ వాహన దారులను హెచ్చరించారు. ఎల్బీనగర్ లో ఉన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రాచకొండలో ఏ ఒక్క వాహన దారుడు కూడా మోటార్ చట్టానికి విరుద్ధంగా నెంబర్ ప్లేట్ టాంపరింగ్, నెంబర్ ప్లేట్‌కు మాస్క్ ధరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరైన వాహన రిజిస్ట్రేషన్ వాహనాల వలన చైన్ స్నాచింగ్, దొంగతనాలు, హత్యలు, దోపిడీ లాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు రాచకొండ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు 15 స్పెషల్ టీంలు, ఎన్ఫోర్స్మెంట్‌తో కలిసి డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. రోజు రోజుకూ నేరస్తులు కొత్త రకం పంథా ఎంచుకుంటున్నారని చెప్పఆరు. నేరం చేసిన వాడు ఏదో రకంగా పోలీస్‌లకు తప్పకుండా పట్టుబడతారని గుర్తు చేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూసేందుకు కూడా వాహన దారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి నుండి మే 10 నాటికి మొత్తం నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా, 48,998 మందికి చలాన్లు విధించినట్లు తెలిపారు. కొందరికి ఒక రోజు నుండి మూడు రోజుల జైల్ శిక్ష తో పాటు రూ.3 వేల రూ.5వేల వరకు జరిమానాను కోర్టు విధించినట్లు వెల్లడించారు.

జైలు శిక్షలు.. జరిమానాలు..

రాచకొండ పరిధి కందుకూరుకు చెందిన మస్కు సాయి కుమార్‌కు ఒక రోజు జైలు, రూ. 3000 జరిమానా, నల్గొండకు చెందిన వంగాల వెంకటేష్‌కు ఒక రోజు జైలు, రూ. 3000 జరిమానా,.యాదాద్రి భువనగిరికి చెందిన గుణగంటి శ్రీనివాస్‌కు రెండు రోజులు కమ్యూనిటీ సర్వీస్, రూ. 3 వేలు, కుషాయిగూడకు చెందిన పఠాన్ దర్వేశ్ ఖాన్ కు 3 రోజుల జైలు, రూ. 5వేల జరిమానా, మంజుల



అనే మహిళకు రూ. 5 వేలు, రసమల్ల శివకు రూ. 3 వేల జరిమానాలు విధించినట్లు వివరించారు. మొదటి చలాన్ వచ్చినా మళ్లీ రిజిస్ట్రేషన్ లేకుండానే కొందరు వాహనదారులు ఉపయోగిస్తున్నారు. వారిని ట్రాఫిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బందాలు పట్టుకుని మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 192 కింద కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. వారిని ప్రత్యేక కోర్టుల ముందు హాజరుపరిచినట్లు చెప్పారు. వారికి ఒక రోజు నుండి 3 రోజుల సాధారణ జైలు, ఒక్కొక్కరికి రూ. 3 వేల నుండి రూ. 5 వేల జరిమానాలు, రెండు రోజుల ట్రాఫిక్ కమ్యూనిటీ సేవ వంటి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ లేకుండా, మద్యం సేవించి డ్రైవ్ చేయవద్దు అనే ప్లకార్డులతో వారు ప్రధాన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద నిలబడాలని చెప్పారు. వాహనాలను కొనుగోలు చేసిన 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మోటారు వాహన చట్టం నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు, వాటిపై చిహ్నాలు, ఎటువంటి రాతలు ఉండకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్, డీసీపీ ట్రాఫిక్, జి.శ్రీనివాస్ కుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్, ఎల్బీనగర్-మహేశ్వరం. ఎస్వీ. హరికష్ణ, ఏసీపీ ట్రాఫిక్, ఎల్బీనగర్ ట్రాఫిక్ డివిజన్, శ్రీనివాసరావు, ఏసీపీ ట్రాఫిక్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, వనస్థలిపురం, కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, బాలు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఈ చలాన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ బాబు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్తీ దవాఖానాను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీ దవాఖానలో 57రకాల టెస్టులు,100 రకాల మందులు ఇస్తారు కాబట్టి డివిజన్ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా అక్కడికి వచ్చిన ప్రజలను కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్ శైలజ, సిబ్బంది, నాయకులు బాల్ రెడ్డి,శ్రీకాంత్ యాదవ్, నర్సింహ, వెంకట్ రెడ్డి, రవి, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే నా బలం.. బలగం : సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నాచారం



కార్యకర్తలే నా బలం, బలగం అని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కాప్రా సర్కిల్ బీ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పొన్నాల రాజు ఆధ్వర్యంలో జరిగిన చాయ్ పై చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాయకుడిపై ఉంటుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్నా అని పిలిస్తే నేనున్నానంటూ భరోసా ఇచ్చి అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి బలం బలగం అని.. నాయకత్వం వహించే నాయకుడు పెద్దన్న పాత్ర పోషించినప్పుడే కార్యకర్తలు సైనికుడిలా పని చేస్తారని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుడు లా పనిచేసే అధిష్టాన నిర్ణయాన్ని శిరసా వహిస్తూ పార్టీ బలోపేతానికి అందరం కలిసి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు నెల్లుట్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు

అందరికీ వైద్యం అందించేందుకే బస్తీ దవఖానాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- నాగారం మున్సిపాల్టీలో బస్తీ దవఖానా, మహిళ భవనం, కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

పేదలందరికి మంచి వైద్యం అందించాలనేది సీఎం కేసీఆర్ సంకల్పమని అందులో భాగంగానే పేదలు నివసించే ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాల్టీలో సాధారణ నిధులు రూ. 18 లక్షలతో వార్డ్ నెం.16 రాజ్ సుఖ్ నగర్‌లో నిర్మించిన బస్తి దవఖానాను, వార్డ్ నెం 12 వేంకటేశ్వర కాలనీలో రూ ,8,50,000/- మహిళా భవనాన్ని, వార్డ్ నెం.15 ఈస్ట్ గాంధీ నగర్‌లో కంటి వెలుగు కార్యక్రమం మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో వైద్యం అందించేందుకు ప్రభుత్వం బస్తి దవాఖానా లను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, నాగారం మున్సిపల్ చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి , వైస్ చైర్మెన్ మల్లేశ్ యాదవ్ , కమిషనర్ వాణి రెడ్డి , కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితా, వివిధ వార్డ్‌ల కౌన్సిలర్‌లు, కొ ఆప్షన్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రోళ్ల సత్తిరెడ్డి సేవలు మరువలేనివి : మంత్రి మల్లారెడ్డి

పేద, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసిన గోధుమకుంట మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల సత్తిరెడ్డి సేవలు మరువలేనివని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట ఎర్రోళ్ల సత్తి రెడ్డి 11 వ వర్ధంతి సందర్భంగా వారి తనయుడు వంగేటి పర్వత్ రెడ్డి అధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గురువారం ముగింపు వేడుకల్లో మంత్రి పాల్గొని ఎర్రోళ్ల సతిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గోధుమ కుంట గ్రామ మాజీ సర్పంచ్ సత్తిరెడ్డి గ్రామ అభివద్ధి కోసం నిరంతరం కషి చేశారని కొనియాడారు. సత్తిరెడ్డి ఆశయాలను ఆయన తనయుడు పర్వత్ రెడ్డి అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. యువకులు క్రీడా పోటీల్లో రాణించి గొప్ప వ్యక్తులుగా ఎదగలన్నారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ కీసర మండల ఉపాధ్యక్షులు. వంగేటి పర్వతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. రాఘవేందర్ నగర్ కాలనీలోని రూ.51. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, సవర్కర్ నగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, సవర్కర్ నగర్ స్ట్రీట్ నెంబర్ వన్ నుంచి పోచమ్మ టెంపుల్ వరకు రూ.14.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, బాబా నగర్‌లో రూ.11.30 లక్షల వ్యయంతో 600 ఎమ్ఎమ్, ఆర్‌సీసీ పైప్ లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అభివద్ధి లక్ష్యంగా నాచారం డివిజన్‌లో సుమారు కోటి రూపాయల అభివద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం జీహెచ్ఎంసి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ అధికారులు ఈఈ హరిలాల్, డీ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, ముత్యం రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, తుంగ తిరుపతి, యాదగిరి, సత్యనారాయణ, విఠల్ యాదవ్, కట్ట బుచ్చి గౌడ్, కరుణాకర్, బాలమణి, కామేశ్వరి, సుజాతా దేవి, అశోక్, రఫిక్, మహేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

తెలంగాణలో సర్కారు బడుల్లో వెలుగులు

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్ నగర్

తెలంగాణలో సర్కారు బడులు సర్వంగ సుందరంగా మారుతున్నాయని, సీఎం కేసీఆర్ విద్యాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే టాపర్స్ నిలవడం అభినందనీయమని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. గురువారం మన ఊరు... మన బడి పథకంలో భాగంగా రూ. 40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాతోపాటు, పౌష్టికాహారం అందజేస్తున్నారని, గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా నీట్, ఎంసెట్ లాంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్నారంటే సీఎం కేసీఆర్ విజన్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల పిల్లలు దేశ, విదేశాల్లో చదువుతున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో



10వ తరగతిలో టాపర్స్ నిలిచిన ఆర్. యశ్వంత్ (9.8జీపీఏ), వి. రవిశంకర్ (9.8 జీపీఏ), ఎస్తర్ రాణి(9.7జీపీఏ)లను సన్మానించి ఒక్కొరికి రూ. 10వేల చొప్పున ముగ్గురికి అందజేశారు. జవహర్ నగర్ పాఠశాలలో 76శాతం, బాలాజీనగర్ పాఠశాలో 60శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్పొరేటర్లు గండి రాంచందర్, లావణ్యసతీష్ గౌడ్, కోఆప్షన్సభ్యురాలు శోభారెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖరయ్య, నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్

నవతెలంగాణ-కంటోన్మెంట్



సికింద్రాబాద్ జింఖానా మైదానంలో శుక్రవారం నుంచి దుబాయ్ సిటీ పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాబ్సన్ తెలిపారు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెూంమంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ నేత మర్రి రాజశేర్ రెడ్డి, బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ విచ్చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారని తెలిపారు. నేటి నుంచి 50రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. జింఖానా మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల మన్నికైన దుస్తులు, తిను బండా రాలు తక్కువ ధరలకే అందు బాటులో ఉంటాయని తెలిపారు. దుబాయ్ సిటీ ఎలా ఉంటుందో అలాంటి సెట్‌ను తెలంగాణలో మొట్టమొట్టమొదటి సారి ఏర్పా టు చేశామని నిర్వాహకులు రాబ్సన్ తెలిపారు. ఈ సదవకాశాన్ని జంట నగర వాసులు ఉయోగించుకోవలని అయన కోరారు. ఎంట్రీ రుసుము రూ 80 గా నిర్ణయించారు.

బోయిన్‌పల్లి 'సీఎంఆర్' విద్యార్థులను అభినందించిన మంత్రి

నవతెలంగాణ-కంటోన్మెంట్



పదో తరగతి ఫలితాల్లో బోయినపల్లి సి.యం.ఆర్ హైస్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. ఏడుగురు విద్యార్థులు వర్షిత, క్రితిహజారే, మనిదీప్, జయ్, చక్రవర్తి, ఆదిత్యరాజు, హరిహరన్‌లు జీపీఏ 10/10 సాధించగా, సుమారుగా నలభై శాతం విద్యార్థులు "ఏ" గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. 10/10 సాధించిన వారికి ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా



పాఠశాల కరెస్పాండెంట్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమపడి నిర్దిష్టమైన ప్రణాళికతో విద్యార్థులను అడుగడున ప్రోత్సహిస్తూ వారికి నాణ్యతతో కూడిన విద్యా ప్రమాణాలను అందించినందుకు పాఠశాల సిబ్బందిని ప్రశంసించారు. అదేవిధంగా తల్లిదండ్రులు అంతే శ్రద్ధ, పట్టుదలతో టి.వి.లకు, సెల్‌ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచి వారిలో 10/10 సాధించాలన్న లక్ష్యాన్ని కల్పించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ ఎస్.కె.రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సత్తా చాటిన బోయిన్‌పల్లి 'సదాశివ' విద్యార్థులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

సదాశివ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలలో మొత్తం 34 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 10 పాయింట్లు ఇద్దరు సాధించగా, 9.8 ఇద్దరు, 9.7 ఒక్క విద్యార్థి, 9 నుంచి 9.5 11 మంది విద్యార్థులు, 8 నుంచి 9 వరకు 11 మంది విద్యార్థులు, 8 నుంచి 7 జీపీఏ ఆరుగురు, 6 జీపీఏ ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు. జీ సాయి జోతిర్మయి, మణిదీప్‌లు 10/10 జీపీఏ, ఎండీ అఫ్జల్ ఖాన్, పీ దుర్గ శ్రావణ్‌లు 9.8 జీపీఏ, ఎం విశ్వ తేజ 9.7 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శివ, ప్రిన్సిపల్ రమ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



135 డివిజన్ మచ్చ బొల్లారం డివిజన్‌లోని కౌకూర్ ప్రశాంత్ నగర్ లో రూ 1 కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ జితేంద్ర నాథ్ ప్రారంభించారు. రూ 75 లక్షలతో చేపట్టే థీమ్ పార్కు పనులకు, మరొక రూ. 75 లక్షలతో మంజీరా మంచినీటి సరఫరాకు పైపులైన్ల పనులకు కార్పొరేటర్, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కొత్తగా 50, 60 కాలనీలు వెలిశాయని.. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో మచ్చ బొల్లారం డివిజన్ సమగ్రాభివద్ధి చేయడమే తన ముఖ్య ఉద్దేశమనితెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీజీఎం భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, డీఈ మహేష్, ఎలక్ట్రికల్ ఏఈ స్వాతి, కాలనీ వాసులు గురునాధరావు, తివారి, పెద్ది రమేష్, బొబ్బిలి సురేందర్ రెడ్డి , ఢిల్లీ పరమేష్, రాజేందర్, రాజేష్, వెంకటేష్ యాదవ్, వెంకట్ గౌడ్, సతీష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు

విజయ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-కాప్రా



పదో తరగతి ఫలితాల్లో విజయ హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. ఎనిమిది మంది విద్యార్థులు 10/10 జీపీఏ , 8 మంది 9.8 జీపీఏ సాధించారు.. 63 మంది విద్యార్థులు 9.0 జీపీఏ పాయింట్లకు పైగా సాధించారు . ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి , కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి , కరస్పాండెంట్ కె. రాజేశ్వర్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వారికి పతకాలను అందించారు. వారు మాట్లాడుతూ విజయ హైస్కూల్ ప్రతి సంవత్సరం రాణిస్తోందని, సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ సాంకేతికతకు తెరతీసి అత్యుత్తమంగా నిలుస్తోందన్నారు. మహేందర్ రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో బీఆర్‌జేసీ పార్సి పాఠశాల ప్రభంజనం

నవతెలంగాణ-బేగంపేట్



పదో తరగతి ఫలితాల్లో బీఆర్‌జేసీ పార్సి పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ చారి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణతశాతం పెరిగిందన్నారు. అలాగే ఉపాధ్యాయులు తల్లిదండ్రులు వల్లే విద్యార్థులు చదువులో రాణించారని చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

కంటి వెలుగుతో పేదల్లో కొత్త కాంతులు

- కార్పొరేటర్ మేక లలితాయాదవ్

నవతెలంగాణ-జవహర్ నగర్



కంటి వెలుగుతో పేదల ముఖాల్లో కొత్త కాంతులు చిగురిస్తున్నాయని, ఈ కార్యక్రమం సత్ఫలితా లనిస్తుందని కార్పొరేటర్ మేక లలితాయాదవ్ అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని 19వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేదలు ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, వైద్యరంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. అంధత్వ నివారణగా తెలంగాణగా తీర్చిదిద్దలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, శాంతికోటేష్ గౌడ్, నాయకులు వినోద్, రాజుగౌడ్, పరమేష్, అరుణ, స్వప్న, అనురాధ, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాలివాహన ఎన్‌క్లేవ్‌లో పార్క్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని శాలివాహన ఎన్‌క్లేవ్‌లో జీహెచ్ఎంసీ పార్క్‌ను ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్కు అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ విభాగానికి రూ. 30 లక్షలు, గ్రీనరీ అండ్ ఫెన్సింగ్ కు రూ. 13 లక్షలు, విద్యుత్ దీపాల కోసం రూ. మూడు లక్షలు దాదాపు 46 లక్షల వ్యయంతో శాలివాహన పార్కు అభివద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. పార్కులో చిన్నపిల్లల నుండి వద్దుల వరకు అందరికీ సౌకర్యార్థంగా నిర్మించామని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు, ఎల్బీనగర్ జోనల్ యూబీడీ, డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, కాప్రా సర్కిల్ యూబీడీ, నరసింహారాజు, రవీందర్, ఎలక్ట్రిసిటీ స్ట్రీట్ లైట్స్ డీఈ రవీందర్ ,ఏ. ఈ ప్రత్యూష,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుడుగు మహేందర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, మురళి పంతులు, పవన్,మహేష్, చందు, కొండల్ గౌడ్, మల్లారెడ్డి, పెంట రెడ్డి, సోమనాథ్, శివకుమార్, దేవి, శాలివాహన ఎంక్లేవ్ ప్రధాన కార్యదర్శి వి.సి. రవి, ఉపాధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిరుద్యోగ భృతి ఇస్తాం

- నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిరుద్యోగ భతి ఇస్తామని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ హామినిచ్చారు. గురువారం మచ్చ బొల్లారం డివిజన్ లో నిర్వహించిన హత్ సే హత్ జోడో అభియాన్ యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమ్మరి బస్తి, హరిజన బస్తీ , తెనుగు బస్తీ, కటిక బస్తీలలో ఆయన గడప గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తు న్నాయని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లలో ఉన్న సమస్యలు పరిష్కరిం చక పోతే కాంగ్రెస్ ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ నిచ్చారు. గ్యాస్ సిలిండర్ ధర 500 రూపాయలకే ఇస్తా మని మాట ఇచ్చారు. యువకులకు ఉద్యోగ భద్రత ఉంటుందని,నిరుద్యోగ భతి కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్, డోలి రమేష్, సీఎం యాదగిరి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు పవన్, శ్రీనివాస్, సూర్య ప్రకాష్ రెడ్డి, సంజీవ్ కుమార్, రవీందర్ రెడ్డి, బలరాం, రాజు పాతాలు తదితరులు పాల్గొన్నారు

'రామకృష్ణ తప్పుడు మాటలు మానుకోవాలి'

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ తప్పుడు మాటలు మానుకోవాలని, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ కంటోన్మెంట్ నియోజకవర్గం నాయకులు అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో మీడియాతో వారు మాట్లాడారు. సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో 2008లో 10.5 ఎకరాల స్థలంను 13 ఎకరాల విలువ చేసే నగదు ఇచ్చి కొనుగోలు చేశామని వారు వెల్లడించారు. గాంధీ ఐడియాలజీ భవన్ నిర్మాణం కోసం కంటోన్మంట్ బోర్డ్‌లో పర్మిషన్ పిటిషన్ వేశామని...కలెక్టర్ నుంచి ఎన్ఓసి తీసుకువస్తేనే పర్మిషన్ ఇస్తామని బోర్డు అధికారులు తెలపడంతో రేవంత్ రెడ్డి ఎంతగానో కషిచేసి ఎన్ఓసి తీసుకువచ్చారని చెప్పారు. ఇదంతా తెలిసి కూడా నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని... నామినేటెడ్ హెూదాలో ఉండి ఇలా మాట్లాడడం తగదన్నారు. రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు లేదని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డ్ సమావేశాలకు ఎంపీ రేవంత్ రెడ్డి హాజరు కావడంలేదని చెప్పడం విడ్డూరమని.. అసలు బోర్డ్ సమావేశంలో ఏ రోజు ..ఏ సమయంలో పెడుతారో అధికారులకే తెలుసని నాయకులు విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్ కుమార్, డీబీ దేవేందర్, వినోద్, నందికంటి రవి, అశ్రఫ్, సదానంద్, బాబు రావు, సాల్మన్, అన్ననగర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ జనప్రియ టౌన్ షిప్‌లోని డీసిల్టింగ్ పనులను గురువారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసిల్టింగ్ పనులు పూర్తి అయిన వెంటనే తీసిన సిల్ట్‌ను తక్షణమే తొలగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిల్ట్ తొలగించి మట్టి కుప్పలు ఎక్కడివి అక్కడ ఉంచడం వల్ల దుర్వాసన, దుర్గంధం దోమలు వద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, రామారావు, స్థానిక నాయకులు తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్, పైళ్ల ప్రవీణ్, మెయిన్ పాషా, ప్రభాకర్ రెడ్డి, మెండ రఘు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల డిమాండ్లను తీర్చి సమ్మెను విరమింపజేయాలి

నవతెలంగాణ-కాప్రా



జూనియర్ పంచాయతీ సెక్రటరీల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం తీర్చి తక్షణమే వారి సమ్మెను విరమింపజేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కేవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం కపా సాగర్ నాగనిగళల బాలపీరు ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండువారాలుగా నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సెక్రటరీల సకల సేవలను ఉపయోగించుకుంటూ వారి పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నదన్నారు. ముగిసిన ప్రొబిషన్ పిరియడ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇచ్చిన జీవోకు కట్టుబడి వారిని క్రమబద్ధీకరించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రాథమిక అవసరాలు తీరని రూ. 15 వేల వేతనాలతో 60/70 కిలోమీటర్లు ప్రయాణం చేసి వారి విధులు నిర్వర్తిస్తున్నా రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. జీతభత్యాలు కూడా ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా ఇస్తున్నారని చెప్పా రు. 9,000 మంది పంచాయతీ సెక్రటరీల క్రమబద్ధీకరణ డిమాండ్ న్యాయబద్ధమైనదన్నారు. పక్క రాష్ట్రంలో రెండేండ్ల కాలానికే సెక్రెటరీలను క్రమబద్ధీకరణ చేసిన విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం మర్చిపోవొద్దన్నారు.చాలా రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం చర్చలకు పిలిచి బేషరతుగా సమ్మె విరమింపజేయాలని కోరారు. నెల రోజుల తర్వాత రెగ్యులర్ చేస్తామని మాట దాటవేయడం మంచిది కాదన్నారు. తక్షణమే చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం బెదిరించకుండా డిమాండ్లు తీర్చి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

పేదింటి అమ్మాయి పెండ్లికి రూ.26,116 అందజేత

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



ఓ పేదింటి అమ్మాయి పెండ్లికి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు రూ 26, 116లు నగదు అందచేసి అండగా నిలిచారు. వినాయక్ నగర్‌కు చెందిన కావేరికి ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. తల్లిదండ్రులు పేదవాళ్లు కావడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే హన్మంతరావు స్పందించి తన వంతుగా 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్ గుండా నిరంజన్ రూ 5 వేలు, పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షుడు తులసీ సురేష్ రూ 1,116 లు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. మొత్తం నగదును బీఆర్ఎస్ నాయకులు గురువారం పెండ్లి కూతురు ఇంటికి వెళ్ళి అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కీసర సీఐ రఘువీర్ రెడ్డికి ఉత్తమ సేవా పతకం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కీసర సీఐ రఘువీర్ రెడ్డి కి ఉత్తమ సేవ పతకాన్ని రాష్ట్ర హెూం శాఖ మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర డిజీపీ అంజనీ కుమార్ యాదవ్‌ల నుంచి అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద భారతిలో ఈ అవార్డ్ ప్రదానం చేశారు. ఈ అవార్డు రావడం బాధ్యతను మరింత పెంచిందని కీసర సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు.



సోనియా గాంధీ నగర్ వాస్తవ్యులు నాసగోని పరుశురామ్ గౌడ్ కూతురు నాసగోని స్ఫూర్తి టెన్త్ క్లాసులో 9.7 మార్కులు సాధించి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినందున ఆమెను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ,ధనుంజయ్ గౌడ్ ,పరుశురాం గౌడ్, సాయిబాబా గౌడ్, కనకయ్య ,రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

మృతుడి కుటుంబానికి మనం సైతం కాదంబరి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సినీ, టీవీ మేకప్ కళాకారుడు కుమార్ 30వ తేదీన అనారోగ్యంతో చనిపోయాడు. వారి కుటుంబానికి మనం సైతం కాదాంబరి ఫౌండేషన్ ద్వారా రూ.25 వేల చెక్కును, అతని కుమార్తెకు ఫౌండేషన్ నిర్వాహకులు కాదాంబరి కిరణ్ అందించారు. ఈ సందర్భంగా కాదాంబరి కిరణ్ మాట్లాడుతూ సినిమా కార్మికులు ఎవరైనా ఆర్థిక ఇబ్బందులతో ఉంటే, ప్రమాదాలకు లోనైతే, చనిపోయినా వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేయుటలో తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. దాతలు వి.వి సత్యనారాయణ, పి.సత్యనారాయణ రాజు, ఎం.భాస్కర్‌రెడ్డి, పాలెపు సత్యవతి వారి సౌజన్యంతో ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు.

జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ అధ్యక్షులుగా డాక్టర్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్ నియమితులయ్యారు. ఈ మేరకు జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ సలహా మండలి సభ్యుల సలహా సంప్రదింపుల తర్వాత జాతీయ అధ్యక్షులు ఈ నియామకాన్ని చేపట్టారు. డాక్టర్ ఖాలిద్ గతంలో ఎస్ఐవో స్టేట్ ప్రెసిడెంట్‌గా, జమాఅతె ఇస్లామీహింద్ గ్రేటర్ హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. 2027 వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. తనకు అప్పగించిన బాధ్యతల తను వంతు సేవ చేసినందుకు కృషి చేస్తానని డాక్టర్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్ తెలిపారు.

ఉద్యమాల అణిచివేత సీఎం స్థాయికి సరికాదు

- **జూనియర్ పంచాయతీ సెక్రెటరీలను చర్చలకు ఆహ్వానించాలి**
- **బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**



నవతెలంగాణ-అడిక్‌మెట్

సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రెటరీలను బెదిరించడం, ఉద్యమాన్ని అణిచివేయాలని చూడటం ముఖ్యమంత్రి హోదాకు సరికాదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. వెంటనే వారిని చర్చలకు ఆహ్వానించాలన్నారు. గురువారం విద్యానగర్ బీసీ భవన్‌లో తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నాలుగేండ్లుగా విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు తమను రెగ్యులరైజ్ చేయాలని 14 రోజులుగా 9,355 మంది సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ సమ్మె విరమించకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అన్నారు. ఉద్యమాల ద్వారా ముఖ్యమంత్రి ఉద్యమాన్ని అణిచివేయడం భావ్యం కాదన్నారు. సమ్మె చేయడం, సంఘాలు పెట్టుకోవడం రాజ్యాంఘంలోని 19వ ఆర్టికల్ ప్రజలకిచ్చిన ప్రాథమిక హక్కు అనీ, దీన్ని ఏ ప్రభుత్వం , ఏ కోర్టు, ఏ సంస్థ సవాలు చేయడానికి వీల్లేదన్నారు. జూనియర్ పంచాయతీ సెక్రెటరీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలనీ, బీసీ/ఎస్సీ/ఎస్టీ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, అధికార పార్టీలు శాసనసభ్యులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఇంతవరకు ప్రభుత్వం తగురీతిలో స్పందించకపోవడం న్యాయం కాదన్నారు. ప్రతిష్ఠకు పోకుండా చిరు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, భూపేష్ సాగర్, వేముల రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్, కృష్ణ యాదవ్, రామాంజనేయులు, మల్లేష్, నిఖిల్, దీపిక బిల్లా పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి





- **టీఎస్‌సీపీఎస్‌ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు**

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పెన్షన్ సంస్కరణలో భాగంగా పీఎఫ్ఆర్‌డీఏ బిల్లు ఎన్‌డీఏ ప్రభుత్వం 2003లో ప్రవేశపెట్టింది. ఆర్డినెన్స్ రూపంలో వచ్చిన బిల్లుకి అనుగుణంగా కేంద్రంలో 1-1-2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు ఎన్‌పీఎస్ విధానం వర్తిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ 1,2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు సీపీఎస్, ఎన్‌పీఎస్ వర్తింపజేస్తూ జీవో 653,654, 655 ద్వారా వర్తింపజేశారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తదుపరి జీఓ 28 ద్వారా సీపీఎప్ విధానాన్ని అడాప్ట్ చేసుకున్నారు'.

సీపీఎస్ విధానం..

జనవరి 1,2004 రోజు ఆ తర్వాత నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 1, 2004 తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పీఎస్, సీపీఎస్ పథకం పరిధిలోకి వస్తారు. వీరి సంఖ్య తెలంగాణలో 1,70,000 పై చిలుకు, ప్రస్తుత ఉద్యోగుల్లో 60 శాతం దేశం మొత్తం కలిపి దాదాపుగా కోటి వరకు ఉంటారు అని అంచనా. ఈ పథకం పరిధిలోని ఉద్యోగుల నెల వారీ మూలవేతనం, కరువు భత్యం నుంచి 10శాతం రికవరీ చేస్తారు. దీనికి అదనంగా ప్రభుత్వం 10శాతం కలిపి ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా ఉద్యోగుల పీఆర్ఏఎన్ అకౌంట్‌లో జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి 10శాతం ప్రభుత్వ వాటాగా 14శాతం కలిపి జమ చేస్తారు. ఉద్యోగుల పీఆర్ఏఎన్ ఖాతాలో జమైన డబ్బులను ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా పీఎఫ్ఆర్‌డీఏ ఆమోదం పొందిన పెన్షన్ ఫండ్ మేనేజర్ ఖాతాలకు నిర్ణీత నిష్పత్తి (33:32:35) ప్రకారం బదిలీ చేస్తారు. బదిలీ చేయబడిన ఆ డబ్బుల్ని పీఎఫ్ఆర్‌డీఏ వద్ద ధ్రువీకరణ పొంది, ఫండ్ మేనేజర్ల వద్ద రిజిస్టర్ ఐన కంపెనీల్లో, షేర్, ప్రభుత్వ సెక్యూరిటీస్, స్వల్ప కాలిక ఋణ పత్రాలు, స్టాక్స్ రూపంలో పెట్టుబడులు పెడతారు. ఆ పెట్టుబడుల్లో ఈక్విటీస్‌లో 15శాతంకి మించి పెట్టకూడదని షరతు. ఈ పెట్టీబడులు కూడా ఉద్యోగి వయస్సు, వాటిని పరిగననలోకి తీసుకుని ప్రమాదం తక్కువగా ఉన్న కనీస హామీ ఉన్న వాటిలో పెడుతారు. అలా పెట్టిన పెట్టుబడుల పై లాభాలకు ఎలాంటి హామీ లేదు. నష్టాలు కూడా రావచ్చు. లాభాలు చాలా పరిమితంగా మాత్రమే ఉంటవి. పెట్టుబడి పై వచ్చే లాభాలని నికర ఆస్థి విలువగా చూపుతారు. అది నిరంతరం మారుతూ ఉంటుంది. పెన్షన్ ఫండ్‌లో పెట్టుబడులపై లాభ నష్టాలపై కనీస హామీలు ఉండవు అనీ, అవి పూర్తిగా మార్కెట్ ఆధారిత శక్తులపై ఆధారపడి ఉంటాయని పీఎఫ్ఆర్‌డీఏ చట్టంలో పేర్కొన్నారు.

ఉపసంహరణ 3 రకాలు

1.పాక్షిక ఉపసంహరణ
2.స్వచంద పదవీ విరమణ
3.పదవీ విరమణ పొందిన వేళ

1.పాక్షిక ఉపసంహరణ : ఉద్యోగి మొత్తం సర్వీస్‌లో మూడు సార్లు మాత్రం అతని/ఆమె పీఆర్ఏఎన్‌లో జమైన మొత్తంలో ఉద్యోగి వాటాలో 25శాతం వరకు ఉపసంహరించుకునే వీలుంది.

2.స్వచ్ఛంద పదవీ విరమణ/ఉద్యోగి మరణిస్తే.. : పీఆర్ఏఎన్ ఖాతాలో జమైన మొత్తంలో 80శాతం పెన్షన్ ప్లాన్ తప్పనిసరిగా కొనాల్సి ఉంటుంది. 20శాతం మాత్రమే ఉద్యోగికి / కుటుంబ సభ్యులకు ఇస్తారు. పెన్షన్ ప్లాన్ ఆధారంగా పెన్షన్ వస్తుంది. ఖాతాలో రూ.5 లక్షల లోపు ఉంటే మొత్తం డబ్బుని ఉపశమహరించుకోవచ్చు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సీపీఎస్ ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో చనిపోయిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం జీవో 58 ద్వారా ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేస్తారు. చనిపోయిన ఉద్యోగి కుటుంబ సభ్యులు అప్పటి వరకు ఆ ఉద్యోగి పీఆర్ఏఎన్ ఖాతాలో జమ ఉన్న మొత్తాన్ని ప్రభుత్వానికి ఇస్తామని హామీ పత్రం ఇచ్చిన యెడల వారికి ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేస్తారు.

3.పదవీ విరమణ : పదవీ విరమణ చెందిన ఉద్యోగి పీఆర్ఏఎన్ ఖాతాలో జమైన మొత్తంలో 40శాతం తప్పనిసరిగా పెన్షన్ ప్లాన్ కొనాల్సి ఉంటుంది. 60శాతం ఉద్యోగికి ఇస్తారు. ఉద్యోగి కొన్న పెన్షన్ ప్లాన్ మీద ఆధారపడి ఆ ఉద్యోగికి నెల నెలా నిర్ణీత పెన్షన్ వస్తుంది. భవిష్యత్తులో ఎలాంటి పెంపుదల ఉండదు.

పాత పెన్షన్, సీపీఎస్‌కి తేడా..

పాత పెన్షన్‌లో ఉద్యోగి చనిపోయిన/పదవీ విరమణ పొందిన ఆ ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో సగం ప్రతి నెలా పెన్షన్ రూపంలో ఇస్తారు. ఇందుకు గాను ఉద్యోగి ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ చేయాల్సిన అవసరం లేదు. ఉద్యోగి చనిపోతే అతనికి 65 ఏండ్ల వయసు వచ్చేంత వరకు చివరి మూలవేతనంలో 50శాతం తదుపరి మూలవేతనంలో 30శాతం ఇస్తారు. ఈ రెండు విలువ కనీస పెన్షన్ కన్నా తక్కువ ఉంటే కనీస పెన్షన్ ఇస్తారు. దానిపై కరవు భత్యం ఇస్తారు. పెన్షన్ 40శాతం వరకు కమ్యూటేషన్ చేసుకోవచ్చు. ఆరోగ్య పథకం వర్తిస్తుంది. కరవు భత్యం ఉద్యోగికి మాదిరిగానే ఇస్తారు. ప్రతి పీఆర్‌సీలో పెన్షన్ రివైస్ అవుతుంది హాస్పిటల్ ఖర్చులు ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. సీపీఎస్ విధానంలో ఇలాంటి ప్రయోజనాలు ఏమీ వర్తించవు. ఎన్‌పీఎస్, సీపీఎస్ విధానంలో పెన్షన్ పెట్టుబడులపై పూర్తిగా ఫండ్ మేనేజర్లదే పూర్తి విచక్షణ. ఉద్యోగుల జోక్యం ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదు. ఫండ్ మేనేజర్లపై పీఎఫ్ఆర్‌డీఏ అధికారుల, పెట్టుబడిదారుల ఒత్తిడి ఉండే అవకాశం ఉంది. ఫండ్ మేనేజర్లు ప్రలోబాలకు లొంగి అనుకూలమైన సంస్థల్లో అధిక పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది.కనీస హామీ లేని జీవనది లాంటి ఈ పెట్టుబడిపై కన్నేసిన పెద్దలు డొల్ల కంపెనీలు సృష్టించి పెట్టుబడులు కొల్లగొట్టే ప్రమాదముంది. ఇటీవలి కాలంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ షేర్ల పతనంతో సీపీఎస్ ఉద్యోగుల పీఆర్ఏఎన్ ఖాతాల్లో ఎన్ఏవీ వేలల్లో పడిపోవడం ఈ ప్రమాదాన్ని రుజువు చేస్తుంది.

ఎన్‌సీపీఎస్‌యూ డిమాండ్..

పెట్టుబడి దారి మస్తిష్కపు పుట్టలో ఎదిగిన పీఎఫ్ఆర్‌డీఏ చట్టం నుంచి మొలకెత్తిన విషపు భీజం సీపీఎస్, ఎన్‌పీఎస్. ఇది వృద్ధాప్యంలో ఉద్యోగి జీవితంలో మరణ శాసనంలా పరిణమించే అవకాశం ఉంది. అందుకే ఈ విషపు బీజం ఇంకా విస్తరించకముందే అంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ నిరంతరం పోరాటం చేస్తుంది. పెన్షన్ అనేది ఉద్యోగి దీర్ఘ కాలం పని చేసినందుకు ఇచ్చే పరిహారం/ప్రతిఫలం మాత్రమే కాదు. అందులో ఉద్యోగుల సామాజిక ఆర్థిక ప్రయోజనాలు దాగి ఉన్నది అనే విషయాన్ని 1982లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీం తీర్పుని కూడా పట్టించుకోకుండా వృద్ధాప్యంలో శాపంలా పరిణామించే మార్కెట్ ఆధారిత పెన్షన్ పథకాన్ని అమలు చేయడం అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల ఉసురు తీయడమే. దశాబ్ద కాలంగా విన్నపాలకే పరిమితమైన సీపీఎస్ రద్దు అంశాన్ని, " పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగి హక్కు " అని నినదించి 2016లో పోరుబాట పట్టించి పోరాట బావుటా ఎగరేసింది టీఎస్‌సీపీఎస్‌ఈయూ. నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తూ శాంఖరావం, సామూహిక సెలవు, ఆయత ధర్మదీక్ష, ఖిలఫత్ దివస్, జన జాతర, సత్యాగ్రహ దీక్ష వంటి రూపాల్ని అనుసరించి సీపీఎస్ ఉద్యోగులకు డీసీఆర్‌జీ, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ సాధించి పెట్టిన ఘనత టీఎస్‌సీపీఎస్ ఈయూది. ఇటీవలి కాలంలో దేశంలో పాత పెన్షన్ రద్దు కోసం జరిగిన పోరాటల్లో ఎన్ఎంఓపీఎస్ (నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం) పాత్ర మరువలేనిది. ఎన్ఎంఓపీఎస్‌కి జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్థిత ప్రజ్ఞ ఉండటం మనకి గర్వ కారణం. ఎన్ఎంఓపీఎస్ పోరాటాల ఫలితంగా పంజాబ్, రాజస్థాన్, చత్తిస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాయి. నిన్నటి వరకు సీపీఎస్ రద్దు రాష్ట్రాల పరిధిలోని అంశం కేంద్రానికి సంబంధం లేదు అని సుద్దులు పలికిన కేంద్రం ఇప్పుడు రద్దు చేసిన రాష్ట్రాలపై కక్ర పెత్తనం చేస్తూ ఉద్యోగుల పీఆర్ఏఎన్ ఖాతాలోని నిధులను రాష్ట్రాలకు తిరిగి ఇవ్వకుండా, ఆర్థిక ఆంక్షలు విధించడం, భారత ప్రభుత్వ అధీనంలోని ఆర్థిక సంస్థల చేత ప్రకటనలు చేయిస్తూ ఆయా రాష్ట్రాలను పరోక్షంగా బెదిరించడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి బెదిరంపు దోరణుల్ని టీఎస్‌సీపీఎస్‌ఈయూ తీవ్రంగా వ్యతిరేకస్తుంది. పాత పెన్షన్ సాధన కోసం నిరంతర పోరాటం చేస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ 2023లోనే సీపీఎస్ అంతం మన పంతం నినాదంతో ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసింది. సీపీఎస్ రద్దు చేసిన రాష్ట్రాల్లోని ఉద్యోగుల పీఆర్ఏఎన్ ఖాతాల్లో జమైన డబ్బును తిరిగి ఇచ్చే విధంగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో కూడా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే విధంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించి రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఉద్యమ కార్యాచరణ..

ఏప్రిల్ 16న 33 జిల్లా కేంద్రాల్లో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్ పేరిట ర్యాలీలు మే నెలలో సామాజిక భద్రత కోరుకునే ఉద్యోగి సామాజిక బాధ్యతలో భాగంగా చలివేంద్రాల ఏర్పాటు, సామాజిక కార్యక్రమాలు, జూన్ రెండో వారం నుంచి పాత పెన్షన్ సంకల్ప సాధన యాత్రకు డివిజన్ల వారీగా సదస్సులు, జులైలో రాష్ట్ర వ్యాప్తంగా పాత పెన్షన్ సాధన సంకల్ప బస్ యాత్ర, ఆగస్టు 23న హైదరాబాద్‌లో లక్షా 70వేల కుటుంబాలతో రాజకీయ రణరంగ మహాసభ అన్ని రాష్ట్రాల సీపీయస్ ఉద్యోగులతో అక్టోబర్ 1 న ఢిల్లీ లోపెన్షన్ శంఖ్ నాద్ కార్యక్రమం చేపడుతున్నట్టు టీఎస్‌సీపీఎస్‌ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు చెప్పారు.

పేదలకు పీహెచ్‌డీ విద్యను దూరం చేసే కుట్ర



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులను పీహెచ్‌డీ విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుందనీ, అందులో భాగంగానే ఓయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఓయూలో సూపర్‌వైజర్ అలాట్ చేయకుండా రీసెర్చ్ సెంటర్లలో సూపర్‌వైజర్‌ని అలాట్ చేసినట్టు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో అలాట్మెంట్ కాపీలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థులు మాట్లాడుతూ రీసెర్చ్ సెంటర్లలో ఎలాంటి అనుభవం లేని డిగ్రీ లెక్చరర్లకు సూపర్వైజర్ ఇవ్వడం ద్వారా తమ భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రూ.2 వేల నుంచి రూ. 25 వేల పెంచిన పీహెచ్‌డీ కోర్స్ ఫీజును తగ్గించాలనీ పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్, మెస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను, ప్రొఫెసర్లను, ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకుని ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రీసెర్చ్ సెంటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఉస్మానియా యూనివర్సిటీలో గైడ్ షిప్ అలాట్ చేయాలనీ, అలాట్మెంట్ కాపీలను తగలబెట్టిన ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ నెల్లిసత్య, ఫిలాసఫీ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్, తెలుగు రీసర్చ్ స్కాలర్ బొడ్డుపల్లి అఖిల్, మధు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రీసెర్చ్ స్కాలర్ కిరణ్, మహేష్, ఎకనామిక్స్ రీసెర్చ్ స్కాలర్ శ్రీవాస్తవ, సోషియాలజీ రీసెర్చ్ స్కాలర్ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద కదలికలపై ఆరా

- **పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు : హెూంమత్రి మహమూద్ అలీ**

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఆరుగురు ఉగ్రవాదులను ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేయడం సంచలనం రేపింది. మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు భోపాల్, హైదరాబాద్‌లలో ఉగ్రవాదులను మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులకు వారు సిద్ధపడినట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో రాష్ట్ర నిఘా వర్గాలు, పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. గురువారం హెూం మంత్రి మహమూద్ అలీ మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారనీ, ఎలాంటి ఘనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. నగరంలో ఉగ్ర కదలికలపై అన్ని కోణాల్లో దార్యప్తు చేస్తున్నామని తెలిపారు. నగరంలో ఆరుగురు పట్టుబడిన వారి వివరాలతోపాటు వారికి ఆశ్రయం కల్పించిన వారి వివరాలను రాబడుతున్నామన్నారు.

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓపెన్ ఇంటర్ ఆర్థిక శాస్త్రం (తెలుగు మాధ్యమం) పరీక్షను ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఈ సమాచారాన్ని ఏఐ కో-ఆర్డినేటర్ల ద్వారా విద్యార్థులకు చేరవేయాలని వారు కోరారు. మే 2న జరగాల్సిన ఓపెన్ స్కూల్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్షకు సంబంధించి తెలుగు మీడియం ప్రశ్నపత్రాలకు బదులుగా ఇంగ్లీష్ మీడియం పేపర్లను పరీక్ష కేంద్రాలకు అధికారులు పంపారు. పరీక్ష కేంద్రాల్లో చివరి నిమిషంలో ఇన్విజిలేటర్లు గుర్తించడంతో సదరు పరీక్షను రద్దు చేస్తున్నట్టు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షను 13న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇది వరకు జరిగిన పరీక్ష కేంద్రాల్లోనే నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 12 నుంచి 19 వరకు జరుగుతాయని తెలిపారు.

'పది' ఫలితాల్లో దీ మదర్స్ హై స్కూల్ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ






నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లోని ది మదర్స్ హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. దాదాపు 95శాతం వరకు ఉత్తీర్ణత సాధించి తమకు తామే సాటి అని నిరూపించారు. ది మదర్స్ హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న గాండ్ల రక్షిత్ 10/10 సాధించాడు. మధు హరిని 9.3, వెంకట్ కార్తిక్ 9.2, గీత సుమశ్రీ, ఓం తేజ్ 9.0 సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ప్రకాష్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ది మదర్స్ హై స్కూల్ విద్యార్థులు 95శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఫలితాలకు కారణం తమ స్కూల్‌లో నాణ్యమైన విద్యను అందించడమే అని తెలిపారు విద్యార్థులు చాలా కష్టపడి చదివారనీ, కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికీ రెట్టింపు ఫలితాన్ని అనుభవిస్తారని తెలిపారు. నాణ్యమైన విద్యకు మారుపేరుగా ఉన్నది మదర్స్ హై స్కూల్‌లో దాదాపు పేద విద్యార్థుల ఎక్కువగా చదువుకుంటారనీ, అలాంటి పేద విద్యార్థులు ఏండ్లుగా ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ తమ పాఠశాలను ఉన్నత స్థానాల్లో నిలబెడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కులు తక్కువ వచ్చిన లేదా సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ముఖ్యంగా ఆత్మహత్య లాంటివి చేసుకోకుండా శ్రద్ధతో చదివితే సాధించలేనిది అంటూ ఏమీ లేదనీ, విద్యార్థులు తమలోని నైపుణ్యానికి పదును పెట్టాలని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం



నవతెలంగాణ-అడిక్‌మెట్/హిమాయత్‌నగర్

దేశ రాజధానిలో పాలనా సర్వీసుల నియంత్రధికారంపై కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాల మధ్య నెలకొన్న చట్టపరమైన వివాదంపై సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం నిజమైన అధికారం ఎన్నికైన ప్రభుత్వానికి ఉండాలని ఏకగ్రీవ తీర్పును ప్రకటించడంపై ఆమ్ ఆద్మీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ పత్రికా ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఈ సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పు ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదంపై విశ్వాసాన్ని పునరుద్ధరించిందన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీకి ఓటు వేసిన ప్రజల ఆదేశాన్ని ధిక్కరించి కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, ఢిల్లీ ప్రభుత్వ పాలనా హక్కులను రాష్ట్రాల జాబితాల్లో జాబితా చేయబడిన అంశాల్లో రాష్ట్రాల హక్కులను దౌర్జన్యంగా దెబ్బతీయడం సుప్రీం కోర్టు ఏకగ్రీవ తీర్పుతో అడ్డుపడుతోందని అయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి పరిపాలనా సేవలపై శాసన కార్యనిర్వాహక అధికారాలు ఉన్నాయనీ, ప్రభుత్వ సర్వీసెస్ నిర్ణయాలకు ఢిల్లీలో కేంద్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలని సుప్రీంకోర్ట్ రూలింగ్ ఇవ్వడాన్ని అయన స్వాగతించారు. ఢిల్లీలో అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేక చర్యలు చేపట్టిన బీజేపీ ఢిల్లీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలో భాగంగా రాజ్యాంగ విరుద్ధమైన మార్గాలను అనుసరిస్తున్న బీజేపీని వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఓడించి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రమాదాలు జరిగినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడండి



- **బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు**

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రమాదాలు జరిగినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను కాపాడటం కోసం అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ వైద్య బృందంతో కలిసి, బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ అధికారులు ఏసీపీ జి.శంకర్ రాజు, సిబ్బంది సీహెచ్ జ్యోతి, ఎస్సై చక్రధర్, చిరంజీవి, ప్రసాద్, ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సైలు, సిబ్బంది సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం సీపీ ఆర్ చేయుటకు, డాక్టర్లతో కలిసి పోలీసు సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చి అవగాహన కల్పించారు. ప్రతిరోజూ జరిగే ప్రమాదాలపై ఏఈడీ ప్రథమ చికిత్స, ఇతర ప్రాథమిక అత్యవసర చికిత్సలు, ఎలా చేయాలో సిబ్బందికి ,పోలీసులకు నేర్పారు. అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ డాక్టర్లు ఎం.శ్రీనివాస్ రెడ్డి, కార్డియో పల్మనరీ రిససి టేషన్(సి పి ఆర్) పై, హాస్పిటల్ సిబ్బందికి, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం శంకర్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. వారి ప్రాణాలు వారే కాపాడుకునే విధంగా రోడ్డుపై ప్రయాణాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

13న రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన కార్యక్రమాలు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఈనెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించి పెట్టిన మహిళా మల్ల యోధులపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరత్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఆయనను వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ, రెజ్లర్ల జాతీయ సంఘానికి అధ్యక్షులైన బ్రిజ్ భూషన్ ను వెంటనే తన పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్న నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు అమానుషంగా, విచక్షణారహితంగా లాఠీచార్జీ చేయడాన్ని ఇతర 10 కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధి నాయకులు, నిలువెల్ల గాయాలతో నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు రక్షణ కల్పించాలని చేస్తున్న ఆందోళనలకు జాతీయ కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ దేశవ్యాపితంగా గ్రామీణ ప్రాంతాల నుంచి రాజధాని నగరాల వరకు ఆందోళనలు, నిరసనలు, కాగడాల ప్రదర్శనలు చేయాలన్న పిలుపులో భాగంగా ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్రంలోని అన్ని జిల్లా సమితులు వెంటనే స్పందించాలని కోరారు. ఈ నెల 13న సాయంత్రం 7 గంటలకు హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుంచి నిర్వహించే కాగడాల ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు, కార్మికులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎంఆర్ పాఠశాల విద్యార్థులకు మంత్రి అభినందనలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జీపీఏ 10/10తో అద్భుత ఫలితాలు సాధించిన గాజులరామారంలోని సీఎంఆర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు మంత్రి చామకూర మల్లారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..



పట్టుదలతో చదివితే ప్రతీ విద్యార్థి అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు, అందుకు నిదర్శనమే సీఎంఆర్ పాఠశాల విద్యార్థుల ఫలితాలు అన్నారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులు వారిపై పెట్టుకున నమ్మకని నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులలో ఎం.తేజస్విరెడ్డి జీపీఏ 10/10, సుచిత్ర నాయుడు 10/10, ఎస్.స్ఫూర్తి 10/10 సాధించి గాజుల రామారం డివిజన్‌లో మొదటి స్థానంలో నిలవగా, టీ.వెంకట సాయి జీపీఏ 9.8 సాధించారన్నారు, ఆరుగురు విద్యార్థులు 9.7, ముగ్గురు విద్యార్థులు 9,5, ఏడుగురు విద్యార్థులు 9.3, నలుగురు విద్యార్థులు 9.2, ఏడుగురు విద్యార్థులు 9.0 పైగా సాధించారన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సీఎంఆర్ హైస్కూల్ పాఠశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారన్నారు. తమ పాఠశాల విద్యార్థుల ఇంతటి విజయానికి అధ్యాపకుల కషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరి శంకర్, పాఠశాల ఏఓ సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నిమ్స్‌లో నల్లబ్యాడ్జీలతో ర్యాలీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17వ తేదీ నుంచి కార్మికులు పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడంతో హామీల అమలులో నిమ్స్ యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నల్ల జెండాలు, బ్యాడ్జీలతో నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి నిమ్స్ హాస్పిటల్‌లోని ఆంధ్రా బ్యాంక్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్టు యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ హాజరుకానున్నట్టు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.బాలయ్య తెలిపారు.

రేషన్ షాపులో కార్పొరేటర్ తనిఖీ

నవతెలంగాణ-ఓయూ

ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధర దుకాణాల ద్వారా వినియోగదారులకు సకాలంలో సరుకులు అందించాలని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. గురువారం ఆమె చౌక ధర దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిర్వహించే స్టాక్ రిజిస్టర్, స్టాక్ తెలిపే బోర్డులను, బయోమెట్రిక్ ఈ-పాస్ యంత్రాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలు పరిశీలించారు. ఒక్కొక్క షాపులో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరికీ సకాలంలో రేషన్ బియ్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, రాజా సుందర్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో అబుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని ఉస్మానియా యూని వర్సిటీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సంగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం చీఫ్ వార్డెన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయూలో మెస్, హాస్టల్‌లలో దాదాపు 382 మంది ఉద్యోగులు సైబెక్స్,సెక్యూర్, బీ సెక్యూర్, వెంక టేశ్వర, ఆయా సంస్థ కాంట్రాక్టర్ ల పరిధిలో పని చేస్తున్నా రని తెలిపారు. వీరికి దాదాపు మూడు నెలల నుంచి సమ యానికి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించా లని డిమాండ్ చేశారు. వేతనాలు సమయానికి రాకపోవ టం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. వీరికి వేత నాలు ప్రతి నెలా ఐదో తేదీన లోపల ఇవ్వాలనీ, టెండర్‌లో ఉన్న కాంట్రాక్టర్‌లు 20వ తేదీ దాటినా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్లు వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి సరైన సమయంలో వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకొవాలని చీఫ్ వార్డె న్ డాక్టర్ జి.శ్రీనివాస రావుని కలిసి మెమొరాండం అందజేశారు. డబ్బులు కోత విధిస్తున్నారనీ, వీరికి ఇప్పటి వరకు ఎలాంటి మెసేజ్ గాని, పే స్లిప్ గాని ఇవ్వలేద న్నారు. కాంట్రాక్టర్లు మోసం చేసినట్టుగా వ్యవహరిస్తున్నా రనీ, వీరితో మాట్లాడి వేతనాలు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చీఫ్ వార్డెన్ సానూలంగా స్పందించి వేతనాలు సకాలంలో వచ్చే విధంగా చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, సహాయ కార్యదర్శులు నరేష్, శివ, లక్ష్మణ్, బాలకృష్ణ, మహేందర్, సీహెచ్.మోహన్, రాజు నాయకులు, పాష, అనిల్ కుమార్, మసూద్ అలీ, జంపయ్య, ఫూల్ సింగ్, సురేష్, పర్శురాం, సుధాకర్, శివ, శౌకత్ అంజమ్మ, మేఘన, రాణి, పద్మ, యాదమ్మ, రేణుక, నాజియ భేగం, అరుణ, లక్ష్మి, ప్రమీల, అనురాధ, రాధిక, లలిత పాల్గొన్నారు.

ఫిషర్మన్ కో-ఆపరేటివ్ సొసైటీ భవనం పనులు ప్రారంభం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో నూతనంగా చేపడుతున్న " ఫిషర్మన్ కో-ఆపరేటివ్ సొసైటీ భవనం" మొదటి అంతస్తు నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ చిలుకూరి కష్ణ, వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి యాదమ్మ, కార్యదర్శి మద్దూరి వీరేశం, డైరెక్టర్లు మన్నే శంకర్, ఆర్కెల లక్ష్మణ్, మద్దూరి సత్యమ్మ, నాయకులు కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్ ,ఇందిరా రెడ్డి, గణేష్ ,దుర్గ ప్రసాద్ ,రాజు యాదవ్ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన విద్యా జ్యోతి స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ - హైదరాబాద్

చెంగిచెర్లలోని విద్యా జ్యోతి స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినా రు. పి. వైష్ణవి 10 జీపీఏ, ఈ పవిత్ర 9.8 జీపీఏ, ఐశ్వర్య9.7, చరణ్ తేజ 9.7 సాధించారు. ఆయా విద్యార్థులను కరస్పాండెంట్ శ్రవణ్ కుమార్ రెడ్డి డైరెక్టర్ అనిల్ అయ్యంగార్ ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడంతో తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.



రిజిస్ట్రేషన్ లేకున్నా.. నెంబర్ ప్లేట్లు లేకున్నా అంతే సంగతులు

- యజమానులపై కఠిన చర్యలు తప్పవు
- రాచకొండ కమిషనరేట్ పరధిలో రంగంలోకి ట్రాఫిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొందరు యువకులు ట్రాఫిక్ నిబంధలను మనకు వర్తించవనే తీరులో రోడ్లపై వాహనాలను అడ్డదిడ్డంగా నడిపిస్తారు. చేతిలో రేసింగ్ ఉంది కదా అని హైస్పీడ్‌తో దూసుకెళ్తారు. మరికొందరు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సైతం లెక్కచేయడం లేదు. రాంగ్ రూట్లో దూసుకెళ్తూ పోలీసులు పట్టుకున్నప్పుడు చూద్దాంలే అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంకొందరు నెంబర్ ప్లేట్ పెట్టు కోరు, ఉన్న నెంబర్ ప్లేట్‌పై రంగులు వేయడం, నెంబర్ కనిపించకుండా చేయడం లాంటివి చేస్తారు. మరికొందరు పీకలదాకా మద్యం సేవించి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. కొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్ సైతం ఉండడం లేదు. ఇలాంటి వాహనాల మూలంగా నగరంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో సదురు వాహన దారున్ని పట్టుకుందామనుకుంటే నెంబర్ లేకపోవడంతో పోలీసులకు చిక్కడం లేదు. మరికొందరు చోరీలు, దోపిడిలకు నెంబర్ లేని వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు రాచకొండ పోలీసులు ప్రత్యక దృష్టి సారించారు. నంబర్ ప్లేట్స్ లేదా రిజిస్ట్రేషన్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 48,998 వాహనాలపై మోటారు వాహన చట్టం కింద జరిమానా విధించారు.

చలాన్ వచ్చినా... రిజిస్ట్రేషన్ లేకుండానే రోడ్లపైకి

ఒక్కసారీ చలాన్ వచ్చినా మళ్లీ రిజిస్ట్రేషన్ లేకుండానే కొందరు వాహనదారులు ఉపయోగిస్తున్నారు. అలాంటి వారిని పట్టుకునేందుకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దించారు. నిబంధనలు ఉల్లంఘించిన సదురు వాహనదారున్ని పట్టుకుని మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 192 కింద కేసులు నమోదు చేస్తున్నారు. వారిని ప్రత్యేక కోర్టుల ముందు హాజరుస్తున్నారు. దాంతో కోర్టు వారికి ఒక రోజు నుండి 3 రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 3,000 నుండి 5000 జరిమానాలు విధిస్తోంది. మరికొన్ని సార్లు రెండు రోజుల ట్రాఫిక్ కమ్యూనిటీ సేవ వంటి శిక్ష వేస్తోంది. వాహనాల రిజిస్ట్రేషన్ లేకుండా డ్రైవ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దంటూ ప్లకార్డులతో వారు ప్రధాన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద నిలబెడుతున్నారు.

నేరాలను నివారించేందుకు చర్యలు



నెంబర్‌ప్లేట్ లేని వాహనాలే కాకుండా రిజిస్ట్రేషన్ లేని వాహనాలను కొందరు నేరస్తులు ఉపయోగిస్తున్నారు. వాటిపై సంచరిస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. వాహనాలను కొనుగోలు చేసిన 30 రోజుల్లోగా (వాహన యజమానులు) తప్పనిసరిగా వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మోటారు వాహన చట్టం నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు ఉండాలి. నంబర్ ప్లేట్‌లపై చిహ్నాలు, ఎటువంటి రాతలు ఉండకూడదు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్‌లు, ఇతర నేరాలను నివారించడానికి వాహనాల నెంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తా

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- ప్రగతి యాత్రలో భాగంగా 55వ రోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద పర్యటన



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని పార్టీలకతీతంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గురువారం గాజుల రామారం డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 55వ రోజు సందర్భంగా రావి నారాయణరెడ్డి నగర్ ఈస్ట్, ఫేస్-2, ఫేస్-3 లలో స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పాద యాత్ర చేశారు. కోట్ల నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు తెలుసుకొని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంతో పోల్చితే వారి బస్తీలను అన్ని రంగాల్లో అభివద్ధి చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రూపాదేవి, డీజీఎం అప్పల నాయుడు, ఏఈ కళ్యాణ్, మేనేజర్ రోహిణి, సీనియర్ నాయకులు రషీద్ బైగ్, కస్తూరి బాల్ రాజ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, ఆబిద్, ఇబ్రహీం, పీట్ల మల్లేష్, నర్సింహా, నారాయణ, సురేష్, రాజు, రాజేందర్, యాదవ రావు బస్తీల ప్రజలు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ విప్ అరికె పూడి గాంధీ



నవతెలంగాణ - కూకట్ పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్, సప్తగిరి కాలనీలలో సీసీ రోడ్లు, బిటి రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గదర్శకం లో, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయ శక్తుల కషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు ,నాయి నేని చంద్రకాంత్ రావు, రాంచందర్, ఆంజనేయులు, విద్యాసాగర్, ఆంజనేయులు, స్వరూప, శర్మ, మల్లయ్య, రమేష్, చంద్రమోహన్ సాగర్, లింగయ్య, ఎర్రలక్ష్మయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

మే 22న మెగా జాబ్ మేళా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీఎస్ స్టెప్ (తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్) ఆధ్వర్యంలో. కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వద్ద ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్న "మెగా జాబ్ మేళా" వాల్ పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌లు రాష్ట్ర నూతన సెక్రటేరియట్‌లో మంత్రి చాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 100కు పైగా కంపెనీలు పాల్గొననుండడం, 10 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్న నేపథ్యంలో నిరుద్యోగ యువత ఈ సువర్ణ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు చింతల్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు దిక్సూచి నేటి విద్యార్థులే

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట.

భావితరాలకు దిక్సూచి నేటి విద్యార్థులేనని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. ఇటీవలే విడుదలైన ఇంటర్మీడియట్, పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన కమ్యూనిస్టు పార్టీకి చెందిన నాయకుల విద్యార్థులకు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్ సీపీఐ కార్యాలయాలలో శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తున్న సభ్యులు దాదాపుగా మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారేననారు. అలంటి వారి పిల్లలు నేడు అధిక మార్కులు పొందడం తల్లిదండ్రులకు చాలా సంతోషమని, రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో రాణించి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు నేడు సమసమాజ నిర్మాణం కోసం ఎలాగైతే పనిచేస్తున్నారో మీరు కూడా సమసమాజం కోసం పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. ఇంకా కమ్యూనిస్టు భావజాలంతో పనిచేస్తున్న వారు, తమ విధులను సక్రమంగా పనిచేస్తున్నారు కాబట్టే ప్రజలకు ఈ కొద్ది సమస్యలు పరిష్కారం అవుతున్నాయని లేదంటే మొత్తం ఉన్నోడి సమాజం గా ఏర్పడి అసమానతల సమాజం ఏర్పడుతుందన్నారు. రాబోయే కాంపిటీషన్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సంపాదించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఇంటర్‌లో 983, 972 మార్కులు సాధించిన అక్షిత, నికిత,442 మార్కులు సాధించిన సందేశ్, పదో తరగతిలో 9.8 మార్కులు సాధించిన అభిరామ్, అరవింద్, యశ్వంతు లను సన్మానించారు .ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వి .హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆకు బత్తిని ప్రవీణ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ చారి, సీపీఐ నాయకులు వంగాల శ్రీనివాస్, చంద్రయ్య,సుధాకర్, ఇమామ్, మహబూబ్,నరేందర్,శేఖర్,ఉపేందర్, అక్రమ్‌లు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో నారాయణ విద్యార్థుల సంచలనం



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

పదో తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి సంచలనం సష్టించారని నారాయణ పాఠశాల చింతల్ బ్రాంచ్ ఏజీఎం వైజయంతి అన్నారు. గురువారం పాఠశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మిలతో కలిసి వారు మాట్లాడారు. విద్యార్థుల కషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు తమ అధ్యాపక బృందం అకుంటిత దీక్షతో బోధించినందువల్లనే మంచి ఫలితాలు సాధించగలిగామన్నారు. కుత్బుల్లాపూర్ మండలంలోనే తమ నారాయణ విద్యార్థులు ఫలితాలలో సత్తా చాటి తలమా నికంగా నిలిచారన్నారు. తాజా పదో తరగతి ఫలితాల్లో ఐదుగురు విద్యార్థులు సీజీపీఏ (10/10), 50 మందికి పైగా విద్యార్థులు సీజీపీఏ 9.0 తో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం అధ్యాపక బందం, సిబ్బంది పాఠశాల క్యాంపస్‌లో పుష్పగుచ్ఛాలు అందజేసి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో బాణాసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఫలితాలతో రాణిస్తూ ఉన్నతులుగా ఎదగాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ఎస్టీపీలపై ప్రాజెక్టు డైరెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో జలమండలి నూతనంగా నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ)పై ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమీక్షలో ఆయన ఎస్టీపీల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీ విభాగం సీజీఎంలు, జీఎంలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన 'సాధన స్కూల్ ' విద్యార్థులు





నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్‌లోని " సాధన స్కూల్ " విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. పాఠశాలకు చెందిన జీ మాధవి, టీ దివ్య 10/10 జీపీఏతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. సుభాంగి సాగర్ 9.8/10, హిరా 9.8/10, అర్పిత దాస్ 9.7/10, ఎం సుధా రాణి 9.3/10, ఎస్ వసంత 9.2/10, వీ ఉమా 9.0/10, సమీరా బేగం 8.7/10, ఎం అక్షిత 8.5/10, ఎం మౌనిక 8.5/10 , ఏ వైష్ణవి 8.3/10, సయ్యద్ సమీనా 8.2/10, సహెర బేగం 8.0/10, ఆయేష్ బేగం 8.0/10 జీపీఏ సాధించినట్టు కరస్పాండెంట్ జి రాజులు తెలిపారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనబరచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. తమ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ప్రతిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల, అధ్యాపకుల ప్రోత్సాహం, క్రమశిక్షణతో కూడిన విద్య విధానమే తమ విజయానికి కారణం అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బహుమ తులు అందించి అభినందించారు. అనంతరం స్కూల్ ఆవరణలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సీఎంఆర్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని సీఎంఆర్ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.గురువారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో సీఎంఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక వార్డు ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డు అభివద్దే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ గోపాల్ రెడ్డి, అలి బేఘ్, దుర్గా ప్రసాద్ రెడ్డి,మధు యాదవ్, వైద్యులు రియాజ్, పవన్, సంతోషిని, వార్డు ప్రజలు సంతోష్ గౌడ్, మోనార్క్, శ్రీను,సాయి,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల ప్రభంజనం



నవతెలంగాణ-దుండిగల్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కొంపల్లి, సుచిత్రలోనీ సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులలో 9 మంది విద్యార్థులు జీపీఏ 10/10 సాధించగా, 9.0 పై జీపీఏలు లు 50 మంది విద్యార్థులు సాధించగా, 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ నరిశెట్టి సుందర రాజు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అధ్యాపకుల కషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరితా , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్లు ప్రారంభం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలో సీసీ రోడ్లను మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లలో గల బస్తీలు, కాలనీలలో బీటీ, సీసీ, వీడీసీసీ కొత్త రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే మంచినీరు, డ్రయినేజీలను ఆధునీకరణ కూడా చేపట్టినట్టు వెల్లడించారు. ఫుట్ పాత్‌ల అభివృద్ధి, పార్కుల సుందరీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు.ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తున్నామని, ప్రధానంగా కలుషిత మంచినీటి సమస్య పరిష్కరించడానికి కషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని, ప్రభుత్వ విప్, మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ఏకైక లక్ష్యంగా పేర్కొన్నారు.

సత్తా చాటిన కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ





తెలంగాణ ఎస్ఎస్‌సీ 2023 పరీక్ష ఫలితాల్లో అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్, బొరబండ కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. హనీఫా 9.7 జీపీఏతో, ఎం ప్రసన్న 9.2 జీపీఏ సాధించారు. వారిని చైర్మెన్ రాజు సంగని, జోనల్ మేనేజర్ జావేద్, ప్రిన్సిపల్ టి. వేణుగోపాల్, అధ్యాపక బందం ప్రత్యేకంగా అభినందించారు.

విజ్ఞానభారతి విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ-నాచారం

పది ఫలితాల్లో వెంకట రమణ కాలనీ, మల్లాపూర్ కు చెందిన విజ్ఞానభారతి హై స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 113 మంది పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన ఆర్. వర్షిత10/10 జీపీఏ సాధించగా ఎన్.హర్షిత , ఎం.భవ్యశ్రీ, ఎన్.మృదుల 9.7, కే. శ్రీవిజ్ఞ, వీ.ప్రవీణ్ కుమార్ రెడ్డి 9.5 సాధించారన్నారు. విద్యార్థులకు చక్కగా బోధించి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు ఆర్‌వీ. ప్రసాద్, పుష్పలత, రాధ, సంధ్యమానస, గునలక్ష్మి, సాజీత బేగంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

65వ రోజుకు హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర 65వ రోజుకు చేరుకుంది. గురువారం జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని హెచ్ ఏ ఎల్ రాఘవేంద్ర కాలనీ (ఎస్బిఐ బ్యాంక్) పరిధిలో జెండా ఎగరవేసి , దుర్గా ఎస్టేట్ , బ్యాంక్ కాలనీ, ఎం.ఎస్.రెడ్డి నగర్ (శివాలయ టెంపుల్) వరకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి గడపగడపకు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు వెన్నెముకగా ఈ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్

ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలిగా గుర్తింపు పొందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నర్సుల కృషిని గుర్తించి, అభినం దించేందుకు ఈ అవకాశం కల్పిస్తుంది. ఈ సంవత్సరం థీమ్- మా నర్సులు. మా భవిష్యత్తు నేటి, భవిష్యత్తులో ప్రజలకు నాణ్యమైన సంరక్షణ, ఆరోగ్య సేవలను అందించడంలో నర్సులకు కీలక పాత్ర ఉందని ఇది వెల్లడిస్తుంది. ఈ సంద ర్భంగా ఏఎన్ఎస్ఈఐ మొదటి వైస్ ప్రెసి డెంట్, వ్యవస్థాపకులు, ఐహెచ్ హెల్త్ కేర్ ఇండియా నర్సింగ్ డైరెక్టర్ డాక్టర్ జోతి క్లారా మైఖేల్ మాట్లాడుతూ... ఈ ఉన్నతమైన వృత్తిలో సాంకేతికత, సామర్థ్యం గుర్తించటం ద్వారా తాము ఆరోగ్య సంరక్షణలో అంతరాలను తగ్గించగలమన్నారు. మన దేశంలో రోగి ఫలితాలను మెరుగుపరచగలమన్నారు. సాంకేతికత వనరుల పరిమితులను దాటి లక్ష్యం చేరుకోవడానికి, వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి సాంకేతికత తగిన శక్తినిస్తుందన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలకు ఇబ్బందులు కలగకుండ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పండిత్ నెహ్రూ నగర్‌లో ప్లాట్ నెంబర్ 157 నుంచి పండిత్ నెహ్రూ నగర్ కమిటీ హాల్ వరకు జలమండలి ఏఈ విలియం ప్రకాష్, బస్తీ అధ్యక్షులు చాంద్ బాయ్‌తో కలిసి ఆమె పాదయాత్ర చేశారు. అనంతరం డ్రయినేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని రోజులు నుంచి డ్రయినేజీ పైప్‌లైన్ చిన్నదిగా ఉండడం వల్ల డ్రయినేజీ వాటర్ పొంగి రోడ్డు పైకి రావడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారన్నారు. దాంతో కొత్త డ్రయినేజీ లైన్ శాంక్షన్ చేయించామన్నారు. బస్తీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తొందర్లోనే పనులన్నీ పూర్తవుతాయన్నారు. బస్తీ వాసులు ఆనందంతో సబిహా గౌసిద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్ భాయ్, సుభాన్, సైలని, అక్బర్, కాదిర్, నజీర్, అమీద్, నరసింహ, తాజ్ బి, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో వివేకానంద' విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-ఉప్పల్

పదవ తరగతి ఫలితాల్లో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలలో మరాఠి మైత్రి 9.8 జీపిఎ, గడ్డం నందిని 9.8 జీపిఎ సాధించి సత్తా చాటారని స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్, అడ్మినిస్ట్రేటర్ ఉష.. విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణం అని వారు తెలిపారు

నవచిత్రం



ఈసారి పెర్ఫామెన్స్ బద్దలై పోద్ది..

'గబ్బర్ సింగ్' బ్లాక్ బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తయింది. అలాగే మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు మేకర్స్. అంతేకాకుండా 'గబ్బర్ సింగ్' సెంటిమెంట్‌ని పాటిస్తూ, ఆ సినిమా విడుదలైన తేదీ మే 11కే ఈ చిత్ర ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల కావడం మరింత ప్రత్యేకంగా నిలిచింది. గురువారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో ఫస్ట్ గ్లింప్స్ విడుదల వేడుక ఘనంగా జరిగింది. 'ఏ కాలమున ధర్మమునకు హాని కలుగునో, అధర్మము వృద్ధి నొందునో, ఆయా సమయములయందు ప్రతి యుగమునా అవతారము దాల్చుచున్నాను' అంటూ ఘంటసాల చెబుతున్న భగవద్గీతలోని శ్లోకంతో గ్లింప్స్ ప్రారంభమైంది. "భగత్.. భగత్ సింగ్.. మహంకాళి పోలీస్ స్టేషన్, పాతబస్తీ" అంటూ ఖాకీ చొక్కా, గళ్ళ లుంగీ, నుదుటున తిలకంతో జీపులోనుంచి దూకుతూ ఎంట్రీ ఇచ్చారు పవన్ కళ్యాణ్. కేవలం 40 సెకన్ల వీడియోలోనే తన మ్యానరిజమ్స్, యాటిట్యూడ్, ఆవేశంతో గూజ్ బంప్స్ తెప్పించారు. చివర్లో 'ఈసారి పర్ఫామెన్స్ బద్దలైపోయిద్ది' అంటూ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో ముందే చెప్పేశారు. ఇక దేవి శ్రీ ప్రసాద్ అందించిన నేపథ్య సంగీతం గ్లింప్స్‌ని మరోస్థాయికి తీసుకెళ్లింది అని మేకర్స్ తెలిపారు. అభిమానుల సమక్షంలో పండుగలా జరిగిన ఈ వేడుకలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని సతీష్ కోట చేతుల మీదుగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "గబ్బర్ సింగ్' మన పదేళ్ల ఆకలి తీరిస్తే.. గబ్బర్ సింగ్ నుంచి భగత్ సింగ్ వరకు ఇది నా 11 ఏళ్ళ ఆకలి. ఈ క్షణం కోసం 11 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. అందుకే ఈ ఎగ్జైట్‌మెంట్‌ని ఫ్యాన్స్‌తో పంచుకోవాలని, మీ సమక్షంలో గ్లింప్స్‌ని విడుదల చేశాం' అన్నారు.

ప్రేక్షకుల తీర్పే ఫైనల్..



నాగ చైతన్య

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబోలో వస్తున్న తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయికగా శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాని నిర్మించారు. పవన్‌కుమార్ సమర్పిస్తున్నారు నేడు (శుక్రవారం) ఈ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో హీరో నాగచైతన్య మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

అవుట్‌పుట్ చూశాకా ప్రేక్షకులు ఎలా రెస్పాండ్ అయ్యే ఛాన్స్ ఉంది?

- సినిమా చాలా బాగా వచ్చింది. ఫలితంపై చాలా నమ్మకంతో ఉన్నా. అయితే ఆడియన్స్ ఎలా స్వీకరిస్తారో వారి తీర్పే ఫైనల్. నేను చేసే ప్రతి సినిమా డిఫరెంట్‌గా ఉంటుంది. అలాగే ఇది కూడా. ఈ సినిమా తర్వాత పూర్తి భిన్నమైన సినిమా చేయబోతున్నా

పోలీస్ నేపథ్యం కదా.. యాక్షన్ పార్ట్ ఎలా ఉంటుంది?

- ఇందులో యాక్షన్ సీన్స్ చాలా నేచురల్‌గా ఉంటాయి. ఫైట్ మాస్టర్లతో రిహార్సల్స్ చేశాక చిత్రీకరణకు వెళ్లాం. పైకి ఎగిరే సన్నివేశాలు, అండర్ వాటర్ వంటి సీన్స్ వారితో చర్చించాక చేసినవే. కస్టడీ ట్రైలర్, టీజర్‌లో అది మీకు కనిపిస్తుంది. మనం ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రేక్షకులు ఇట్టే పట్టేస్తారు. అందుకే కీలమైన యాక్షన్ పార్ట్‌ను చాలా జాగ్రత్తగా చేశాం. ఇక పోలీస్ నేపథ్యంలో ఉండే ఈ ఫైట్స్ బాగా అలరిస్తాయి.

మీ పాత్ర తీరు గురించి?

- నేను కానిస్టేబుల్‌గా నటించా. నా పాత్రపరంగా దర్శకుడు వెంకట్‌ప్రభు చెప్పింది చెప్పినట్లు తీశారు. నేనూ పూర్తి న్యాయం చేశాను. ఎంజాయ్ చేస్తూ చేశా.

అరవింద్ స్వామితో నటించటాన్ని ఎలా ఫీలవుతున్నారు?

- అరవింద్‌సామికి స్క్రిప్ట్ పేపర్ ఏది ఇస్తారో దాన్ని ఓన్‌గా తన శైలిలో ఇంప్రూవ్‌మెంట్ చేసుకుంటారు. ఆయన తీరు నాకెంతో బాగా నచ్చింది. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా హ్యాపీగా అనిపించింది.

కృతి శెట్టి నటన గురించి?

- ఇందులో తను ఫ్యామిలీ ఎమోషన్స్ బాగా పండించింది. నటిగా తను చాలా మెచ్యూర్డ్. తమిళం బాగా నేర్చుకుంది.

తమిళంలో డబ్బింగ్ మీరే చెప్పారా?

- నటుడిగా వాయిస్ ముఖ్యం. అందుకే తమిళంలో నేనే డబ్బింగ్ చెప్పాను. మొదట్లో చిన్న చిన్న లోపాలున్నా అంతిమంగా బాగానే చెప్పగలిగాను.

నాగార్జునకి శివ, మీకు కస్టడీ అని నిర్మాత అన్నారు..?

- ఏ సినిమాకూ 'కస్టడీ'ని కంపేర్ చేయవద్దు. (నవ్వుతూ).

జీవితంలోనూ సెకండాఫ్ ముఖ్యమే..



నరేష్, పవిత్రా లోకేష్

నరేష్ వికె, పవిత్ర లోకేష్ జంటగా ఎమ్ఎస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మళ్లీ పెళ్లి'. ఈనెల 26న విడుదలకు సిద్ధమవుతోంది. విజయకృష్ణ మూవీస్ బ్యానర్ పై నరేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను గురువారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ, 'ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలి. అది సినిమాకే కాదు జీవితం కూడా అలాగే ఉండాలని అనుకుంటాం. ఇది ప్రపంచ సమస్య. దీనిపైనే ఓ సినిమా తీయాలనుకుని చేసిందే ఈ సినిమా అని అన్నారు.' అని తెలిపారు. 'ట్రైలర్, టీజర్ చూశారు. ఇది మచ్చు తునక మాత్రమే, సినిమాలో చాలా విషయం ఉంది. ఈ కథకు టైటిల్ ఏం పెట్టాలని అనుకున్నప్పుడు గతంలో కృష్ణ, విజయనిర్మల నటించిన 'మళ్ళీ పెళ్లి' గుర్తుకువచ్చి, అదే టైటిల్ పెట్టాలనిపించింది. గౌరవప్రదమైన సినిమా తీశాం. గొప్ప అనుభూతిని మీకు అందిస్తాం. అయితే ఇది నా బయోపిక్ కాదు' అని నరేష్ చెప్పారు. పవిత్ర లోకేష్ మాట్లాడుతూ, 'విజయకృష్ణ ఫిలింస్ బేనర్‌లో సినిమాలు ప్రేక్షకులు ఎంజాయ్ చేసేవిధంగా ఉంటాయి. ఓ మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాం' అని అన్నారు.



జయహో జైస్వాల్

- 47 బంతుల్లో 98 నాటౌట్
- కోల్‌కతపై రాజస్థాన్ గెలుపు



నవతెలంగాణ-కోల్‌కత

యశస్వి జైస్వాల్ (98 నాటౌట్, 47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన అర్థ సెంచరీ కొట్టాడు. ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లోనే రెండు సిక్సులు, నాలుగు ఫోర్లు బాదిన జైస్వాల్.. అదే జోరులో 13 బంతుల్లోనే అర్థ శతకం సాధించాడు. టీ20 ఫార్మాట్‌లో ఓవరాల్‌గా యువరాజ్ సింగ్ (12) తర్వాత వేగవంతమైన అర్థ సెంచరీ రికార్డును సొంతం చేసుకున్నాడు. 150 పరుగుల ఛేదనలో జోశ్ బట్లర్ (0) రనౌట్‌గా నిష్క్రమించినా.. కెప్టెన్ సంజు శాంసన్ (48 నాటౌట్, 29 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు)తో కలిసి రాజస్థాన్ రాయల్స్‌కు 13.1 ఓవర్లలోనే 9 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు జైస్వాల్. కోల్‌కతపై గెలుపుతో సీజన్లో ఆరో విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఏడో ఓటమితో కోల్‌కత నైట్‌రైడర్స్ ఏడో స్థానానికి పడిపోయింది. యశస్వి జైస్వాల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. తొలుత యుజ్వేంద్ర చాహల్ (4/25) మాయతో కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 149 పరుగులే చేసింది. వెంకటేశ్ అయ్యర్ (57, 42 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు) అర్థ సెంచరీతో రాణించాడు.

కోల్‌కత ఓపెనర్లు జేసన్ రాయ్ (10), రెహ్మానుల్లా గుర్బాజ్ (18)లను పేసర్ ట్రెంట్ బౌల్ట్ అవుట్ చేశాడు. వరుస ఓవర్లలో ఓపెనర్లను డగౌట్‌కు చేర్చిన బౌల్ట్ రాయల్స్‌కు బ్రేక్ సాధించాడు. కెప్టెన్ నితీశ్ రానా, వెంకటేశ్ అయ్యర్‌లు మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించారు. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా 10 ఓవర్లలో కోల్‌కత నైట్‌రైడర్స్ 76/2తో మెరుగ్గానే కనిపించింది. కానీ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు నితీశ్ రానా (22), వెంకటేశ్ అయ్యర్ (57), రింకూ సింగ్ (16), శార్దుల్ ఠాకూర్ (1)లను అవుట్ చేశాడు.దీంతో కోల్‌కత 149 పరుగులకే పరిమితమైంది.

చాహల్ రికార్డు : ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా యుజ్వేంద్ర చాహల్ రికార్డు సృష్టించాడు. కోల్‌కతతో మ్యాచ్‌లో నితీశ్ రానా వికెట్‌తో డ్వేన్ బ్రావో (183) రికార్డును చాహల్ అధిగమించాడు. మ్యాచ్‌లో నాలుగు వికెట్లు కూల్చిన చాహల్ ఓవరాల్‌గా 187 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

స్టేటస్ రిపోర్టు ఇవ్వండి!

- ఢిల్లీ పోలీసులకు మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశం
- మేజిస్ట్రేట్ ఎదుట మైనర్ వాంగ్మూలం నమోదు
- ఉద్యృతంగా సాగుతున్న రెజ్లర్ల ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ

మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) లోక్‌సభ సభ్యుడు, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన గురువారం మరింత ఉధృతంగా కొనసాగింది. నిరసన కార్యక్రమంలో భాగంగా మే 11 (గురువారం) 'బ్లాక్ డే'గా పాటించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్లయోధులు, మద్దతుదారులు జంతర్‌మంతర్ వద్ద బ్లాక్ డే పాటించారు. బ్లాక్ డే సందర్భంగా సోషల్ మీడియా వేదికగా, జంతర్ మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారులకు అపూర్వ మద్దతు లభించింది.

మే 12న నివేదిక ఇవ్వండి : బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల కేసులో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ అంశంలో పోలీసుల దర్యాప్తును న్యాయమూర్తి పర్యవేక్షణలో జరిపించాలని కోరుతూ భారత అగ్రశ్రేణి రెజ్లర్లు ఢిల్లీ మేజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తీవ్రమైన కేసులో ఇప్పటివరకు బిజెపి ఎంపీని అరెస్టు చేయలేదు. దర్యాప్తులో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు అనుకూలత కలిగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు రెజ్లర్లు అనుమానం వ్యక్తం చేశారు. మల్లయోధుల పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన మేజిస్ట్రేట్ న్యాయస్థానం ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల్లో దర్యాప్తు స్టేటస్ రిపోర్టును అందజేయాల్సిందిగా ఆదేశించింది. మే 12లోగా ఢిల్లీ పోలీసులు స్టేటస్ రిపోర్టు సమర్పించాలని, ఆ రోజుకు పిటిషన్‌పై వాదనలను వాయిదా వేసింది.



జంతర్‌మంతర్ వద్ద బ్లాక్ డే నిరసనలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సంగీత ఫోగట్, సాక్షి మాలిక్ నిరసన

ఎట్టకేలకు వాంగ్మూలం : లైంగిక వేధింపులకు గురైన బాధిత రెజ్లర్లకు న్యాయం కల్పించటంలో ఢిల్లీ పోలీసులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పోక్సో చట్టం, 2012 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోక్సో కేసులో బాధితురాలి వాంగ్మూలాన్ని నేరుగా మేజిస్ట్రేట్ నమోదు చేస్తారు. రెజ్లర్ల ఆందోళన 20వ రోజుకు చేరుకున్నప్పటికీ.. ఢిల్లీ పోలీసులు ఆ పని చేయలేదు. తాజాగా క్రిమినల్ పీనల్ కోడ్, సెక్షన్ 164 ప్రకారం మైనర్ మహిళా రెజ్లర్ వాంగ్మూలం బుధవారం న్యాయమూర్తి ఎదుట నమోదు చేశారు. మరో ఆరుగురు మహిళా రెజ్లర్ల వాంగ్మూలాలు సైతం న్యాయమూర్తి త్వరలోనే నమోదు చేయనున్నట్టు సమాచారం.

ఫిర్యాదుల కమిటీలు ఎక్కడ? : లైంగిక వేధింపుల నిరోధక చట్టం, 2013 ప్రకారం క్రీడా సమాఖ్యల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఏర్పాటు చేయాలి. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ లేదు. రెజ్లింగ్ సమాఖ్యతో పాటు మరో 15 జాతీయ క్రీడా సమాఖ్యలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) గురువారం నోటీసులు జారీ చేసింది. కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ, భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సహా మరో 15 నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు ఇచ్చింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొంది.

నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అద్వైత్



హైదరాబాద్: తెలంగాణ బుడతడు నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాడు. నాలుగేండ్ల అద్వైత్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసు చెస్ శిక్షకుడిగా రికార్డు సృష్టించాడు. అద్వైత్ రెడ్డి వయసు 4 ఏండ్ల 6 నెలలు. 51 మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు నిర్విరామంగా 30 గేమ్స్‌లో అద్వైత్ విజయం సాధించాడు. 2021లో టాలీవుడ్ నటి మంచు లక్ష్మి కుమార్తె నిర్వాణ, 2022లో పాన్ ఇండియా నటుడు అల్లు అర్జున్ కూతురు అల్లు అర్హ అధిగమించగా.. తాజాగా ఆ రికార్డును అద్వైత్ బద్దలుకొట్టాడు. సీజార్ చెస్ అకాడమీలో చెస్ ఓనమాలు నేర్చుకున్న అద్వైత్ సాధించిన ఘనత పట్ల తల్లిదండ్రులు సందేశ్ రెడ్డి, హిరణ్మై సంతోషం వ్యక్తం చేయగా, ఓక్‌రిడ్జ్ స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఆటలు

ప్రారంభోత్సవ కమిటీ చైర్మెన్‌గా జగన్

- సిఎం కప్ 2023లో కీలక బాధ్యతల అప్పగింత

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ 2023 టోర్నీ నిర్వహణలో జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఐఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్‌రావుకు కీలక బాధ్యతలు అప్పగించారు. సిఎం కప్ పోటీల నిర్వహణపై క్రీడా మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్‌లు బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో జగన్‌మోహన్ రావును రాష్ట్ర స్థాయి పోటీల ప్రారంభోత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించారు. మే 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియం సహా పలు వేదికల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,000 మంది క్రీడాకారులు రానున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పోటీపడే క్రీడాకారులకు వసతి, భోజన, రవాణ సదుపాయాల కల్పన బాధ్యతలను జగన్ మోహన్‌రావు సారథ్యంలోని కమిటీ పర్యవేక్షించనుంది. ' నాపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన మంత్రి, శాట్స్ చైర్మెన్‌కు కృతజ్ఞతలు. క్రీడాకారుల ప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ పోటీలను విజయవంతం చేసేందుకు నా వంతు కృషి చేస్తాను' అని జగన్‌మోహన్ రావు తెలిపారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.